విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజెంట్లద్వారా	పోస్టుద్వారా
నెల చందా	9-20	9-80
మూడు నెలలు	27-60	29-40
ఆరు నెలలు	55-20	58-80
సంవత్సరం	110-40	117-60

ఈ రేటు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును

VISALAANDHRA Phone No. 75301 ఉదయం *** Regd. No. H/VJ 47

విశాలాంధ్ర

704875

సంపుటి 26 సంచిక 243 | విజయవాడ 28—12—76 మంగళవారం | 6 పేజీలు 30 పైసలు

బంగ్లా అధ్యక్షుని సలహాదారుగా సైపుర్ రహమాన్ నియామకం

ఢాకా, డిసెంబరు 27

బంగ్లాదేశ్ అధ్యక్షులు జస్టిస్ ఎ.ఎం. సయామ్ తన సలహాదార్లమండలి సభ్యులుగా మహమ్మద్ సైఫుర్ రహమాన్‌ను నియమించారు.

రహమాన్‌కు వాణిజ్యశాఖ అప్పగించినట్లు బి.ఎస్.ఎస్. తెలియజేసింది.

గ్రామీణ బ్యాంకుల సంఖ్య పెంపుకై కేంద్రం నిర్ణయం

మార్చి ఆఖరుకు అదనంగా 10 బ్యాంకులు

న్యూఢిల్లీ, డిసెంబరు 27

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు లక్ష్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

1977 మార్చి 31 వ తేదీలోగా 50 గ్రామీణ బ్యాంకులు నెలకొల్పాలని మొదట కేంద్రం నిర్ణయించింది. ఇప్పుడా ఒకటి రెండు మాసాలలోనే పూర్తికానున్న దృష్ట్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే (1977 మార్చి 31) లోగా మరో 10 గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు చేయడానికి కేంద్రం నిర్ణయించింది. అంటే ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ఆఖరులోగా మొత్తం 60 గ్రామీణ బ్యాంకులు ఏర్పాటు కానున్నాయి.

అభివృద్ధిచెందని ప్రాంతాలవారికిన్యాయం చేకూర్చడానికి, అనేక రాష్ట్రాల వత్తిళ్ళ దృష్ట్యాను గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు లక్ష్యం మధ్యంతరంగా పెంచవలసి వచ్చింది.

1975 జూన్‌లో ప్రధాని శ్రీమతి గాంధి 20 అంశాల కార్యక్రమం ప్రకటించిన అనంతరం అదే సంవత్సరం జులై మాసంలో ఆర్థికమంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రకటించారు.

బ్యాంకుల ఏర్పాటు కార్యక్రమం అమలు విషయమై సిఫార్సులు చేయడానికి మొదట ఒక అధ్యయన బృందాన్ని నియమించారు. జాతీయ బ్యాంకులు మొదట గ్రామీణ బ్యాంకు ఏర్పాటువల్ల అట్టే శ్రద్ధవహించ లేదు. అయితే కాలంగడచే కొద్దీ బ్యాంకులు ఈ విషయంపట్ల శ్రద్ధచూప నారంభించాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు కూడా గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుపట్ల ఆసక్తి కనబరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని సహకార సంస్థలుకూడా బ్యాంకింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నాయి కాబట్టి కొత్తగా ఈ బ్యాంకులు ఏర్పాటుచేస్తే వాటి మధ్య వైరుధ్యం రావచ్చునేమో నని భయపడటం జరిగింది. అయితే ఆదరణ మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. సహకార సంస్థల కార్యక్రమాలకు, వాణిజ్య బ్యాంకుల కార్యక్రమాలకు, గ్రామీణ బ్యాంకుల కార్యక్రమాలు సహకరించే ధోరణిలో వున్నాయని తాజా సూచనలు తెలుపుతున్నాయి.

సహకార సంస్థలు స్థిరంగా, బలంగా వున్నచోట మాత్రం గ్రామీణ బ్యాంకులు వాటి పనిని భగ్నం చేయడంలేదు. సహకార ఉద్యమం బలంగా లేనిచోట మాత్రం ఆ పనిని పూరించే బాధ్యతను గ్రామీణ బ్యాంకులకు అప్పగించారు.

సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు గ్రామీణ బ్యాంకులు ప్రక్క ప్రక్కనే వుంటూ గ్రామీణ జనాభా పరపతి అవసరాలు తీర్చడానికి కృషి చేసేందుకు తగిన అవకాశం వున్నదని అధికార వర్గాలు ప్రకటించాయి.

దాదాపు దశాబ్దం క్రితం వాణిజ్య బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి సౌకర్యాలకోసం చాలా తక్కువ కృషి చేసేవి. ఇప్పుడా పరిస్థితి మారింది ముఖ్యంగా 1969 లో 14 ప్రధాన బ్యాంకులను జాతీయం చేసిన అనంతరం వాణిజ్య బ్యాంకులు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి సౌకర్యాలకు పాటుపడుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య బ్యాంకుల బ్రాంచీలు సంఖ్య 1833(1969)నుండి 8వేలకు పైగా పెరిగింది. కాగా వాణిజ్య బ్యాంకులు 1969 లో వ్యవసాయదార్లకు రు. 34 కోట్ల రుణ సహాయం అందజేయగా 1974 కు అది రు. 340 కోట్లకు పెరిగింది. అంటే పదిరెట్లు పెరిగింది. [పి. ఎస్ ఎస్.]

పేపరుమిల్లు లాకౌట్ ఎత్తివేత

రాజమండ్రి డిసెంబరు 27

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్‌మిల్లు ప్రకటించిన లాకౌట్‌ను మేనేజిమెంటు నేడు ఎత్తివేసింది.

మిల్లు యూనిట్లు ఉదయం నుండి పని చేయడం ప్రారంభించింది. డిసెంబరు 13వ తేదీన మేనేజిమెంట్ లాకౌట్ ప్రకటించింది.

ఇది ఇలా వుండగా రాష్ట్రంలోని పేపర్ పరిశ్రమలో ఉపాధిని దేశరక్షణ, భద్రత నిబంధనల క్రింద అత్యవసర సర్వీసుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

500 లేక అంతకుమించి కార్మికులున్న పేపర్‌పరిశ్రమలో ఉపాధి ప్రజలకు అవసరమని ప్రభుత్వం భావించినట్లు అధికార ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వును గవర్నర్ యీనెల 24వ తేదీన జారీచేశారు.

స్వయంగా వేసక్టమీ ఆపరేషన్

సిమ్లా, డిసెంబరు 27

ఇక్కడికి 84 కిలోమీటర్ల దూరంలోని దరమ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇన్‌ఛార్జిగా వున్న డాక్టరు మహంతన్ సిన్హ స్వయంగా వేసక్టమీ ఆపరేషన్ చేసుకొన్నారని సోలన్ డిప్యూటీ కమిషనర్ శ్రీ ఎస్.కె. శర్మ తెలియజేశారు.

ఆయన సమాచార్ విలేకరితో మాట్లాడుతూ ఇది చాలా అసాధారణ మయిందని తెలిపారు.

జస్లోక్ హాస్పిటల్లో మూత్ర పిండాల మార్పిడి ఆపరేషన్

బొంబాయి, డిసెంబర్ 27

దక్షిణ బొంబాయిలో జస్లోక్ హాస్పిటల్లో అమెరికన్ డాక్టర్ శామ్యూల్ కొంట్జ్ ఇద్దరు రోగులకు నేడు మూత్ర పిండాల మార్పిడి ఆపరేషన్లు చేశారు.

ఆయన న్యూయార్కునుండి ఇక్కడికు విమానంలో వచ్చారు. ఇద్దరు భారతీయ సర్జన్ల సహకారంతో ఆపరేషన్లు చేశారు. మృతిచెందినవారి మూత్రపిండాలు కూడా అమెరికానుండే తెప్పించబడ్డాయి.

శ్రీమతి మమాజ్‌దిక్ (48 సం॥) శ్రీ షేక్ జలాఉద్దీన్ (40 సం॥)లకు ఈ మూత్రపిండాలను అమర్చడం జరిగిందని జస్లోక్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా॥ శాంతిలాల్ మెహతా పత్రికా విలేకరులకు తెలియచేశారు.

జస్లోక్ హాస్పిటల్ వైద్య పరిశోధనా సంస్థ క్రిందటి ఏప్రిల్‌లో మూత్ర పిండాల ఆపరేషన్‌ను జయప్రదంగా చేసిందని డా॥ మెహతా తెలియచేశారు.

న్యూయార్కు స్టేట్ యూనివర్శిటీకి చెందిన సర్జన్ పర్యటనను న్యూఢిల్లీలోని శాస్త్రీయ పరిశోధన మండలి సహకారంతో అమెరికా సెమినార్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది.

మూత్ర పిండాల మార్పిడి ఆపరేషన్‌లో డా॥ కొంట్జ్‌కు, డా॥ టి. కె. ఎస్. రావు డా॥ పి. పి. గుప్తా, డా॥ తంగవి సహాయ పడ్డారు.

రు. 356 కోట్ల పెట్టుబడితో రాష్ట్ర వార్షిక ప్రణాళిక

కేంద్రానికి సమర్పించినట్లు ముఖ్యమంత్రి వెల్లడి

హైదరాబాదు, డిసెంబరు 27

వచ్చేసంవత్సరం ఆంధ్రప్రదేశ్ వార్షిక ప్రణాళికలో రు. 356 కోట్ల ఖర్చు అంచనాతో రూపొందించిన ముసాయిదాను కేంద్రానికి పంపినట్లు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నేటి ఉదయం సచివాలయంలో పత్రికా విలేకరులకు తెలిపారు.

ఈ విషయాలు చర్చించేందుకు 1977 జనవరి 8వ తేదీన ఢిల్లీ వెళ్ళనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగే చర్చలలో ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షులు శ్రీ హక్సర్, ప్రణాళికా మంత్రి కూడా పాల్గొంటారని చెప్పారు.

ఈ సంవత్సరం ప్రణాళిక అమలుకు 290 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు.

వచ్చే ఏడు ప్రణాళికా మొత్తంలో అధికంగా విద్యుచ్ఛక్తి, నీటిపారుదల రంగాలకు ఖర్చు చేయమన్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో కరువు సహాయ కార్యక్రమాల అమలుకు ప్రణాళికేతర నిధులను కేటాయించవలసిందిగా కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు.

నాగార్జునసాగర్ వద్ద నెలకొల్పే 400మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన రివర్సిబుల్ టర్బయిన్లకై హెచ్.ఇ.ఎల్.సంస్థ ప్రపంచ వ్యాప్తంగా టెండర్లు కోరిందని వాటిపై వచ్చేనెలలో నిర్ణయం తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

వచ్చే మార్చి నాటికి కొత్తగూడెం థర్మల్ కేంద్రంవద్ద 110 మెగావాట్ల విభాగం, జూన్ నాటికి మరో 110 మెగావాట్ల విభాగం పని ప్రారంభించనున్నట్లు వివరించారు.

20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలుకు వివిధ బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు ఇచ్చిన రుణాల వసూళ్ళకు జిల్లాకలెక్టర్లకు తగు అధికారాలు ఇవ్వాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించిందని అయితే దీనికి కేంద్రం ఆమోదించవలసి వుందన్నారు.

కలెక్టర్లకు అధికారాలుసంక్రమింపచేసేందుకు ఆర్డినెన్సు జారీ చెయ్యడమో, చట్టాన్ని సవరించడమో జరుగుతుందని శ్రీ వెంగళరావు తెలిపారు.

వరంగల్, కాకినాడ మెడికల్ కాలేజీల స్వాధీన కార్యక్రమం

గుంటూరు, డిసెంబరు 27

కాకినాడ వరంగల్‌లోగల ప్రైవేటు మెడికల్ కాలేజీలను ఏప్రిల్ నాటికి స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది,

ఈ విషయాన్ని ఆరోగ్యశాఖమంత్రి శ్రీ రాజమల్లు నేడిక్కడ పత్రికాగోష్టిలో తెలియజేశారు. ప్రభుత్వ యాజమాన్యం క్రింద ప్రైవేట్ మెడికల్ కాలేజీలను తీసుకోవాలనే కార్యక్రమాన్ని ఏప్రిల్‌లో పూర్తి చేసిన తర్వాత వైద్య విద్యకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుచేసి సంస్కరణలు చేపట్టడం జరుగుతుందన్నారు,

రాష్ట్రంలోని వైద్యకళాశాలల లోపాలను రెండు, మూడు సంవత్సరాలలో సవరించటం జరుగుతుందని, ఆ తర్వాత వైద్య కళాశాలలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయం ఏర్పాటు విషయాన్ని పరిశీలించటం జరుగుతుందన్నారు.

కుటుంబనియంత్రణ వ్యతిరేక చిత్రాలను నిషేధించినట్లు శ్రీ రాజమల్లు తెలిపారు. నిర్బంధకుటుంబనియంత్రణకు సంబంధించి ముసాయిదా బిల్లును ప్రభుత్వంపరిశీలిస్తున్నదని, అవసరమైతే యీ బిల్లును చేపట్టటం జరుగుతుందన్నారు

వైద్యకళాశాలలో సీట్లను వెయ్యినుండి 800 లకు క్రమంగా తగ్గించటంతోపాటు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు అభిరుచిని బట్టి ఒక కోర్సును ఎంపిక చేసుకునే పద్ధతి స్థానే అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించే కోర్సు చేపట్టేటట్లు చర్యలు తీసుకోవటం జరుగుతుంది.

నౌకా రవాణా రేట్లలో కనీస సుస్థిరత

న్యూఢిల్లీ, డిసెంబర్ 27

నౌకా రవాణా రేట్లలో కనీస స్థిరత్వాన్ని సంప్రదింపులద్వారా సాధించలేకపోతే తగురీత్యా ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని వాణిజ్యమంత్రి శ్రీ డి. పి. చటోపాధ్యాయ హెచ్చరించారు.

ఇటీవల ఏర్పరిచిన (నౌకలద్వారా) ఎగుమతుల అభివృద్ధిస్థాయి కమిటీ ప్రథమ సమావేశాన్ని నేడిక్కడ ప్రారంభిస్తూ వివిధ ప్రాంతాల షిప్పర్ల అసోసియేషన్లనుద్దేశించి మంత్రి పై హెచ్చరిక చేశారు.

వాణిజ్య వ్యాప్తిలో నౌకా రవాణా రేట్లు కీలకమైనవి. భారత్‌వంటి వర్ధమానదేశాలకివి మరింత ఆందోళనకరం.

విచ్ఛిన్నకర ధోరణులపై అధ్యయనం : హసన్ సూచన

చండీఘర్, డిసెంబరు 27

జాతి జీవనాన్ని విషపూరితం చేస్తున్న కులతత్వం, మతతత్వం, భాషా, ప్రాంతీయవాదాలపై భారత సామాజిక అధ్యయన వేత్తలు పరిశోధించి జాతీయాభివృద్ధికి దోహదం చేయాలని విద్యామంత్రి ప్రొఫెసర్ నూరుల్ హసన్ అన్నారు.

పంజాబ్ యూనివర్శిటీలో 18 వ అఖిల భారత సామాజికాధ్యయన మహాసభను ఆయన నిన్న ప్రారంభోత్సవం చేశారు. విచ్ఛిన్నకర ఉద్యమాల చుట్టూ పుట్టుకొచ్చే పరిణామం, పద్ధతులను బహిర్గతం చేయాలి. మారుతున్న కాలాన్ని ప్రేక్షకులుగా చూడడము సామాజిక అధ్యయన వేత్తలకు తగదు. ప్రస్తుత దుస్థితులను నిర్మూలించి భవిష్యత్ నిర్మాణానికి బాటలు వేయాలన్నారు.

వ్యతిరేక ధోరణి

పలువురు భారతీయ మేధావుల్లో వ్యతిరేక ఆలోచనా ధోరణి పట్ల శ్రీ హసన్ ఆందోళన వెలిబుచ్చారు.

గత 30 ఏళ్ళలో దేశ సామాజిక జీవనంలో ముఖ్యమయిన మార్పులు వచ్చాయి. వీటికి దీర్ఘకాలిక పర్యవసానాలున్నాయి. వచ్చే పదేళ్ళలో నూతన సామాజికార్థిక వ్యవస్థ ఆవిర్భవించవచ్చు.

సామాజిక అధ్యయనంలో పశ్చిమ దేశాల పద్ధతుల అనుసరించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

సోషలిస్టు, తృతీయ ప్రపంచం అనుభవం

సోషలిస్టు, తృతీయ ప్రపంచ దేశాల అనుభవంలో మనకు పనికివచ్చే ఎంతగానో ఉందని మహాసభ అధ్యక్షులు ప్రొఫెసర్ దూబే అన్నారు.

ఈ అనుభవాన్ని విశ్లేషించి అందజేయాలి. అయితే వర్తమాన భారతీయ సమస్యల పరిష్కారానికి చిట్కాలు వేరేచోట దొరకవు. మనమే వాటిని రూపొందించాలి. విదేశీ పద్ధతుల అనుసరించడానికి బదులు జాతీయ అవసరాలకు అనుగుణంగా అధ్యయనంసాగాలి. పశ్చిమ సామాజిక శాస్త్రాన్ని గుడ్డిగా అనుకరించడం, గుడ్డిగా నిరాకరించడం రెండూ ప్రమాదమేనన్నారు.

మరో 2.38 లక్షల టన్నుల ఖాద్య తైలాల దిగుమతి

న్యూఢిల్లీ, డిసెంబరు 27

దేశంలో ఖాద్యతైలాలకు ఏర్పడిన గిరాకీ దృష్ట్యా ప్రభుత్వవాణిజ్యసంస్థ మరో 2.38 లక్షల టన్నుల ఖాద్యతైలాలను దిగుమతి చేసుకోవాలని యోచన చేస్తున్నది.

ఇంతకుముందు డిసెంబరు 14 వరకు 2.62 లక్షల టన్నులు, 1977 మార్చి వరకు మరొక 1.215 లక్షల టన్నుల దిగుమతి కాంట్రాక్టు చేసుకొన్నది. ప్రస్తుతం దిగుమతి చేసుకోదలచిన మొత్తం 1977 అక్టోబరు వరకు సరిపడడానికై ఉద్దేశించబడింది.

ఇప్పుడు దిగుమతి చేసుకొంటున్న నూనెలో 1.91 లక్షల సోయాబీన్ నూనె, 10 వేల టన్నుల వేరుసెనగ నూనె, 35 వేల టన్నుల కుసుమ నూనె వుంది.

పట్టాలు తప్పిన గూడ్సు రైలు

విజయనగరం వద్ద

విజయనగరం, డిసెంబరు 27

హౌరా వెళుతున్న గూడ్సురైలు విజయనగరం సమీపాన నిగడం గ్రామం వద్ద ఈనెల 26వ తేదీ పట్టాలుతప్పింది. 9 బోగీలు పడిపోయాయి.

ఈ ప్రమాదంలో ఒక రైల్వే క్యాబిన్ పూర్తిగా ధ్వంసమయింది.

అందువల్ల 26వ తేదీ ఉదయం 11.20కి విజయనగరం రావాల్సిన హౌరా-మద్రాస్ మెయిల్ ఆలస్యంగా ఒంటిగంటకు చేరుకున్నది.

రైల్వే అధికారులు శిధిలాలను తొలగించి రైళ్ళ రాకపోకలకు వీలు కల్పిస్తున్నారు

విజయవాడ స్వామి అరెస్టు

యువతి ఆచూకి

విజయవాడ, డిసెంబరు 26

యువతులకు సంబంధించిన విజయవాడ స్వామి రామానందయోగీశ్వరస్వామిని పోలీసులు నేడు అరెస్టుచేశారు.

'స్వామి' కారణంగా అదృశ్యమైనట్లు భావింపబడిన యువతి కుమారి లక్ష్మి ఆచూకి తెలిసింది. ఆమె విజయవాడ చేరుకున్నది.

మాల్దీవుల ఉపాధ్యక్షుని రాక

న్యూఢిల్లీ, డిసెంబరు 27

భారత నాయకులతో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపేందుకు నేడిక్కడికి వచ్చిన మాల్దీవుల ఉపాధ్యక్షులు అహమ్మద్ హిల్మిదీదికి ఘనస్వాగతం చెప్పారు.

విమానాశ్రయంలో ఆయనకు విదేశాంగ శాఖ మంత్రి శ్రీ వై. బి. చవాన్ స్వాగతం చెప్పారు.

విమానాశ్రయంలో దీదీ విలేకరులతో మాట్లాడుతూ భారత నాయకులతో చర్చలకు ఎదురుచూస్తున్నానని అన్నారు.

శ్రీ చవాన్ స్వాగతం చెపుతూ భారత మాల్దీవులు అత్యంత సన్నిహితంగా వున్న పొరుగుదేశాలని, రెండు దేశాల ప్రయోజనాలలో కూడా సారూప్యతవుందని అన్నారు.

దీదీ పర్యటన సందర్భంగా సముద్ర సరిహద్దులకు సంబంధించి రెండు దేశాలు ఒక ఒప్పందంపై సంతకాలు చేస్తాయి.

విమానాశ్రయంలో దీదీకి స్వాగతం చెప్పిన వారిలో విదేశాంగశాఖ కార్యదర్శి శ్రీ జగత్ మెహతా, విదేశ వ్యవహారాలశాఖలో పని చేస్తున్న కార్యదర్శి శ్రీ యం. ఎ. వెల్లాడి, సంయుక్త కార్యదర్శి శ్రీ సహాబుద్దీన్‌లు వున్నారు.

కార్టర్ గురించి పాకిస్తాన్ బెంగ

న్యూయార్కు, డిసెంబర్ 27

జిమ్మీ కార్టర్ అమెరికా అధ్యక్షులు కావటంపట్ల పాక్ అధికార్లు "తీవ్ర ఆందోళన" చెందుతున్నారని ఇస్లామాబాద్ నుండి న్యూయార్కు టైమ్సు విలేకరి రాస్తున్నారు.

"ఆయన (కార్టర్) చెప్పే కొన్ని విషయాల గురించి నాకు చాలా ఆందోళనగా ఉంది" అని ఒక పాక్ ఉన్నతాధికారి అన్నారు. "వాషింగ్టన్‌తో మా సంబంధాలు దెబ్బతీసే ఏ విషయాన్ని మేం కోరుకోం" అని చెప్పారు.

"బొంబాయి దగ్గర తాను పని చేసిన హోటలుకి తిరిగి వెళ్ళాలని ఆమె (కార్టర్ తల్లి) అనుకొంటుందనీ, తన కొడుకును కూడా తీసుకెళ్తుందనీ చదివాను" అని ఆ అధికారి "బెంగ"తో చెప్పారనీ, ఆ విలేకరి కథనం.

స్టాక్‌హోం నూతన వినతిపై సంతకాల ఉద్యమం

పార్టీ శాఖలకు శ్రీ రాజేశ్వరరావు పిలుపు

న్యూఢిల్లీ, డిసెంబరు 26

ఆయుధ పోటీకి వ్యతిరేకంగా ఇచ్చిన స్టాక్‌హోం నూతన వినతిపై సంతకాల సేకరణ ఉద్యమాన్ని పార్టీ శాఖలన్నీ చేపట్టాలని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు పిలుపిచ్చారు.

సామరస్యాన్ని తిరుగు లేనిదిగా చేసేందుకు ప్రపంచ శాంతి శక్తుల ముందున్న ఈ ప్రధానమైన కార్యక్రమాన్ని జయప్రదం చేయడం తక్షణ కర్తవ్యమన్నారు.

ఆయుధాల పోటీ, ఆయుధాల నిల్వలు సామ్రాజ్యవాద దురాక్రమణలకూ, వైరి తత్వం, వలసవాదం, జాత్యహంకారాలకు ప్రోత్సాహమిస్తాయి.

పేదరికాన్ని అంతంచేసి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే బదులు విస్తారమైన పదార్థిక, శాస్త్ర, మానవ వనరులను వినాశం వేపు ఈ ఆయుధ పోటీ మళ్ళిస్తుంది. మన ఉపఖండం చుట్టుపక్కల ప్రాంతాలకు భారీ ఆయుధ సరఫరాలు, డిగోగార్షియాలో అణ్వాయుధ నౌకా స్థావరం, హిందూమహాసముద్ర సింహద్వారాన ఉన్న దక్షిణాఫ్రికాకు ఆయుధాలందించడం- ఇవన్నీ జాతీయ సార్వభౌమాధికారానికి ప్రమాదకరం.

మన దేశంలో ఈ స్టాక్‌హోం విజ్ఞప్తిని ఇప్పటికే పలువురు ప్రముఖ పార్లమెంటు, శాసనసభ్యులు బలపరిచారు. విజ్ఞప్తిలోని భావాల పట్ల భారత ప్రభుత్వం కూడా తన ఏకీభావాన్ని పార్లమెంటులో ప్రకటించింది.

మనపార్టీజాతీయసమితి ఆ విజ్ఞప్తిని హృదయపూర్వకంగా బలపరచింది. సాధ్యమైనన్ని ఎక్కువ సంతకాలు చేయించడం ద్వారా ఈ ఉద్యమాన్ని సంపూర్ణంగా జయప్రదం చేయమని మన పార్టీ శాఖలను కోరింది.

అధిక ధరల వ్యతిరేక ప్రదర్శనలకు విస్తృత సమీకరణ

శాఖలకు ప్రదేశ్ యువజన, విద్యార్థి సమాఖ్యల పిలుపు

హైదరాబాదు, డిసెంబరు 27

పెరుగుతున్న ధరలను అదుపులోపెట్టడం, ఆహార ధాన్యాలు ఇతర నిత్యావసర వస్తువుల టోకు వ్యాపారం స్వాధీనం, ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను విస్తరింప చేయడంవంటి ప్రజాహిత చర్యలను చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రజలలో ముఖ్యంగా యువతరంలో విస్తృతంగా ప్రచారం చేసేందుకుగాను జనవరి 1, 2 తేదీలలో పెద్దయెత్తున ప్రదర్శనలు జరపవలసిందిగా ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య తన శాఖలకు పిలుపిచ్చింది.

భారత కమ్యూనిస్టుపార్టీ ఇతర ప్రజా సంఘాలు యిచ్చిన పిలుపు మేరకు అధిక ధరల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా జరిగే ఊరేగింపులలో, బహిరంగసభలలో యువకులను విద్యార్థులను సాధ్యమైనంత హెచ్చు సంఖ్యలో సమీకరించాలని, రాష్ట్రంలోని యువజన, విద్యార్థి సమాఖ్యలశాఖలన్నింటికి కార్యదర్శులు శ్రీయుతులు రామకృష్ణారెడ్డి, రామచంద్రసింహారావులు విజ్ఞప్తి చేశారు.

రైతులకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు బోనస్, జీతాలు, [illegible], జాబ్, మందుల కంపెనీల జాతీయం తదితర చర్యల ప్రాముఖ్యతను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిందిగా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఖనిజాల పరీక్షకు కడపవద్ద లేబరేటరీ

త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ జయభారతరెడ్డి వెల్లడి

కర్నూలు, డిసెంబరు 27

రాష్ట్రంలో ఖనిజాభివృద్ధి నిమిత్తం రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో ఖనిజాల వెలికితీత కార్యక్రమాన్ని త్వరితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పరిశ్రమల శాఖ డైరెక్టర్ శ్రీ కె. జయభారతరెడ్డి నేడిక్కడ విలేకరులకు తెలియజేశారు.

భారత భూగర్భ పరిశోధనా సంస్థ రాష్ట్రంలో ఏ మేరకు ఖనిజాలు లభ్యం అయ్యేదీ త్వరలో స్పష్టంగా తెలియజేయగలదని, ఖనిజాల వెలికితీతకు వినియోగానికి సహాయం చేయగలదని అన్నారు. భారత భూగర్భ పరిశోధనా సంస్థ సర్వే అనంతరం బందర్‌లోగాని, లేదా ప్రకాశం జిల్లాలోగాని రు. 100 కోట్లతో సోడాయాష్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయడం జరుగుతుందని అన్నారు.

ఈ ప్రాజెక్టును దశల వారీగా నిర్మించాల్సివుందని, మొదటి దశలో ఇందుకు రు. 60 కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు.

బందరువద్ద రోజుకు 20 వేల టన్నుల ఉప్పు ఉత్పత్తి చేయగల కేంద్రాన్ని, కర్నూలు వద్ద కాల్షియం కార్బయిడ్ కర్మాగారాన్ని, ప్రొద్దుటూరు వద్ద [illegible] ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేయతలపెట్టినట్లు తెలిపారు.

కడపవద్ద ఖనిజాలను పరీక్షించేందుకు లేబరేటరీని త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రణాళికా సంఘం యిందుకు ఆమోదించిందని చెప్పారు.

కరుణానిధి సంబరం

వెల్లూరు, డిసెంబర్ 27

కమ్యూనిస్టుపార్టీ "పన్నాగాలను బహిర్గతం" చేసే ప్రధాని ప్రకటన సరైన సమయంలో వచ్చిందని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి హర్షం వెలిబుచ్చారు.

సౌర శక్తితో నడిచే పంపుసెట్ల ఉత్పత్తి

న్యూఢిల్లీ డిసెంబరు 27

సౌరశక్తితో నడిచే నీటి పంపులను ఉత్పత్తి చేయడంలో విజయాన్ని సాధించారు. [illegible] అశ్వశక్తిగల ఇటువంటి నీటిపంపులను ప్రస్తుతం ఉత్పత్తి చేయడం జరిగింది. ఈ ప్రాజెక్టుకు దేశంలోని వివిధ పరిశోధనా సంస్థలు అత్యంత ప్రాధాన్యతనిచ్చి కృషి చేసిన ఫలితంగా ఇది సాధ్యపడింది.

[illegible] సాంకేతిక శాస్త్రీయ సంస్థ డైరెక్ట్ కాంటాక్ట్ పేపర్ పంపును తయారు చేసింది. ఈ నమూనా తరహా పంపులు ఇప్పటికి 8 పనిచేస్తున్నాయి. ఉత్పత్తి ప్రాతిపదికగా ఈపంపు నమూనాలను రూపొందించి కార్యక్రమాన్ని భారత భారీ విద్యుత్ పరికరాలసంస్థ ప్రస్తుతం చేపట్టింది.

ఇది ఇలావుండగా లూధియానాలోని పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరో ప్రధానమైన విజయాన్ని సాధించింది. విశ్వవిద్యాలయం సౌరశక్తి విభాగంలో అత్యంత ప్రధానమైన కాన్సంట్రేటర్ కలెక్టర్ నమూనాను రూపొందించింది. ఈ నమూనా ప్రాతిపదికగా కొన్ని కలెక్టర్లను ఉత్పత్తిచేసి, వాటి పనివిధానాన్ని పరిశీలించి, దాన్ని మెరుగుపరిచే కార్యక్రమాన్ని చేపట్టాలని విశ్వవిద్యాలయం తలపెట్టింది.

సౌరశక్తితో నీటి పంపులను వుత్పత్తి చేసే కార్యక్రమంతో పాటు మరో రెండు పరికరాలను సోలార్ థర్మల్ ఎనర్జీ రిసెర్చి అండ్ ప్రాడక్టు డెవలప్‌మెంటు సంస్థ ప్రాధాన్యత యిచ్చి పరిశోధనలు జరుపుతుంది.

సౌరశక్తిద్వారా రోజుకు ఒకటి నుండి అయిదు టన్నుల ధాన్యాన్ని ఎండబెట్టటానికి త్రాగు నీటిని పరిశుభ్రం చేయటానికి అవసరమగు పరికరాలను ఉత్పత్తి చేసే కార్యక్రమాన్ని యీసంస్థ చేపట్టింది. ఈ దిశగా ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించబడింది.

సోలార్ థర్మల్ శక్తి విద్యుత్‌శక్తిగా మార్చటానికి ప్రస్తుతం రెండు రకాల సాంకేతిక పద్ధతులను అభివృద్ధి చేశారు. రెండు పద్ధతులలో [illegible] గ్రేటింగ్ కలెక్టర్లను ఉపయోగిస్తున్నారు.

స్క్వేర్స్ పాండర్, ప్లాటిప్లేట్, మీడియం టెంపరేచర్ కలెక్టర్లను ఉపయోగించి 10 కిలోవాట్ల శక్తిగల సౌర శక్తి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తిచేసే యంత్రాన్ని తయారు చేయటానికి ప్రస్తుతం కృషి జరుగుతున్నది. విద్యుత్ గ్రిడ్‌తోసంబంధంలేని మారుమూల గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయటానికి అవసరమగు జనరేటర్లను ఉత్పత్తిచేయటమే ఈ ప్రాజెక్టులక్ష్యం. (పి. టి. ఐ)

కెనరా బ్యాంక్ 1001 వ బ్రాంచి

మంగళూరు, డిసెంబర్ 27

కెనరా బ్యాంక్ 1001 వ బ్రాంచికి ఛైర్మన్ శ్రీ వి. ఇ. కామత్ నేడిక్కడ ప్రారంభోత్సవం చేశారు

ఈ సందర్భంగా ప్రముఖ కన్నడ రచయిత డాక్టర్ శివరామకారంత్‌కు మరో 9 మంది టీచర్లకు శాలువలిచ్చి సత్కరించారు.

ఎర్రగుంటవద్ద లారీ బోల్తాపడి ఏడుగురి మృతి

సంజయ్‌గాంధీ బహిరంగసభకు వెళుతుండగా దుర్ఘటన

భద్రాచలం, డిసెంబరు 27

కొత్తగూడెంలో మొన్న శ్రీ సంజయ్ గాంధీ బహిరంగసభకు జనాన్ని తీసుకొని వెళుతున్న లారీ ఇక్కడికి 30 కిలోమీటర్ల దూరంలోగల ఎర్రగుంటవద్ద బోల్తాపడగా 7 గురు మరణించారు.

మరో 10 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని కొత్తగూడెం ఆస్పత్రిలో చేర్చారు. (సమాచార్)

దేశానికి కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకమైందికాదు: ప్రధాన మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 27

ద్వితీయ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ వారిని కమ్యూనిస్టుపార్టీ బలపరచినప్పటికీ, దేశ స్వాతంత్ర్య సాధనా లక్ష్యాన్ని ఆ పార్టీ వ్యతిరేకించలేదని, వారు దేశానికి శత్రువులు కారని ప్రధాని శ్రీమతి గాంధి నేడిక్కడ అన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచి వేయటంలో ప్రముఖ పాత్ర వహించిన మహారాజులు, రాజులు తరువాత స్వతంత్ర పార్టీకి ప్రముఖ నాయకులయ్యారు. స్వాతంత్ర్యోద్యమకాలంలో అసలు జనసంఘ లేనేలేదు. అయితే ఆర్.ఎస్.ఎస్. హిందూ మహాసభలు స్వాతంత్ర్య పోరాటాన్ని వ్యతిరేకించాయి. ఈ రెంటినుండే జనసంఘ ఆవిర్భవించిందని ఆమె అన్నారు.

ప్రధాని విధానాలకు మద్దతుగా ఆమె నివాసంముందు ప్రదర్శన జరిపిన కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తూ ఆమె పైవిధంగా అన్నారు.

సోషలిస్టుపార్టీని సదుద్దేశాలతోనే ఆచార్య నరేంద్రదేవ్ ఏర్పరచారు. అయితే ఆయన మరణానంతరం ఆ పార్టీ పేర్లు మారాయి. అప్పుడు శ్రీ జవహర్‌లాల్‌నెహ్రూను, ఇప్పుడు తనను విమర్శించటమే ఈ పార్టీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు.

కమ్యూనిస్టుపార్టీని గురించి ఇటీవల నేను చెప్పిందేమీ కొత్తదేమీకాదు. ఈ విషయాన్ని చాలాకాలంగా నేను చెప్తూనేవున్నాను. నేను ఇతరుల ప్రచారానికి లోనవుతున్నట్లుగాచేసిన విమర్శలపై వ్యాఖ్య మాత్రమే కొత్తది. నేను అందరితో చర్చిస్తాను. అయితే చివరిగా నిర్ణయం తీసుకునేది నేనుమాత్రమేనని ఆమె అన్నారు

ఢిల్లీలో కొన్నిలేబర్ కాలనీలలో మినహా కమ్యూనిస్టుపార్టీకి పెద్దబలమేమిలేదు. వదంతులను ఒక పథకం ప్రకారం ప్రచారంలో పెడుతున్న జనసంఘ్ ఆర్.యస్.యస్. యొక్క సమస్యలను సృష్టిస్తున్నాయి. జనసంఘ్ మత వివాదాలు జరుగుతున్నందున మహిళలు కొన్ని అపోహలకు లోనయ్యారు అని ఆమె చెప్పారు.

ఈ విధమైన ప్రచారంపట్ల అప్రమత్తంగా వుండవలసిందిగా కాంగ్రెసువాదులను ఆమె కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తలు తమ తమ ప్రాంతాలలోగల ప్రతి ఇంటికివెళ్ళి తమ సంస్థ లక్ష్యాలను గురించి ప్రజలకు వివరించవలసిందిగా కోరారు.

విశాలాంధ్ర

1976 డిసెంబరు 28 మంగళవారం

సాగర్ విద్యుత్ ప్రాజెక్టు

ప్రణాళికా సంఘం ఆమోదించిన 30 విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులలో 400 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేసే నాగార్జునసాగర్ పంప్డ్‌స్టోరేజ్ పథకంకూడా వున్నది. ఈ మొత్తం ప్రాజెక్టులవల్ల ఆరవ పంచవర్ష ప్రణాళికలో 5 వేల మెగావాట్ల విద్యుత్ అదనంగా లభిస్తుంది. వ్యవసాయ, పారిశ్రామిక తదితర అభివృద్ధిరంగాలు విస్తరించే కొలదీ మనకు అవసరమౌతున్న విద్యుత్‌లో కొరతను కొంతమేరకైనా నివారించడానికి యీ 30 ప్రాజెక్టులు తగువిధంగా సహాయపడగలవు.

అసలు అనుకొన్న ప్రకారం ప్రాజెక్టులను పూర్తి చేయలేక పోవడం మూలాన్నే చిక్కులు ఏర్పడుతున్నాయి. సాగర్ విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ వ్యవహారం కూడా యిలాగే వున్నది. ఈ ప్రాజెక్టువద్ద సివిల్ వర్క్సు పూర్తి అయినాయి. ఐదవ పంచవర్ష ప్రణాళికలోనే కొంత పూర్తి గావల్సిన యీ పథకం నిధుల కొరత మూలంగా ప్రాథమిక దశలోనే వుండి పోవాల్సినస్థితి ఏర్పడింది.

మన రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తిలో యింకా వెనుకబడే వుంది. అఖిల భారత స్థాయిలో తలసరి దామాషా విద్యుత్ వినిమయం 100 కిలో వాట్లు కాగా ఆంధ్రప్రదేశ్‌లో యిది 64 కిలో వాట్లుగానే వున్నది. రాష్ట్రంలో మొత్తం 27,221 గ్రామాలుండగా 12,478 గ్రామాలకే నేడు విద్యుత్ సౌకర్యం కలుగ చేయబడింది. విద్యుత్ సౌకర్యం కోసం పెట్టబడిన 60 వేల దరఖాస్తులు పెండింగ్‌లోవుండి పోయాయంటే దీని అవసరం ఎంతవున్నదో అర్థం చేసుకోవచ్చును.

గత సంవత్సరకాలంలో దిగువసీలేరు ప్రాజెక్టుకు సంబంధించిన రెండు యూనిట్‌లు పనిచేయడం ప్రారంభించాయి ఈ రెండూ 215 మెగావాట్ల విద్యుత్‌ను అదనంగా ఉత్పత్తి చేస్తున్నాయి ప్రతి ఆరునెలలకు అదనంగా 115 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రకటించారు. నాల్గవ ప్రణాళిక చివరకు కేవలం 613 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిశక్తి ప్రస్తుతం 1100 మెగావాట్లకు చేరుకొన్నది. ఐదవ ప్రణాళికాంతానికి మొత్తం 1990 మెగావాట్ల ఉత్పత్తిశక్తిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ లక్ష్య సాధనలో యింకా పూర్తి కావాల్సిన [illegible] డెం విస్తరణ పథకం, శ్రీశైలం ప్రాజెక్టు, విజయవాడ థర్మల్ కేంద్రం, రామగుండం, మణుగూరు సూపర్ థర్మల్ కేంద్రాలు తగు విధంగా తోడ్పడగలవు. అదే విధంగా ఆరవ పంచవర్ష ప్రణాళికలో పూర్తి ప్రయోజనాలను సమకూర్చగల సాగర్ పంప్‌స్టోరేజ్ పథకం 110 మెగావాట్ల మొదటి యూనిట్‌కు మొత్తం 15.6 కోట్లు అవుతుందని అంచనా వేయబడింది. 1976-1977 చివరకు దానికి దాదాపు 14 కోట్లు ఖర్చు అయ్యే పనులు పూర్తి కావాల్సి వుంది. ఈ 400 మెగావాట్ల పథకంతో పాటు యితర ప్రాజెక్టులు కూడా శీఘ్రగతిన పూర్తి అయితే రాష్ట్రం యీనాడు ఎదుర్కొంటున్న కొరత, కోతల సమస్యలు పరిష్కారం కాగలవు.

సోషలిజం: హింస; శాంతియుత మార్గము

కాంగ్రెస్ సిద్ధాంత పత్రంలో, పిడివాదానికి దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్య మనబడే దానితో బాటు, కాంగ్రెస్ సోషలిజంలో అహింసకు ప్రత్యేక ప్రాముఖ్య ముంటుందనీ, అదే దానివిలక్షణ విశిష్టత అనికూడా పేర్కొనబడింది ఈ మూడు అంశాలూ - పిడివాద వ్యతిరేకత, ప్రజాస్వామ్యం, అహింస - సోషలిజాన్ని గూర్చిన యితరుల భావనలతో, కాంగ్రెసు భావనను విడదీస్తున్నా యంటుంది ఆ పత్రం

శ్రీ మొహిత్ సేన్

ఇంతకు ముందరి వ్యాసాల్లో ప్రజాస్వామ్యం, పిడివాదం అనే సమస్యలను వివరించేందుకు ప్రయత్నించాం. అలాగే ఈ వ్యాసంలో అహింస సమస్యపై విశ్లేషణతో యీ వ్యాస పరంపరను ముగిద్దాం. అయితే, అందుకు పూనుకొనే ముందు, "మార్క్సిస్టు సోషలిజం" స్థానంలో "ప్రజాతంత్ర సోషలిజాన్ని" అభిమానించే మా కాంగ్రెస్ మిత్రుల దృష్టికి మరో అంశాన్ని తీసుకురావాలని కోరుతున్నాం.

అదేమిటంటే, ఈ "ప్రజాస్వామిక సోషలిజం" అన్నది ప్రత్యేకించి భారతీయమైనది కాదన్నదే ఆ విషయం. కాంగ్రెస్ సిద్ధాంతపత్రమేపేర్కొన్నట్లుగా, ఈభావధార యూరపులో 19వ శతాబ్దపు చివరి భాగంలో ఆవిర్భవించింది. మిగిలిన రకాల మార్క్సిస్టు సోషలిజానికి, ప్రత్యేకించి లెనినిస్టు తరహా సోషలిజానికి, ఈ శతాబ్దపు తొలి సంవత్సరాల నుండి, భిన్నంగా యిది ఉద్భవించింది.

ఈ ధోరణికి సంబంధించిన క్రమ పరిణామ చరిత్ర నంతటినీ తడవడం యిక్కడ సాధ్యంకాదు. స్థూలంగా చెప్పుకోవాలంటే, యీ ధోరణి కమ్యూనిజానికి భిన్నంగా సోషల్-డెమాక్రసీగా (అంతకు ముందు అన్ని సోషలిస్టు ధోరణులూ ఇదే పేరు చలామణీ అయినా) చలామణీ అయింది. పలు యూరపియన్ దేశాల్లోను, కొన్ని లాటిన్ అమెరికన్ దేశాల్లోను, జపానులోను యీ రకమైన సోషల్-డెమాక్రటిక్ పార్టీలు వున్నాయి. తర్వాతి దశలో భారతదేశంలోని సోషలిస్టు పార్టీ కూడా ఆ దిశలోనే దిగజారింది.

మూడవ ఇంటర్నేషనల్ లేక కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కి చెందకుండా అవి రెండవ ఇంటర్నేషనల్‌కి, లేక సోషలిస్టు ఇంటర్నేషనల్‌కి చెందిన పార్టీలుగా పేరు పొందాయి. దృక్పథంలోను, కార్యక్రమంలోను, విస్తృత వైవిధ్యం కలిగిన పార్టీలివి. అయితే వీటిమధ్య కొన్ని ఉమ్మడి లక్షణాలున్నాయి: విప్లవానికి కాకుండా పరిణామానికి; సంపూర్ణ సోషలిస్టు పరివర్తనకి కాకుండా పెట్టుబడిదారీ విధాన సంస్కరణకి; ప్రజా సామూహిక విప్లవోద్యమానికి నిర్మాణానికి కాకుండా పార్లమెంటరీ ప్రచార కార్యక్రమాలకీ, తీవ్రమైన సోవియట్ వ్యతిరేకతకీ, కమ్యూనిస్టు వ్యతిరేకతకీ, వీటికి తోడు తమ తోటి బూర్జువా పార్టీలతో రాజీ పడగల అంగీకృతికీ- యివీ యీ పార్టీలకు గల ఉమ్మడి లక్షణాలు.

సోషల్ డెమాక్రటిక్ పాలనలో భారత దేశానుభవం

మన భారతదేశంలోను మనకి కూడా యిటువంటి సోషల్-డెమాక్రటిక్‌పార్టీల అనుభవం కొంత వుంది, బ్రిటిష్ వలస పాలనకి సంబంధించిన సుదీర్ఘ కాలంలో, రెండవ ఇంటర్నేషనల్‌లో ప్రముఖ స్థానం ఆక్రమించిన బ్రిటిష్ లేబర్ పార్టీ, మనదేశాన్ని, బానిసగా అణచి వుంచడానికి వ్యతిరేకంగా కొద్ది మంది ఉత్తమ వ్యక్తులు మినహాయించి మాట్లాడక పోవడం మాట అటుంచి అనేక మార్లు అదే పాలక పార్టీ కూడా అయిన సందర్భాలున్నాయి. 1930 దశాబ్దంలో జరిగిన శాసనోల్లంఘనోద్యమకాలంలో రామ్సే మాక్‌డొనాల్డు నాయకత్వాన లేబరు ప్రభుత్వమే అధికారంలో వున్నది. గాంధీజీ నెహ్రూలనూ పలువురు యితర కాంగ్రెస్ నాయకులనూ జైళ్ళలో కుక్కినదీ అదే!

అల్జీరియన్ల, వియత్నామీయుల అనుభవం కూడా యిదే. ఫ్రెంచి సోషలిస్టు పార్టీ, అల్జీరియన్, వియత్నామి ప్రజలకు వ్యతిరేకంగా ఫ్రెంచి వలసవాదులను బలపరచింది. డచ్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా ఇండోనేషియన్లు జరిపిన పోరాట సందర్భంలో కూడా యిదే వ్యవహారం జరిగింది. ఇప్పటి సంగతే చూద్దాం. రొడీషియాలో శ్వేతజాతి మైనారిటీ పాలనను అంతంచేసే విషయంలో బ్రిటిష్ లేబరు పార్టీ గోడమీది పిల్లి వాటంగానే వుంటూంది. మరో ఉదాహరణ చూద్దాం. ఇజ్రాయిల్ ప్రభుత్వం ఎడతెగకుండా అరబ్బు దేశాలపై దురాక్రమణపర యుద్ధాలు జరుపుతోంది. ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతోంది. ఇజ్రాయెల్ పాలకపార్టీ సోషలిస్టు ఇంటర్నేషనల్‌లో సభ్యురాలన్న విషయం గమనార్హం.

నయావలసవాదులూ, మితవాద అభివృద్ధి నిరోధకశక్తులూ మన ప్రజాస్వామిక వ్యవస్థనూ, మన స్వతంత్ర అస్తిత్వాన్ని "అస్థిరం" చేసేందుకు ప్రయత్నాలు జరిపాయి. వాటిపట్ల సోషలిస్టు ఇంటర్నేషనల్ యింతకుముందు ఎలాంటి వైఖరి వహించిందో ఇప్పుడు ఎలాంటి వైఖరి వహిస్తున్నదో కూడా మనకిబాగా తెలిసినదే.

"ప్రజాతంత్ర సోషలిజం" పతాకాన్ని ధరించే సోషల్-డెమాక్రాట్లకు సంబంధించిన గర్హనీయాంశం మరొకటుంది. కమ్యూనిస్టు-వ్యతిరేకత, సోవియట్ వ్యతిరేకత, ప్రాతిపదికపై తమ స్వదేశంలో సైతం కార్మిక వర్గాన్ని, ప్రజాతంత్ర శక్తుల్ని చీల్చిన ఘనతే అది. వాళ్ళ యీ ధోరణి కారణంగా, ఫాసిస్టులతో బాటు అభివృద్ధి నిరోధక శక్తులు అధికారంలోకి రాగలిగిన సందర్భాలు అనేకం వున్నాయి.

అయితే, యీ సోషల్ డెమోక్రటిక్ పార్టీల్లో కూడా విభిన్న ధోరణులు లేకపోలేదనుకోండి. వాటిలో కొన్ని యిప్పటికి [illegible] దశాబ్దాలుగా, కమ్యూనిస్టులతో బాటు, కార్మికవర్గ ప్రజాతంత్ర శక్తులన్నింటితోను ఐక్యతను వాంఛిస్తున్నాయి. ఈ పార్టీలసాధారణ సభ్యులూ, వీటిని బలపరచే ప్రజలూ, యీ రకమైన ఐక్య సంఘటన వైఖరిని అంతకంతకు అధికంగా అభిమానిస్తున్నాయి.

ఏదేమైనప్పటికీ' ముక్తసరిగా చెప్పాలంటే, "ప్రజాతంత్ర సోషలిజం" కేతనధారుల చరిత్ర దుర్గంధ భూయిష్టమైనదనీ, వారితో సైద్ధాంతిక సాంగత్యం ప్రసక్తి సైతం కాంగ్రెస్‌వాదులు పెట్టుకొకపోవడం మంచిదనీ మనవి చేస్తున్నాం:

తన "ప్రపంచ చరిత్ర (గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ)" లో నెహ్రూ వీళ్ళనిగురించి ఏమన్నారో కాంగ్రెస్ మిత్రులు గుర్తు చేసుకోవడం అవసరం. "ఈ సోషల్-డెమోక్రాట్లున్నారే, వీళ్ళకి పెట్టుబడిదారులంటే కన్న, కమ్యూనిస్టులంటేనే ఎక్కువభయం. కమ్యూనిస్టులను అణచివేసేందుకుగాను వీళ్లు పెట్టుబడిదారులతో మిలాఖత్తయ్యారు. లేక పోతే వీళ్ళకి పెట్టుబడిదారులంటే చచ్చే భయమేమో, వాళ్ళకి వ్యతిరేకంగా వ్యవహరించడానికి సాహసించలేదు. శాంతియుత పార్లమెంటరీ సాధనాలద్వారా వాళ్లతమ పరిస్థితిని సంఘటితం చేసుకోవాలనీ, తద్వారా దాదాపు చాప క్రింద నీరులా సోషలిజాన్ని తీసుకురావాలనీ ఆశించారు. వాళ్ళ సంకల్పాలేమైనా కానివ్వండి. విప్లవోద్యమాన్ని అణచివెయ్యడంలో అభివృద్ధి నిరోధకులకు వాళ్ళు తోడ్పడ్డారు, తద్వారా వాళ్ళ ఆచరణలో పలుయూరపియను దేశాల్లో ప్రతీఘాత విప్లవాలు తెచ్చారు. అయితే యీ ప్రతీఘాత విప్లవాలు, యీ సోషల్-డెమాక్రటిక్‌పార్టీలనే అణచివేశాయి. కొత్తవీ, మరింత క్రూరమైనవీ అయిన సోషలిస్టు-వ్యతిరేక శక్తులు అధికారంలోకి వచ్చాయి.

మూడవ ఇంటర్నేషనల్ పట్ల నెహ్రూ సానుభూతి

అదే పుస్తకంలో ఆయన యింకా యిలా రాశారు: "లేబరు పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, సోషల్-డెమోక్రాట్లు, రెండవ ఇంటర్నేషనల్, అటువంటివే యింకా యితర సంఘాలూ మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణమంతటినీ చెక్కు చెదరకుండా వుంచి, స్వల్పమైన సంస్కరణలతోను, కబుర్లతోను సరిపెట్టుకొనే ప్రయత్నం చేశారు వాళ్లు ఆదర్శవాదానికి తిలోదకాలిచ్చారు. ఆత్మ లేని, నిర్బలమయిన పెద్ద పెద్ద ఉద్యోగ యంత్రాల క్రింద తయారయ్యారు."

జవహర్‌లాల్ నెహ్రూ తన 'స్వీయ చరిత్ర'లో యింకా నిర్మొగమాటంగా యీ విషయాన్ని ప్రస్తావించారు: "రెండవ ఇంటర్నేషనలుకు, మూడవ ఇంటర్నేషనలుకు సంబంధించిన లేబరు ప్రపంచాల మధ్య నా సానుభూతి మూడవ ఇంటర్నేషనల్ పక్షాన్నే వుంది. యుద్ధపు రోజులనుండి రెండవ ఇంటర్నేషనల్‌ని పరిశీలించినట్లయితే నాకు వెగటు కలుగుతుంది. దాన్ని గట్టిగా బలపరచే బ్రిటిష్ లేబరు పార్టీ విధానాల విషయంలో భారత దేశంలోని మనకు ప్రత్యక్షానుభవమే వుంది. అందుకనే నేను తప్పనిసరిగా సద్భావంతో కమ్యూనిజం దిశగా తిరిగాను. దాని లోపాలేమైనాకానివ్వండి. కనీసం కృత్రిమంగాని, సామ్రాజ్యవాద తత్వంగాని లేదు దానికి."

కాంగ్రెస్ యిటీవలి కాలంలో, ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని పాలక విప్లవ ప్రజాతంత్ర పార్టీలతోనే కాకుండా, సోషలిస్టు దేశాల్లో అధికారంలో వున్న ఐక్య సంఘటనలతోను, మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలతోను మరింత మంచి సంబంధాలు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆరోగ్యకరమైన పరిణామం యిది దీన్ని సక్రమంగా మరింతగా యిక ముందు కూడా అనుసరించినట్లయితే "ప్రజాతంత్ర సోషలిజం" అంటే ఏమిటి, సోషలిస్టు ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? సోషలిజానికి పరివర్తనకు తోడ్పడే, తర్వాత దాని పరిరక్షణకు, సంఘటనకు తోడ్పడే ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అన్న అంశాలపై పొరపాటు అవగాహనను తొలగించుకోవడానికి ఆ క్రమం తోడ్పడుతుంది.

అహింసా సమస్య

ఇకపోతే, అహింస సమస్య పరిశీలిద్దాం. ముస్ముందుగా యీ సమస్యపై భారత కమ్యూనిస్టుపార్టీ వైఖరిని వివరించడంద్వారా ప్రారంభిస్తే బాగుంటుందనుకుంటాను.

భారత కమ్యూనిస్టుపార్టీ గాని, ఆ మాటకొస్తే ఏ మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ గాని హింస నొక తత్వంక్రింద స్వీకరిస్తుందనుకుంటే అది శుద్ధ పొరపాటు అని చెప్పాల్సి వుంటుంది. వాస్తవ జీవితంలో దోపిడిదారుల చేతుల్లోను వాళ్ళ ప్రభుత్వాధికారం చేతుల్లోను దోపిడీ చెయ్యబడేవాళ్ళు, పీడితులూ అత్యంత నికృష్టమైన రోజువారి హింసకు గురి అవుతున్నారన్న విషయాన్ని మేము నిర్ద్వంద్వంగా పేర్కొంటాం.

స్వార్థపర శక్తుల కీలక ప్రయోజనాలకు భంగం కలిగినప్పుడు వాళ్ళ ప్రత్యేక సౌకర్యాలూ, అధికారమూ దెబ్బతింటుందనుకునేటప్పుడూ, అవి ఎంతటికైనా తెగిస్తాయనికూడా మేము స్పష్టం చేస్తాం. తమ అధికారానికీ, ప్రత్యేక సౌకర్యాలకీ ముప్పు వచ్చినప్పుడు సూత్రాలనేమిటి, వ్యవస్థలనేమిటి వాళ్ళు త్రోసి పారేస్తారు. ప్రజాస్వామ్యమూ, ప్రజాస్వామిక సంస్థలూ కేవలం గాలికివిడిచి పెట్టెయ్యబడతాయి. సకల ప్రజాతంత్ర శక్తులపైనా, ప్రజానీకంపైనా నగ్నమూ భయోద్విగ్నమూ అయిన దౌర్జన్య హింసాకాండలు విచ్చలవిడిగా ప్రయోగింపబడతాయి.

అప్పుడిక ఫాసిజం కరాళ నృత్యం చేస్తుంది. "సాధారణ ప్రజాతంత్ర" పాలన స్థానాన్ని దౌర్జన్యపూరిత నియంతృత్వం ఆక్రమిస్తుంది. 1930 దశకంలో దీన్ని మనం యూరపులో చూశాం. అంతేకాదు ఇటీవలి కాలంలో ఇండోనేషియాలో,

[మిగతా 3 వ పేజీలో]

భవనంకూలి ఏడుగురు మృతి

న్యూఢిల్లీ, డిసెంబరు 26

కరాచీ పాతపట్టణంలో ఒక భవనం కూలి పోయిన కారణంగా ఏడుగురు మృతి చెందారని పాక్ రేడియో తెలిపింది.

దేశ స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుపార్టీ మహత్తరపాత్ర

విజయవాడలో శ్రీ దాసరి ప్రసంగం

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, డిసెంబరు [illegible]

భారత స్వాతంత్ర్య ఉద్యమం ముందుకు [illegible] కమ్యూనిస్టుపార్టీ గణనీయమైన పాత్రను నిర్వహించిందని భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సభ్యులు, రాష్ట్రకమ్యూనిస్టుసమితి కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు నిన్నిక్కడ అన్నారు.

విజయవాడ పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యులు, సానుభూతిపరుల సమావేశం నిన్నిక్కడ జరిగింది.

జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై శ్రీ దాసరి దాదాపు మూడు గంటలసేపు ప్రసంగించారు వెయ్యిమందికి పైగా సభకు హాజరయ్యారు. ప్రారంభంనుండి చివరి వరకు [illegible] విన్నారు

శ్రీ దాసరి ప్రసంగిస్తూ యిలా అన్నారు: "దేశ స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ రైతు వ్యవసాయ కార్మిక, ఎ. ఐ. టి. యు. సి. ల ద్వారా శ్రామికులను సమీకరించింది [illegible] కల్పించింది ఫాసిజం [illegible] సోవియట్‌ను [illegible] వుంచేందుకు కొద్దికాలం [illegible] బాగుంటుందని భావించాం [illegible] తర్వాత [illegible] కమ్యూనిస్టు [illegible] [illegible]న్నారు, [illegible] [illegible]య్యారు. జైలు పాలయ్యారు. స్వాతంత్ర్యానంతరం సంస్థలు దేశంలో స్థానాలు [illegible] గావడానికి ప్రజా పోరాటాలను కూడా నిర్వహించింది.

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే ఏ దేశంలోనూ కమ్యూనిస్టులు దేశభక్తిలో రెండవ శ్రేణిలో వుండరని, అగ్రగాములుగా నిలబడి అసమాన త్యాగాలు చేస్తారని విదితం కాగలదన్నారు.

కమ్యూనిస్టు వ్యతిరేకత సామ్రాజ్యవాద వ్యతిరేక [illegible]న్నారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు వచ్చిన హానిని గుర్తించవలసిందిగా ప్రజాతంత్ర, దేశభక్త, వామపక్షశక్తులను [illegible] చేశారు. [illegible], రాజ్యాంగ నిర్ణాయక సభను ఏర్పాటుచేయాలని, 44 వ రాజ్యాంగ సవరణ బిల్లు వాయిదా వేయాలని అభివృద్ధినిరోధకశక్తులు పన్నిన కుట్రలను యితర ప్రజాతంత్రశక్తులతో కలిసి కమ్యూనిస్టుపార్టీ ముందు నిలిచి భగ్నంచేసిందన్నారు ప్రజాస్వామ్య హక్కులకు ఏర్పడిన తక్షణ ప్రమాదాన్ని నివారించాలని ఆయన కోరారు

కమ్యూనిస్టుపార్టీపై యిటీవల జరుగు [illegible] [illegible] కమ్యూనిస్టుపార్టీ [illegible] [illegible] ఆయన [illegible] చేశారు. [illegible] 20 అంశాల కార్యక్రమానికి పార్టీ [illegible] అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఐదు అంశాల కార్యక్రమంలోని అంశాలు తమ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అయితే 20 అంశాల అమలు కార్యక్రమాన్ని వదలివేసి దానికి పోటీగా ఐదు అంశాలను అమలు జరపటాన్ని పార్టీ వ్యతిరేకిస్తున్నదన్నారు. జాతీయ బూర్జువావర్గ నాయకత్వం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అవలంబించినంతకాలం, దేశానికి సామ్రాజ్యవాద ప్రమాదంవున్నంతకాలంకాంగ్రెస్‌తోఐక్యతా పోరాట విధానాన్ని విడనాడబోమన్నారు. 20 అంశాల అమలుకు, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు కాంగ్రెసు లోపల, వెలుపలగల శక్తుల సహకారాన్ని స్వీకరించాలన్నారు.

మార్క్సిస్టు పార్టీ జాతీయ ప్రయోజనా [illegible] [illegible] విధానాలను అనుసరిస్తున్నదని ఆయన అన్నారు.

కాలంగడిచిన కాంగ్రెసు గుడ్డి వ్యతిరేక ఐక్యసంఘటనలో చేరాలని శ్రీ నంబూద్రిపాద్ కోరుతున్నారని, జాతీయ బూర్జువా వర్గ నాయకత్వం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అవలంబించినంత కాలం యీగుడ్డి కాంగ్రెసు వ్యతిరేకత ఎలాంటి ప్రయోజనాన్ని కల్పించదన్నారు. దేశంలో ప్రజాతంత్ర వామపక్ష శక్తుల ఐక్యత పెంపొందడానికి యిది తోడ్పడదన్నారు.

జనరల్‌బాడీ సమావేశానికి పట్టణ కమ్యూనిస్టు నాయకులు శ్రీ గండు పాండురంగా రావు అధ్యక్షత వహించారు. పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ లంకా గోపాలరావు ప్రసంగిస్తూ జనవరి ఒకటవ తేదీ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక కార్యక్రమం అమలుకై ప్రజా సమీకరణ: శ్రీ యల్లమందారెడ్డి ఉద్బోధ

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, డిసెంబరు 27

20అంశాలఆర్థికకార్యక్రమాన్ని బలహీన పరచే వారి చర్యలను కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకమని గుంటూరులో మార్క్సిస్టు ఎడ్యుకేషన్ సొసైటీ అధ్వర్యాన జరిగిన సభలో ప్రసంగిస్తూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీ గుజ్జుల యల్లమందా రెడ్డి స్పష్టీకరించారు.

మొన్న ఉదయం గుంటూరులోని వాణిజ్య మండలి హాలులో "ప్రస్తుత రాజకీయ పరిణామాలు- కమ్యూనిస్టు పార్టీ వైఖరి"పై సభ జరిగింది.

మార్క్సిస్టు ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శ్రీ పి. ఆర్. ప్రకాశరావు అధ్యక్షత వహించారు. పట్టణ కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ జి.వి.కృష్ణారావు సభా ప్రాధాన్యతను వివరించారు.

ఐక్యతా-పోరాటం

పార్టీ జాతీయ సమితి రూపొందించిన ఐక్యతా-పోరాటం రాజకీయ తీర్మానం [illegible], శ్రీ యల్లమందారెడ్డి పునరుద్ఘాటించి, సామ్రాజ్యవాద, గుత్త పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా దేశంలో జరుగుతున్న పోరాటంలో కాంగ్రెసుపార్టీ లోపలా బయటా వున్న ప్రజాతంత్ర అభ్యుదయ కాముకులతో కలిసి అశేష ప్రజానీకాన్ని సమీకరించి ఐక్యపరచుట ద్వారానే ప్రజాతంత్ర విధానాన్ని కొనసాగించగలమని కమ్యూనిస్టుపార్టీ దృఢంగా విశ్వసిస్తున్నదని స్పష్టీకరించారు.

ప్రధాని ప్రకటించిన అత్యవసర పరిస్థితిని కమ్యూనిస్టుపార్టీ బలపరిచింది అయితే యిందువలన లభించిన అధికారాలను ప్రజలకు వ్యతిరేకంగా ఉపయోగించరాదని కూడా కమ్యూనిస్టుపార్టీ స్పష్టం చేసింది.

రాజ్యాంగ సవరణలు

ప్రజలకు అనుకూలమైన సవరణలు జరగకుండా కోర్టులు అడ్డు వచ్చినాయి. ప్రజలచే ఎన్నికయిన పార్లమెంటు అధికారాలను తృణీకరించి, కోర్టుల ఉన్నతాధికారాలను అంగీకరించాలా లేదా అన్న పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రాజ్యాంగంలో సవరణలు చేసి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవలసి వచ్చింది.

ఈ సందర్భంలో కమ్యూనిస్టుపార్టీ ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగంలో సవరణలు అవసరమని, ఆ విధంగా చేయుటకు పార్లమెంటుకు అధికారాలున్నవని ప్రకటించింది. అయితేఆరు సంవత్సరాలు పార్లమెంటును పొడిగింపరాదనికూడ కమ్యూనిస్టు పార్టీ స్పష్టంచేసింది.

ఆ నాడు రాజ్యాంగ సవరణలు పార్లమెంటు చేయరాదని అభివృద్ధి నిరోధక మితవాద వర్గాలే వ్యతిరేకించినయి.

మార్క్సిస్టుపార్టీ నాయకులు కూడా వారితోపాటు రాజ్యాంగ సవరణలు వాయిదా వేయాలని పంత పట్టారు.

యు. పి, హర్యానా, చండీఘర్, రాష్ట్రాలకాంగ్రెస్ కమిటీలుశాసనసభపార్టీలు తిరిగి రాజ్యాంగ సభను పిలవాలని తీర్మానాలు చేసి, వాటి అంతరార్థం అధ్యక్షుని పాలనను కోరటం, ఎన్నికలను వాయిదా వేయించటం, రాజ్యాంగ సవరణలు చేయుటకు పార్లమెంటుకుగల అధికారాన్ని తృణీకరించడమేనని కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ రాజేశ్వరరావు ప్రకటించారు. వారి చర్య దేశ ఐక్యతకు భంగకరమని, స్పష్టంచేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని [illegible] కమ్యూనిస్టుపార్టీ లక్ష్యమని శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరించారు.

రాజ్యాంగ సవరణలను వాయిదా వేయించుటకు చేసిన ప్రయత్నాలు అభివృద్ధి నిరోధకుల కుట్రల్లో భాగమేనని శ్రీ యల్లమందారెడ్డి స్పష్టీకరించారు.

జనవరి 1 వ తేదీన జరుగ నున్న అధిక ధరల వ్యతిరేక, నిత్యావసర వస్తువు పంపిణీ, వ్యాపారము ప్రభుత్వమే చేపట్టాలని చక్కెర, బట్టల మిల్లులను జాతీయం చేయాలని కోరుతూ, జరుగనున్న మహోద్యమంలో అన్నిపార్టీలలోని పేదలను ఐక్యంగా కలుపుకొని వచ్చుటకు ప్రగతిశీల వాదులు,కమ్యూనిస్టులందరూ కలిసి కృషి చేయవలసి వున్నదని శ్రీ యల్లమందారెడ్డి విజ్ఞప్తి చేశారు.

జనరల్ బాడీలు

ఈ నెల 22 వ తేదీన గుంటూరులోని జూట్‌మిల్ ఏరియాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సభ్యుల, సానుభూతిపరుల జనరల్‌బాడీ సమావేశంలో ప్రసంగించారు.

23 వ తేదీన సత్తెనపల్లిలో తాలూకా కమ్యూనిస్టు సమితి అధ్వర్యాన జరిగిన కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతిపరుల జనరల్‌బాడీ సమావేశంలో ప్రసంగించారు.

24 తేదీన నర్సారావుపేటలో ఏరియా జనరల్‌బాడీ సమావేశంలోను, 25 వ తేదీ సాయంత్రం రేపల్లెలో తాలూకా కమ్యూనిస్టు సమితి అధ్వర్యానజరిగిన పార్టీ సభ్యుల, సానుభూతి పరుల జనరల్‌బాడీ సమావేశాలలో ప్రస్తుత రాజకీయ పరిణామాలను వివరిస్తూ శ్రీ యల్లమందారెడ్డి ప్రసంగించారు.

రామచంద్రాపురం

పట్టణ మహాసభ

23 వ తేదీ ఉదయం రామచంద్రాపురం పట్టణ కమ్యూనిస్టు సమితి మహాసభ శ్రీ పి. స్వామి అధ్యక్షతన జరిగింది.

తాలూకా పార్టీ కార్యదర్శి శ్రీ పెన వెంకట్రావు రాజకీయ రిపోర్టు సమర్పించారు. శ్రీ అప్పలాచార్యులు ప్రవేశపెట్టిన నివేదికను చర్చల అనంతరం ఆమోదించారు.

శ్రీ అనంతార్యుల వెంకటేశ్వరరావు కార్యదర్శిగా, శ్రీ కోనసత్తి అప్పలాచార్యులు సహాయ కార్యదర్శిగా 9 మందితో కొత్త కమిటీని సభ ఎన్నుకుంది.

కాకినాడలో

225 మంది పాల్గొన్న కాకినాడ కమ్యూనిస్టుపార్టీ సర్వసభ్య సమావేశానికి, శ్రీ కృత్తివెంటి సత్యనారాయణ అధ్యక్షత వహించారు పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కె.ఎ. గోపాలస్వామి స్వాగతం పలికారు.

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ, జాతీయ అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులపై రిపోర్టు యిచ్చారు.

పలువురు జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ అల్లూరి వెంకటరామరాజు శ్రీ దూసరి వెంకటనర్సయ్య, శ్రీ పొన్న మంగ రామచంద్రరావు కూడ పాల్గొన్నారు.

లేఖలు

కాకినాడ తాలూకాలో సన్నకారు రైతుల, చేతివృత్తుల పేదల కడగండ్లు

మహాశయా,

తూర్పు గోదావరిజిల్లా కాకినాడ తాలూకాలో ధవళేశ్వరం ఆనకట్టకింద నీరులేక సకాలంలో నాట్లు జరగలేదు. జులైలో కురిసిన వర్షాలవల్ల నాట్లు పూర్తయినా, పంట కొంతవరకు పెరిగి పొట్టదశకొచ్చినా, తర్వాత రెండు మాసాలు వర్షాలు లేక, ఎండలుకాచి పూర్తిగా ఎండిపోయాయి.

తర్వాత అక్టోబరు వర్షాలతో చెదురు మదురుగా పంటలు యీనినప్పటికీ ఎన్నులు నల్లగా మాడి నిరుపయోగ స్థితికి వచ్చాయి.

తర్వాత వచ్చిన భారీవర్షాలకు తాలూకా యావత్తు జలమయమై రైతుకు ఏమాత్రం పంట చిక్కలేదు. సర్వస్వం నష్టానికి గురైంది. యిక యితర వృత్తులపై జీవించే పేదప్రజలు విపరీత కష్టనష్టాలకు గురయ్యారు.

కనుక ఈ తాలూకా యావత్తును కరువు బాధితప్రాంతంగా ప్రకటించి, పన్నులు, శిస్తులకు పూర్తిగా రెమిషన్ యిప్పించాలని, ఈ తాలూకాకు రెండవ పంట లేదని చెప్పబడుతున్నందున తుపాను బాధితుల సహాయ నిధినుండి, యితర నిధులనుండివడ్డీ లేకుండా రుణాలిప్పించాలని, అన్ని రకాల అప్పు బకాయిలు వసూళ్ళు నిలిపివేయాలని, గ్రామాలలో పేద వృత్తులవారికి కుటుంబ పోషణార్థం, కుటుంబ సభ్యుల సంఖ్యననుసరించి ఉచితంగా ఆర్థిక సహాయం వెంటనే అందించాలని, పశుగ్రాసం సరఫరాకై తగుఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్రామంలో చౌకడిపోలు పెట్టించి, బియ్యం తదితరవస్తువులు చౌకగా పేదలందరికీ అందించాలని కోరుతున్నాను.

ఇట్లు

రావుల సత్యం.

వస్త్రాల కొరత

హుజూర్‌నగర్ తాలూకా కోదాడు పట్టణంలోని బట్టల కంట్రోల్ దుకాణంలో కార్మికవర్గానికి పనికొచ్చే వస్త్రాలులేవు. కోదాడు మంచి వ్యాపార కేంద్రం సుమారు 20 మిల్లులున్నాయి. రెండు మూడువేల మంది కార్మికులు నివసిస్తున్నారు. మార్కెట్‌లోనేమో బట్టల ధరలు చుక్కలంటుతున్నాయి. కంట్రోల్ దుకాణంలోనేమో పేదలకు వుపయోగపడే రకాల వస్త్రాలు లేవు. ఈ పరిస్థితిని చూసి పేదలు నిరాశోపహతులవుతున్నారు.

పేద ప్రజలు కొనగలిగే చౌకరకం బట్టలను సరఫరా చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,

షేక్ ఇమాం, కోదాడు

అధ్వాన్నంగావున్న ప్రధాన రహదారి

మహాశయా!

తణుకు తాలూకాలోని పెనుగొండగ్రామం నుంచి పడలి గ్రామంమీదుగా సిద్ధాంతంబ్రిడ్జి వరకుగల రహదారి చాలా అధ్వాన్నంగా వున్నది.

నరసాపురం, భీమవరం, గుడివాడల నుంచి వచ్చు ప్రతి వాహనం ఈ మార్గం ద్వారానే ప్రయాణించి సిద్ధాంతం బ్రిడ్జివద్ద మద్రాసునుంచి కలకత్తాకు పోవు జాతీయ రహదారిని చేరును.

ఈ రహదారి పెనుగొండనుంచి సిద్ధాంతం వరకు పోయిన వేసవిలో అక్కడక్కడ వేసినారు మిగిలినది పాత రహదారిని తిరగవేసి దానిపై కంకర వేసినారు.

ట్రాఫిక్‌వలనకంకర అంతా ప్రక్కలకు కొట్టుకొనిపోయి రహదారికాస్త పాడయింది. చుట్టుప్రక్కలగ్రామాలప్రజలు సైకిల్ ప్రయాణం చేసేందుకు కూడా వీలులేకుండా తయారయింది.

కనుక వెంటనే తగిన చర్య తీసుకొని ఈ రహదారిని బాగుచేయించాలని ప్రభుత్వాధికార్లను కోరుతున్నాను.

ఇట్లు,

గణపతి సీడి సత్యప్రసాద్.

పడలి, తణుకుతాలూకా,

రాజమండ్రిలో సిటీబస్సులు!

మహాశయా!

రాజమండ్రి పట్టణం ఎంతో విస్తృతమై వెంటనే బ్రిడ్జి (రైలు రోడ్డు బ్రిడ్జి) వచ్చిన తర్వాత జనాభా మరింతగా పెరిగిపోయింది

అయితే ఎక్కువమంది రిక్షాలకు డబ్బులు పెట్టలేక సిటీబస్సులకోసం ఎదురుచూస్తున్నారు, కానీ ఆ బస్సులు సరియైన సమయానికి రాక, ఒక్కొక్కప్పుడు కొన్ని బస్సులు [illegible] మధ్యలోనుంచే తిరిగివెళ్ళిపోతూ ప్రయాణీకులను నిరుత్సాహపరుస్తున్నాయి. ప్రజలెంతో అసౌకర్యానికి గురై కష్టనష్టాలకు గురవుతున్నారు.

అలా తిరిగినా సిటీబస్సులు క్రిక్కిరిసిపోయి బస్సులలో అవాంఛనీయ ఘటనలు కూడా జరుగుతున్నాయి.

కనుక ప్రభుత్వం యీ పరిస్థితిని దృష్టిలోకి తీసుకొని ఆర్. టి. సి. బస్సులు సిటీలో కూడా ఏర్పాటుచేసి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కలుగచేయుటంతోపాటు ప్రభుత్వానికే యీ ఆదాయం మరింత అందుతుందని మనవి చేస్తున్నాం.

కొవ్వూరు - రాజమండ్రి సిటీబస్సులు కొవ్వూరు లాంచీ రేవులో మాత్రమే ఆగుతున్నాయి. కనుక దొబ్బర్లంక రేవు దగ్గర కూడా ఆగేట్లు చూడాలని, ఆర్. టి. సి. ప్రభుత్వ అధికారులను కోరుతున్నాం.

ఇట్లు,

టి. సుబ్రహ్మణ్యం,

ఎ. రమణారావు,

ఎ. అప్పారావు,

రాజమండ్రి,

మోయలేని ఇళ్ళ పన్నులు

మహాశయా!

నల్గొండ జిల్లా సూర్యాపేట పట్టణంలో ఈ సంవత్సరం స్థానిక మున్సిపాలిటీ వారు ఇళ్ళపన్నులు కట్టే నోటీసులు యిచ్చారు. కానీ, అవి ప్రజలు మోయలేనివిగా వున్నాయి.

గత సంవత్సరమే విపరీతంగా పెంచారు. ఈ సారి అవి చెప్పనలవి గాకుండా వున్నాయి. 3 రూపాయలు చెల్లించేవాళ్ల 30 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది.

అందువల్ల పేద ప్రజానీకం, కూలీ జనం బాధలు గమనించి ప్రస్తుత పరిస్థితులను గుర్తించి, దీన్ని కూడా ప్రజలకు పెద్ద సమస్యగా పరిణమించకుండా చూడాలని కోరుతున్నాం.

ఇట్లు,

గాలి వెంకటయ్య,

కె. మల్లయ్య.

మురుగుకాల్వ త్రవ్వనందున మునిగిపోయిన చేలు

మహాశయా

కృష్ణాజిల్లా దివి తాలూకా మంత్రిపాలెం, నిడుమోలు గ్రామాలలో సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టుగల మాగాణి భూమిలోని మురుగు పోయేందుకు "ఉప్పు కోడురీడింగ్ డ్రైన్" (సబ్‌డ్రయిన్) నుండి ఉప్పుకోడు మెయిన్ డ్రెయిన్ వరకు ఏర్పాటుంది. 2 మైళ్ల పొడవున్న యిదొక్కటే మురుగు పోయేందుకు మార్గం.

కానీ దీని త్రవ్వకానికి పూనుకొనక పోవడంవల్ల యిటీవల తుపానువల్ల వెయ్యి ఎకరాలుపైగా కోతకూడా కోయకుండానే పోయింది.

ఇప్పటికైనా ప్రభుత్వంసత్వరమే ఎస్టిమేటు వేయించి,త్రవ్వకానికి పూనుకోవాలని కోరుతున్నాను.

ఇట్లు,

కాట్రగడ్డ వీరపాపారావు

రాజధానిలో తాత్కాలిక ఉద్యోగుల విజ్ఞప్తి

మహాశయా!

ఆంధ్రప్రదేశ్ సర్వీసు కమీషను వారు డిసెంబరు 11, 12 తేదీలలో గ్రూప్-4 సర్వీసెసుకు పరీక్షలు జరిపినారు. దాదాపు 80 వేలమంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయినారు.

కమీషను వారు 1-1-76 నాటికి రెండు సంవత్సరములు సర్వీసుగల తాత్కాలిక ఉద్యోగులకుస్పెషల్ క్వాలిఫైయింగు పరీక్ష 1977లో జరుపుటకు నిర్ణయించినారు. కాని 1-1-76 నాటికి రెండు సంవత్సరములు లేనివారు,సర్వీసుకమిషనువారునిర్వహించిన గ్రూప్ 4 పరీక్షలలో 80 వేలమంది అభ్యర్థులలో మెరిట్‌లో రావలయును అట్లు మెరిట్‌లో వస్తేనే వారి ఈ ఉద్యోగాలు స్థిరపడగలవు పైగా ఈ గ్రూప్ 4 పరీక్షలలో దాదాపు అన్ని సెంటర్లలోనూ, కాపీయింగు ముమ్మరముగా జరిగినది. అటువంటప్పుడు గృహచ్ఛిద్రములతోను, ఆఫీసు పనులతోను, సతమతమగు తాత్కాలిక ఉద్యోగులు మెరిట్‌లో నెగ్గటము కష్టతరము. పైగా వీరు, ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజి ద్వారా మెరిటు ద్వారా ఉద్యోగాలలో నియమింపబడినారు. ఇప్పుడు వారిని మెరిట్‌లో రాకపోతే, వారిని ఉద్యోగములలో నుంచి తొలగింతురు. ఇది వారికి వయసు దాటిపోవును, మరియు మరల ఉపాధి కల్పనా కేంద్రాలలో కొత్తగా పేరులను నమోదు చేయించుకొనవలెను.

ఈ బాధలు జంట నగరాలలో వున్న హెడ్స్ ఆఫ్ డిపార్టుమెంటులలో వున్న వారికే. జిల్లాలో పనిచేయు తాత్కాలిక ఉద్యోగులను స్థిరపరచుటకు జిల్లా కలెక్టర్లను ఆదేశించియున్నారు. ఎట్టి పరీక్షలు నిబంధనలు లేకుండా జిల్లాలోని వారిని ఉద్యోగములలో స్థిరపరచారు.

కావున ప్రభుత్వం వారు మానవతా దృక్పథంతో జంటనగరంలో హెడ్సు ఆఫ్ డిపార్టుమెంటులలో పనిచేయు తాత్కాలిక ఉద్యోగులను [illegible] [illegible] 1977 లో సర్వీసు కమీషను వారు నిర్వహించు స్పెషల్ క్వాలిఫైయింగు పరీక్ష [illegible] కోరుచున్నాము.

ఇట్లు,

—[illegible] తాత్కాలిక ఉద్యోగులు

హైదరాబాదు

నెలలతరబడి రెండో టీచరు లేని స్కూలు

మహాశయా!

విస్సన్నపేట సమితి [illegible] గ్రామంలోని [illegible] ప్రాథమిక పాఠశాలలో ఆరు మాసాలనుండి ఒకే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. రెండవ పోస్టు ఖాళీగా వుంది.

కావున [illegible] యీ స్కూలుకు రెండో టీచరును నియమించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,

ఎ. జగన్నాథరావు

విస్సన్నపేట

సోషలిజం: హింస, శాంతియుత మార్గం

(2వ పేజీ తరువాయి)

చిలీలో, బంగ్లాదేశ్‌లో ఈ దుష్పరిణామాన్ని మనం చూశాం. ఇటువంటి ఉదాహరణలు యింకెన్నింటినైనా యివ్వవచ్చు.

ప్రజాస్వామ్యమూ, ప్రజానీకమూ పరిరక్షింపబడాలన్నప్పుడు స్వార్థపర శక్తుల్లో అంతర్గర్భితంగా వుండే యీ ధోరణిని అన్ని ప్రజాతంత్ర పార్టీలు, శక్తులు గుర్తించినంత మాత్రాన సరిపోదని, యీ సమస్యపై ప్రజావళికి చైతన్యం కలిగించడం కూడా అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ భావిస్తుంది.

సామూహిక విప్లవోద్యమాలు పోరాటాలు నానాటికి విస్తృతంగా అధివాధికంగా, మరింత సమరశీల ప్రాతిపదికపై జరిగినప్పుడు, అవి పరాకాష్ఠాయికి చేరుకొని దోపిడీవర్గాల, సోషలిస్టు వ్యతిరేక శక్తుల ప్రభుత్వాధికారాన్ని రూపుమాపి, దాని స్థానంలో కార్మికవర్గంయొక్క, సోషలిస్టు విప్లవంతో దాని సహచర శక్తుల ప్రభుత్వాధికారాన్ని నెలకొల్పినప్పుడు మాత్రమే సోషలిజం గమ్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందని కమ్యూనిస్టుపార్టీ విశ్వసిస్తుంది.

ఈ ఉద్యమ రూపాలేమిటి, విప్లవపర అధికారాన్ని హస్తగతం చేసుకోవడమేమిటి, ఆయా భిన్న భిన్న దేశాల ప్రత్యక్ష పరిస్థితులపై ఆధారపడి వుంటుందని కూడా కమ్యూనిస్టుపార్టీ నమ్ముతుంది. విప్లవాత్మకంగా అధికారాన్ని హస్తగతం చేసుకొనే విషయంలో సాయుధ పోరాటరూపమో లేక శాంతియుత పోరాటరూపమో మాత్రమే వినియోగించి తీరాలని కమ్యూనిస్టుపార్టీ ఎన్నడూ చెప్పలేదు.

పోరాటరూప నిర్ణయానికి పరిస్థితే ఆధారం

ఈ పోరాట రూపాన్ని చేపట్టాలా, ఆ పోరాట రూపాన్నా అన్నవి విశిష్టమైన ఆయా పరిస్థితులపై ఆధారపడివుంటుంది.

1958 లో జరిగిన తన అమృతసర్ పార్టీ మహాసభలో (1964 లో బొంబాయిలో జరిగిన పార్టీ మహాసభలో యీ ఫార్ములా మరల స్థిరపడ్డాటింపబడింది) మనదేశంలో విప్లవం శాంతియుత పరివర్తన రూపం దాల్చే అవకాశముందని పేర్కొంది. అంటే, సాయుధ అంతర్యుద్ధాన్ని నివారించవచ్చునన్నమాట. కానయితే అదేసమయంలో విప్లవ ప్రతీఘాతకులు సాయుధ అంతర్యుద్ధాన్ని ప్రజాసామాన్యంపైరుద్దే ప్రమాదం లేకపోలేదు.

అంటే ఏమిటన్నమాట, భారత కమ్యూనిస్టుపార్టీ శాంతియుత పరివర్తన కోసం, కృషి చేస్తుంది. కానయితే అదే సమయంలో పరిస్థితులలో మెలికలూ, మలుపులూ వచ్చి, సాయుధ అంతర్యుద్ధం తప్పనిసరి అయినట్లయితే, ఆ విషయమై అప్రమత్తంగా వుంటుంది కమ్యూనిస్టుపార్టీ. అయితే కమ్యూనిస్టుపార్టీ నొక్కిచెప్పే దేమిటంటే, అది శాంతియుత పరివర్తనమైనా, సాయుధఅంతర్యుద్ధమయినా, రెండూ కూడా తప్పనిసరి, అనివార్య విప్లవ రూపాలే అవుతాయి దానిలో విప్లవ ప్రజా ఉద్యమమూ, నిర్మాణమూ, ఐక్యతా ప్రధానాంశాలుగా వుంటాయి.

సుమారు రెండు దశాబ్దాల క్రితమే యీ నిర్ణయానికొచ్చిన భారత కమ్యూనిస్టుపార్టీ, మన దేశంలోవున్న నిర్దిష్టమైన పరిస్థితిని, ప్రపంచ శక్తుల బలాబలాలనూ, రాగల పరిణామాలకు సంబంధించిన అంచనానూ ఆధారం చేసుకొనే యీ నిర్ణయాలకొచ్చింది.

ఈ నిర్ణయాల కొచ్చేటప్పుడు అది, మార్క్సిస్టు లెనినిస్టు బోధనలపై ఆధారపడింది. శాస్త్రీయమైన విశ్లేషణ, ప్రపంచ స్థాయిలో విప్లవకార్యాచరణానుభవ సాధారణ సూత్రీకరణలే మార్క్సిజం లెనినిజం అన్న సంగతి వేరే చెప్పనక్కరలేదు. కొందరు కాంగ్రెస్ మిత్రులంటున్న దానికి విరుద్ధంగా శాంతియుత పరివర్తన భావనకూడా విప్లవ రూపాల్లో ఒకటేనన్నది కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించినంతవరకు అదేమీ కొత్త భావన ఏమీ కాదు.

ఇంగ్లండులోను, హాలెండులోను, మరికొన్ని యితర దేశాల్లోను శాంతియుత పరివర్తనావకాశాలను గురించి మార్క్స్ ఎంగెల్సులు 1860 దశకంలోనే చెప్పివున్నారు. 1888 లోనే ప్రచురించబడిన మార్క్స్ దాస్ కాపిటల్‌కి తను రాసిన భూమికలోను, అటు తరువాత ఎంగెల్సు యీ విషయాన్ని ప్రస్తావించి వున్నాడు.

రష్యాలో ఫిబ్రవరి విప్లవానంతరం సోషలిస్టు విప్లవానికి జరుగుతున్న ముస్తాబు సన్నాహాల మధ్య, శాంతియుత పరివర్తనావకాశాలు ఉన్నాయనీ, వాటిని వినియోగించుకోవడానికి బోల్షివిక్కులు కృషి చేస్తారని లెనిన్ చెప్పి వున్నాడు. 1917 జూలైలో విప్లవ ప్రతీఘాత సైనిక తిరుగుబాటు తర్వాతనే ఆయన శ్రమ విప్పుడు "[illegible]" కనక, యిప్పటిక సాయుధ తిరుగుబాటు మాత్రమే గత్యంతరం అన్నాడు.

1956 లో జరిగిన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ 20వ మహాసభలోను, అటు తర్వాత 1957, 960 సంవత్సరాల్లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టుపార్టీల మహాసభల్లోను కొన్ని దేశాల్లో శాంతియుత పరివర్తనావకాశ సిద్ధాంతం గట్టిగా పునఃప్రతిష్ఠాపించబడింది. మావో యిటు గడబిడ చేసిన, అంశాలలో యిదొకటి. దీనిపైనే ప్రపంచ కమ్యూనిస్టుపార్టీల్లో అధిక సంఖ్యాక పార్టీలు 'రివిజనిస్టు'గా మారిపోయి, విప్లవానికి ద్రోహం చేశాయి" అని వాళ్లు ఆరోపించింది కూడా ఈ అంశంపైననే అని అందరికీ తెలిసినదే.

సహజంగానే ఆనాడుమార్క్స్, లెనిన్‌లు

అలాగే యీనాడు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమమూ శాంతియుత పరివర్తననే ఏకైక మార్గమని చెప్పదు. పలుదేశాల్లో దీనికి అవకాశం లేదు. ప్రస్తుత దశలో అనేకదేశాల్లో సాయుధ పోరాటం వినా గత్యంతరంలేదన్న సంగతిని క్యూబా వియత్నాం అంగోలాలూ యిప్పుడు, ఆఫ్రికాలోని దక్షిణాది రాజ్యాలూ రుజువు చేశాయి

పోరాట రూపాలు

స్వాతంత్ర్యోద్యమానుభవం

ఈ సందర్భంగా, మన స్వాతంత్ర్యోద్యమానుభవమేమిటో కూడా మాట్లాడాం. కాంగ్రెస్ ప్రారంభించి నడిపిన శాంతియుత ప్రజాఉద్యమాలు భారతదేశాన్ని దాస్యత్వంనుంచి స్వాతంత్ర్యానికి నడపడంలో నిస్సందేహంగా ప్రధాన పాత్రనే వహించాయి, మన స్వాతంత్ర్య పోరాట నాయకుల్లో అగ్రనాయకుల్లో మిక్కిలి గొప్పవాడుగా మహాత్మా గాంధీ పాత్రను ఎవరూ కాదనలేరు. ఆయన సంబంధించి నంతవరకు అహింస అన్నది నిస్సందేహంగా మౌలికమైన విశ్వాసమే.

కానైతే, చిత్తశుద్ధితో సమంజసంగా ఆలోచించుకున్నట్టయితే 1920 దశకంనుండి మన స్వాతంత్ర్య పోరాటం, కాంగ్రెస్ ప్రారంభించి నడిపిన శాంతియుత ఉద్యమాలకే పరిమితం కాలేదన్న విషయం జ్ఞాపకం చేసుకోవాల్సి వుంటుంది. 1857 నాటి తిరుగుబాటు సంగతి మరచిపోకూడదు. బ్రిటిషు వ్యతిరేక పోరాటంలో పిస్తోళ్ళూ, బాంబు లనే అత్యంత శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించిన సావర్కర్ సోదరులు, జతిన్, సూర్యసేన్‌ల మాటేమిటి? యింకా అలాంటి వేలాది మంది మాటేమిటి? సుభాష్ చంద్రబోస్ ఐ. ఎన్. ఏ. (భారత జాతీయ సైన్యం) మాటేమిటి? అది అహింసాత్మక సైన్యమేమీ కాదే! 1946 లో జరిగిన ఆర్. ఐ. ఎన్. (భారత నౌకా సైన్యం) తిరుగుబాటు శాంతియుత ఉద్యమం కాదే! ఫ్యూడల్ రాచరికానికి, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నడిపిన చారిత్రాత్మక తెలంగాణా సాయుధ పోరాటం శాంతియుత ఉద్యమం కాదు కదా!

పైన పేర్కొనబడిన ఆయా ఉద్యమాలలో అవలంబించబడిన పోరాట రూపాలూ, వాటిలో పాల్గొన్నవారి దృక్పథమూ అహింసపై ఆధారపడలేదు కనక, వాటిని పడేసి పెట్టెయ్యడం సాధ్యంకాదు కదా.

కాంగ్రెస్ సంగతే తీసుకుందాం. దాని సంగతేమిటి? గాంధీజీని మరి కొద్ది మందిని వదిలేస్తే. అహింస అన్నది మౌలిక విశ్వాసం ఎన్నడూకాదు. ఉదాహరణకు: లోకమాన్య తిలక్, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో విశిష్టమైన ఏ పోరాట రూపాన్నీ తను ఖండించబోనని, బహిరంగంగా ప్రకటించాడు

తన 'స్వీయచరిత్ర'లో నెహ్రూ ఈ విషయాన్ని ఎంతో విస్పష్టంగా వివరించారు:

"ప్రత్యేక సౌకర్యాలు కలిగి, పాలన సాగిస్తున్న వర్గానికి హృదయ పరివర్తనం కలిగించి అది తన అధికారాన్ని, అన్యాయమైన ప్రత్యేక సౌకర్యాలను విడిచిపెట్టేలా చెయ్యించే ప్రయత్నం యిప్పటిదాకా విఫలమే అయింది. భవిష్యత్తులోనైనా అటువంటి ప్రయత్నం విజయవంతం అవుతుందనేందుకు హేతువేమీ కనిపించదు...

"ఏ రాజ్యమైనా, తన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడానికి హింసా ప్రయోగానికి పూనుకోవడం సహేతుకమేనని ఆమోదింపబడినప్పుడు, ఆ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవడానికి హింసాత్మక, దౌర్జన్యపర పద్ధతులను అవలంబించడం కూడా సమానంగానే సహేతుక మెందుకుకాదో అర్థం చేసుకోవడం కష్టం...

"...హింసకీ, అహింసకీ మధ్య, బల ప్రయోగానికీ పరివర్తనకీమధ్య ఖచ్చితమైన విభజనరేఖ గియ్యటం పూర్తిగా అసంభవం. రాజకీయంగా వచ్చే మార్పుల దృష్ట్యా ఈ అంచనా వేయటం నిజంగానే కష్టం. సంపన్న వర్గాలకీ దోచుకోబడే వర్గాలకీమధ్య యీ అంచనా వేయటం మరింత కష్టం —

"సాధనాల ప్రాముఖ్యాన్ని గురించి నొక్కి చెప్పడంలో గాంధీజీ మనకి గొప్ప సేవ చేశారన్నది నాకు విశ్వాసం కుదిరింది. అయినా కూడా తుది వక్కాణింపు గమ్యం మీదా అనన్న లక్ష్యం మీదనే వుండాలని నా దృఢ విశ్వాసం. ఈ విషయంలో మనకి స్పష్టమయిన అవగాహన వుంటే తప్ప, లక్ష్యసాన్నిహిత్యంగా పరిభ్రమిస్తూ, అప్రాముఖ్యమైన చిన్న సమస్యలపై మన శక్తియుక్తుల్ని వృధా చేస్తామే తప్ప పట్టుమని ఏమీ నిర్ణయంగా సాధించేదేమీ వుండదు...

సాధ్యమైతే సౌమ్యంగా

అవసరమైతే బలప్రయోగంతో

"మన అంతిమాశయం వర్గరహిత సమాజం మాత్రమే కాదు... ఆ ఆశయ సాధన మార్గంలో అవరోధముంటే ప్రతిదాన్ని సాధ్యమయితే సౌమ్యంగా, అవసరమైతే బల ప్రయోగంతో — తొలగించాల్సిందే. బలప్రయోగం తరచుగా అవసరమవుతుందన్న విషయంలో ఏ కొంచెం సందేహంకూడా ఉన్నట్లులేదు"

చాలాకాలం క్రితం 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడే గాంధీజీ ఆమోదించినా సరే, అహింస అన్నది కాంగ్రెసు సిద్ధాంతం కాదని కాంగ్రెసు నాయకత్వం స్పష్టం చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెసు మిత్రులకు జ్ఞాపకము చెయ్యకోరుతున్నాం. అందుకని, జాతీయ ప్రభుత్వానికే కనుక అధికారం వదిలి పెట్టినట్లయితే, సహజంగానే అందులో ఎలాగూ కాంగ్రెసు అత్యంత ముఖ్యమైన శక్తిగా వుంటుంది కనుక, ఫాసిస్టు రాజ్యాలకు వ్యతిరేకంగా, అది యుద్ధ కృషిని నిస్సంకోచంగా కొనసాగిస్తుంది.

1942 లో సర్ స్టాఫర్డ్ క్రిప్సుతో సంప్రదింపుల సమయంలో కూడా యీ వైఖరి పునరుద్ఘాటింపబడింది.

ఈ సందర్భంగానే మరో విశేషాన్ని కూడా గుర్తుచేసుకుందాం. మనం స్వాతంత్ర్యం సంపాదించుకున్న వెంటనే [illegible] ఆక్రమణను తిప్పికొట్టేందుకుగాను భారతీయ సైన్యాన్ని పంపాల్సి వచ్చినప్పుడు, అందుకు ఆశీస్సు లివ్వాల్సిందిగా గాంధీజీని అభ్యర్థించడం, ఆయన అలా యివ్వడం జరిగింది.

స్వాతంత్ర్యానంతర కాలంలో, దేశం లోపలా బయటా కూడా, సేనలను, పోలీసులను వాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం సంకోచించలేదు. ఇదంతా సమంజసమూకాదు, పైగా యిదేదీ కూడా అహింసాత్మకం అంతకన్నా కాదు కదా!

సోషలిజంపట్ల కాంగ్రెస్ అవగాహనకు సంబంధించిన యీ సమీక్షనూ, విమర్శనూ సిద్ధాంతానికి మించి ప్రముఖపాత్ర వుందని, యీ విషయమై యింకా చర్చ జరగాల్సివుందని చెప్తూ ముగిస్తున్నాం. ఇటీవలి ఘటన దృష్ట్యా, దీని అవసరం మరింతగా పెరిగినట్లు మాకు విశ్వాసం కలుగుతోంది.

ఈ సందర్భంగా కూడా జవహర్లాల్ నెహ్రూ, తన 'ప్రపంచ చరిత్ర'లో ఏమన్నారో గమనించడం అవసరం:

"మహోద్యమాలు ఎప్పుడూ నిధిగా, ఖచ్చితమైన సిద్ధాంతం చుట్టూ, కొన్ని నిర్దిష్ట సూత్రాల చుట్టూనే నిర్మితమవుతాయి, వాటికి నిర్దిష్టమైన లక్ష్యాలూ, కార్యక్రమాలూ కొన్ని వుంటాయి.

"సోషలిజానికి, కమ్యూనిజానికి, లిబరలిజానికి కేవలం వ్యతిరేకతే ఒక తత్త్వశాస్త్రంగా పరిగణించనవసరం లేనట్లయితే ఏ నిర్దిష్ట సూత్రాలూ, ఏ సిద్ధాంతమూ, ఏ తత్త్వమూ తన వెనకలేని విశిష్టత ఒక్క ఫాసిజానికే వుంది.

"ఫాసిస్టు గ్రూపులు ఏర్పడిన తర్వాత ఒక సంవత్సరానికి 1920 లో, ఫాసిస్టులను గురించి ముస్సోలినీ అన్న యీ క్రింది మాటలు గమనార్హాలు:

"ఏ నిర్దిష్ట సూత్రాలకీ కట్టుబడిలేదు కాబట్టి ఎడతెగకుండా ఒకే ఒక లక్ష్యం దిశగా, ఇటాలియన్ ప్రజల భవిష్యత్ సౌభాగ్యం దిశగా ఫాసిస్టులు ముందుకు సాగి పోతారు

"ఇటువంటివున్నది చూశారా, ఇదొక ప్రత్యేక విధానం కాదు, తన ప్రజల సంపద్భాగ్యాల కోసమే తను కృషి చేస్తున్నానని ప్రతివాడూ అనవచ్చు కదా."

"సిద్ధాంతం లేదు, సిద్ధాంతమూ లేదు" అన్నదానికి ఎంత అద్భుతమైన సరైన చిత్రీకరణ! సోషలిస్టు భారతాన్ని కోరే మన కాంగ్రెసు మిత్రులు ముఖ్యంగానూ, తదితరులూ యీ విషయాన్ని గుర్తు చేసుకోవడం, స్మరించడం ఎంతో ముఖ్యావసరం.

రు. 300 కోట్ల ఎన్. ఎం. డి. సి. కార్యక్రమం

విశాఖపట్టణం, డిసెంబరు 27

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్. ఎమ్. డి. సి.) చేపట్టబోయే రు. 300 కోట్ల కార్యక్రమం అమలు 1979 లో ప్రారంభమవుతుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ ముడి ఇనుము ఉత్పత్తిని సాధ్యమైనంత అధికం చేస్తుంది. ముడి ఇనుము ఉత్పత్తి వచ్చే మూడేళ్ళలో కోటి 80 లక్షల టన్నులకు పెరుగుతుందని ఎన్. ఎం. డి. సి. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వేణుగోపాల్‌రావు తెలిపారు.

బైలడిల్లా, దోనమలై పాజెక్టుల్లో లభ్యమయ్యే ముడిఇనుమునుంచి ఇనుపదిమ్మెలు తయారుచేసే రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కార్పొరేషన్ ప్రతిపాదించింది. ఈరెండు కేంద్రాల స్థాపనకు రు. 140 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

బైలడిల్లా ముడి ఇనుము గనుల విస్తరణ కార్యక్రమం కూడా కార్పొరేషన్ చేపట్టబోతున్నది.

బైలడిల్లా గనులనుంచి ఈ సంవత్సరం 60 లక్షల టన్నులకు పైగా ముడి ఇనుము ఎగుమతి చేయడానికి కార్పొరేషన్ కార్యక్రమం రూపొందించిందని శ్రీ రావు తెలిపారు.

బైలడిల్లా, దోనమలై గనులలో దొరికే ముడిఇనుము ప్రాతిపదికపై ఏర్పాటు చేయదగు ఇనుపదిమ్మెల తయారీ కేంద్రాల స్థాపనపై సమగ్ర నివేదిక రూపొందించడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం మెటలర్జికల్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ (మెకాన్)ను ఏర్పాటు చేసింది.

దోనమలై గనుల్లో కూడా ఈసంవత్సరం ఉత్పత్తి 40 లక్షల టన్నులకు పెరుగుతుందని భావిస్తున్నారు.

నకిలీ బీడీ యజమానులకు జైలుశిక్ష

ఏలూరు, డిసెంబరు 27

ఆదాం షరీఫ్ దాసిశెట్టి హరిబాబు కలిసి తాము తయారు చేయించిన బీడీలను, మార్కెట్‌లో బాగా పలుకుబడి సంపాదించిన 'యస్' మార్కు బీడీ పేరుం వేయించి అమ్మకం చేస్తూ వున్నారన్న ఆరోపణ రుజువైనందున మొదటి వ్యక్తికి రు. 1500 జరిమానా, లేకుంటే 9 నెలల జైలుశిక్ష, రెండో వ్యక్తికి రు. 500 లేక మూడునెలలు కఠినశిక్షను మెజస్ట్రేటు శ్రీ సి. వెంకటేశ్వర్లు విధించారు.

టౌను పోలీసువారు కేసును దాఖలు చేశారు. పై ముద్దాయిల ఆధీనంలో గల 'యస్' మార్కు లేబుళ్ళు, తయారయిన బీడీలను కోర్టువారికి దాఖలు చేశారు.

(వి. వి.)



కందుకూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న శ్రీ రాజశేఖరరెడ్డి. వేదికపై వరుసగా, (కుడినుండి) గుజ్జుల సరళాదేవి, పూల సుబ్బయ్య, ఆర్. వెంకయ్య, దివి శంకరయ్య, జి. యల్లమందారెడ్డి డా॥ కోటారెడ్డి, సి. నాగభూషణం, ప్రేక్షకులలో ఒకభాగం.

ఆర్థిక కార్యక్రమం అమలును దెబ్బతీయడం హానికరం

కందుకూరు సభలో శ్రీ రాజశేఖరరెడ్డి హెచ్చరిక

(విశాలాంధ్ర విలేకరి)



కందుకూరు, డిసెంబరు 27

పేద ప్రజల అభివృద్ధికి కొంత మేరకు తోడ్పడే 20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలును వెనకపట్టు పట్టించి కుటుంబ నియంత్రణతో పేదల దైన్య స్థితిని మెరుగుపరుస్తుందని ప్రచారంచేయడం, పేదవాని ఆకలి తీర్చకుండా ఇంటిని శుభ్రపరచుకోమన్నట్లుగా వుందని భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ ఏలం రాజశేఖరరెడ్డి ఇక్కడ ఉద్ఘాటించారు.

ఐదు అంశాల కార్యక్రమానికి సూత్రప్రాయంగా కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకం కాదని, కాని దీన్ని ముందు పెట్టి 20 అంశాల కార్యక్రమం అమలును వెనక్కు కొడుతున్న అభివృద్ధి నిరోధక శక్తులను ప్రజలు గ్రహించాలని ఆయన అన్నారు.

ప్రకాశం జిల్లా, కందుకూరు తాలూకా కమ్యూనిస్టు సమితి నూతన కార్యాలయం "కోటారెడ్డి భవన్"కు ప్రారంభోత్సవం చేసిన అనంతరం జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో శ్రీ రాజశేఖరరెడ్డి ప్రసంగించారు. సభకు కొండెపి శాసనసభ్యులు శ్రీ దివి శంకరయ్య అధ్యక్షత వహించారు.

ప్రజా ప్రదర్శన

బహిరంగసభకు ముందు వెయ్యి మందికి పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలు ఎర్రజెండాలను చేబూని పట్టణంలో ప్రదర్శన జరిపారు,

కోటారెడ్డిభవన్‌కు శ్రీ రాజశేఖరరెడ్డి ప్రారంభోత్సవం చేసినతరువాత పార్టీ కార్యాలయంపై ఎర్రజెండాను, అఖిలభారత వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ గుజ్జుల ఎల్లమందా రెడ్డి ఆవిష్కరించారు. శ్రీ రాజశేఖరరెడ్డి పేరు పెట్టిన ఒక వీధికి ప్రదేశ్ రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రారంభోత్సవం చేశారు.

భారత కమ్యూనిస్టు పార్టీ 51వ వార్షికోత్సవ సంకేతంగా 51 [illegible] కార్యాలయ ప్రాంగణం, బహిరంగ సభాస్థలి బస్టాండు వద్ద ఎర్ర తోరణాలతో అలంకరణలు చేశారు.

'ఎత్తాలి మన ఎర్రజెండా' తదితర ప్రజా గీతాలాపనలతో బహిరంగసభ ప్రారంభమైంది. 10 వేల మంది హాజరైన ఈసభలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ కె. సవడా రెడ్డి స్వాగతంచెప్పి నాయకులను వేదికపైకి ఆహ్వానించారు.

శ్రీ రాజశేఖరరెడ్డి దేశరాజకీయ పరిస్థితులను సాకల్యంగా వివరిస్తూ, ఈనాడు కమ్యూనిస్టుపార్టీని గుత్తపత్రికలు, రేడియోలు పత్రికలలో ప్రచారం చేస్తున్నవని, కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెస్‌ను చీల్చడానికి ప్రయత్నిస్తున్నదనే ఆరోపణ దుర్బుద్ధితో కూడిన దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెజారిటీవున్నా శ్రీ పి. వి. నరసింహారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతిపాలనవిధించడానికి కారకులెవరు? గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కారకులెవరు? ఈనాడు ఒరిస్సా ప్రభుత్వ పతనానికి కారకులెవ్వరు? కమ్యూనిస్టుపార్టీయా? — లేక కాంగ్రెస్‌లో ఒక వర్గమా ప్రజలు ఆలోచించాలన్నారు.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ "నన్ను బలపరిచేవారు. నా కుమారుడు సంజయ్ గాంధీని బలపరచాలి" అంటున్నారు.

ఒక వాస్తవాన్ని పరిశీలించాలి కమ్యూనిస్టుపార్టీ ఎన్నడూ శ్రీమతి ఇందిరాగాంధీకి నిర్బంధంగా తోడ్పాటునివ్వలేదు. ఆ యా చర్యల మంచిచెడులనుబట్టి ప్రజాహితమైనవాటిని బలపరిచింది. ప్రజావ్యతిరేకమైనవాటిని వ్యతిరేకించింది, అని సోదాహరణంగా శ్రీ రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు.

ఆమె కుమారుడు సిద్ధాంతాలు పనికిరావంటారు — ఏ ఇజమూ వద్దంటున్నారు. ప్రభుత్వరంగ వ్యాప్తిని వ్యతిరేకిస్తున్నారు. సోషలిజం లక్ష్యంకొరకు అహరహం కృషి సలిపే కమ్యూనిస్టుపార్టీ ఈ అభిప్రాయాల నెలా బలపర్చగలదు? అని ప్రశ్నించారు.

యువజనకాంగ్రెస్ ఐదు అంశాల కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, చెట్లు నాటటానికి కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకంకాదు. వరకట్న దురాచార నిర్మూలనకు వ్యతిరేకం కాదు. కుటుంబనియంత్రణకు వ్యతిరేకం కాదు. వరకట్న దురాచార నిర్మూలన కమ్యూనిస్టు పార్టీ రోజువారి పనిలో ఒక భాగం. కుటుంబనియంత్రణలో నిర్బంధ పథకానికి పార్టీ వ్యతిరేకం. 20 అంశాల ఆర్థిక కార్యక్రమం అమలును ప్రక్కనబెట్టి అధికార యంత్రాంగాన్నంతా చెట్లు నాటటానికి, ఆపరేషన్లు చేయించడానికి మళ్ళించడం [illegible] అని శ్రీ రాజశేఖరరెడ్డి వివరించారు.

రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వై. వి. కృష్ణారావు ప్రసంగిస్తూ, రైతుల పరిస్థితి కొనబోతే కొరివి అమ్మబోతే అడివి చందంగా వుందన్నారు. గిట్టుబాటు ధరల సాధనకు రైతాంగం సంఘటితం కావాలన్నారు.

అత్యవసర పరిస్థితి అనంతరం ధరల ధర 100 కి 12 శాతం పెరిగిందని చిల్లర ధరలు ఏ విధంగా పెరిగినవో మనకు యిప్పుడు తెలుస్తున్నవని, కమ్యూనిస్టు పార్టీ అధిక ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత పోరాటం నడుపబోతున్నదని, దీనికి ప్రజలు తోడ్పాటు ఇవ్వాలన్నారు.

అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి ప్రసంగిస్తూ. రాజ్యాంగ ఉపక్రమణికలో పొందుపరిచిన సోషలిజం సాధనకు కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెస్‌లోపల వెలుపల వున్న వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా కృషి చేయాలన్నారు.

దర్శి, పొదిలి, కనిగిరి, కందుకూరు తాలూకాలకు నాగార్జునసాగర్ నీరు రాబట్టటానికి కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీల ఐక్య కృషిఅవసరమన్నారు.

రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి శ్రీ పూల సుబ్బయ్య, రైతుల వ్యవసాయ కార్మికుల ఈతి బాధలను వివరించారు.

రాష్ట్ర మహిళాసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీమతి గుజ్జుల సరళాదేవి ప్రసంగిస్తూ, కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు పేదల పక్షాన నిలుస్తుందని, నేడు పార్టీ బలీయమైన శక్తిగా రూపొందింది దన్నారు.

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ పెనవల్లి శ్రీరాములు మాట్లాడుతూ. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి గట్టి కృషి చేస్తామన్నారు.

డాక్టర్ కోటారెడ్డి తమ ప్రసంగంలో కమ్యూనిస్టుపార్టీకి తమ అండదండల్ని కొనసాగిస్తామన్నారు. మార్క్సిస్టు సాహిత్యంతో ఆ భవనంలో గ్రంథాలయం నెలకొల్పడానికి సహాయం చేస్తామన్నారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఆర్. వెంకయ్య ప్రసంగిస్తూ, అధిక ధరలకు వ్యతిరేకంగా జనవరి 1 న జరిగే ప్రదర్శనలను జయప్రదం చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తుపాను నష్టాల దృష్ట్యా పొగాకు పంటకు వాణిజ్య పన్ను రద్దు చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రజా నాట్యమండలి అధ్యక్షులు, సినీ నటులు శ్రీ నాగభూషణం గురు-శిష్య సంవాదంలో యువజన కాంగ్రెస్ 5 అంశాల కార్యక్రమాన్ని చమత్కారంగా వివరించారు.

అనంతరం ప్రకాశంజిల్లా ప్రజానాట్య మండలి దళం వారిచే "జగన్నాథ రథ చక్రాలు" నాటకం ప్రదర్శింపబడింది.

నిన్న మధ్యాహ్నం తాలూకా పార్టీ సభ్యుల, సానుభూతిపరుల జనరల్ బాడీ సమావేశం జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యుడు శ్రీ కూనంనేని రాములు అధ్యక్షతన జరిగింది. శ్రీ రాజశేఖరరెడ్డి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై నివేదిక యిచ్చారు

కృష్ణా జిల్లాలో 1.5లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం

కలెక్టర్ వెల్లడి

మచిలీపట్నం డిసెంబరు 25

కృష్ణాజిల్లాలో రాబీ కార్యక్రమాన్ని ఉధృతం చేసి, లోకలైజ్ చేయబడిన మొత్తం 1.5 లక్షల ఎకరాల భూమికి నీటి పారుదల సౌకర్యం కలిగేలా చూడాలని కలెక్టర్ శ్రీ పి. యస్. రావు అన్నారు.

బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అగ్రికల్చరల్ ఆఫీసర్ల జిల్లా స్థాయి శిక్షణ కేంద్రాన్ని గత బుధవారం యిక్కడ ఆయన ప్రారంభించారు.

ఉత్పత్తి తరుగుదల నివారించేందుకు నాట్లు చేపట్టాలన్నారు రైతులకు తగిన ఎరువులు. విత్తనాలు అందించగలమన్నారు.

రైతులకు కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు రు. 2 కోట్లు, విజయవాడ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు రు. 1 80 కోట్లు సాయం అందిస్తాయని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీ ఎం. అమ్మిరాజు తెలిపారు. ఈ శాఖ ఇస్తామన్న రు. 50 లక్షలలో రు. 20 లక్షలు ఇప్పటికే విడుదల చేశారు.

పొదుపుగా నీటి యాజమాన్యం చేసే తాజా పద్ధతులను 1000 ఎకరాల్లో అమలు చేయాలని తెలిపారు. జిల్లా సహకార అధికారి శ్రీ సి. వి. నాయుడు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ వి. దక్షిణామూర్తి ప్రసంగించారు.

వ్యవసాయ డిపోలపై సెమినార్

అంతకు ముందు ఆదివారం ఇక్కడ వ్యవసాయ డిపోల నిర్వహణపై సెమినార్ జరిగింది.

శ్రీ అమ్మిరాజు ఒక పత్రం సమర్పించారు. ఈ సెమినార్లో కృష్ణా జిల్లా [illegible] నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ బస్ స్టేషన్‌కు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ఇటీవల శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రితోపాటు, రెవిన్యూమంత్రి శ్రీ నరసారెడ్డి రవాణా శాఖ మంత్రి శ్రీ కేశవులును వేదికపై చూడవచ్చు

ఆంధ్రా యూనివర్సిటీ

వాల్తేరు, డిసెంబరు 28

1976 సెప్టెంబరు-అక్టోబరులలో ఆంధ్రా యూనివర్సిటీచే నిర్వహింపబడిన పరీక్షా ఫలితాలు ఈ క్రింద యివ్వబడినవి.

బి. ఇ. III(ఐ. ఎస్. టి.) ఎగ్జామినేషన్ సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్

మొత్తం పరీక్షలో లేరు

థియరీ

అడ్వాన్సుడు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ మరియు డ్రాయింగులో: 31 35ఎ 35-సి
మేథమెటిక్స్ V : లేరు.
మేథమేటిక్స్ VI : 35 35సి.
ఫిజిక్సు III : 31 33 35 ఎ 35సి
ఎస్. ఎమ్. టి. ఎస్ I : 35 35-సి
హైడ్రాలిక్సు : 31 35 ఎ
స్ట్రక్చరల్ ఇంజనీరింగు I : 31 35. ఎ 35-బి 35. సి.
సర్వేయింగ్ II : 31 34 35 ఎ 35సి
ఎలక్ట్రికల్ టెక్నాలజీ : 31 35 35. ఎ 35 బి 35సి
మెకానికల్ టెక్నాలజీ : 31 35ఎ 35సి

ప్రాక్టికల్స్

స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ : 31 35ఎ 35 సి
హైడ్రాలిక్స్ : 31 35 ఎ 35సి
సర్వేయింగు : 31 31 ఎ 35సి

బి. ఏ. యం. యస్. పరీక్షా ఫలితాలు

సంస్కృతంలో: 2 3 4 5 6 7 8 9 10 11 13 14 15 16 17 18 19 20 21 22 23 24 25 26 27 28
ఆయుర్వేద ఇతిహాసంలో: 1 2 3 4 5 6 7 8 9 10 11 13 14 15 16 18 20 21 22 23 24 25 26 27 28
పదార్థ విజ్ఞానమ్ అండ్ తంత్రయుక్తిలో: 1 2 3 4 5 6 7 9 10 11 13 15 16 18 19 20 21 22 23 24 25 26 27 28

12వ నెంబరు పరీక్షా ఫలితం తర్వాత ప్రకటింపబడును.

II బి. ఏ. యం. యస్.

మొత్తం పరీక్షలో: 29 మాత్రమే.
శరీర రచనలో: 31 మాత్రమే
శరీరక్రియలో: 30 మాత్రమే

IV బి. ఏ. యం. యస్.

మొత్తం పరీక్షలో: లేరు.
రోగ నిదానమ్: 32 మాత్రమే
అగదతంత్ర మరియు వ్యవహార ఆయుర్వేదం : 32 33 A 32 B.
బయో స్టాటిస్టిక్స్: 32 A మాత్రమే

V బి. ఏ. యం. యస్.

ఫస్ట్‌క్లాస్ : 34 35 36 38 40.
సెకండ్ క్లాస్ : 33 37 39 41 42 43

యమ్. ఇ. ఫస్ట్ సెమిస్టర్: సెప్టెంబరు 1976 సివిల్ ఇంజనీరింగ్ (బ్రాంచ్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ (యస్. ఆర్.)

మొత్తం పరీక్ష: 58 59 60 61 62

కమిషనర్ వారి కార్యాలయం, దేవదాయశాఖ-హైదరాబాదు

నోటీసు నెం. ఎ5/66177/76 తి. 14-12-76.

ఆంధ్రప్రదేశ్ ధర్మాదాయ హిందూదేవాదాయ సంస్థల
చట్టం *1966* సెక్షన్ *74 (1)* మేరకు

నోటీసు

విషయం: (1) మేనేజింగ్ ట్రస్టీ శ్రీ అద్దంకి ఛారిటీస్. అద్దంకి, ప్రకాశం జిల్లా. వారు చేసిన ప్రతిపాదన.

(2) అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయశాఖ, ఒంగోలు 27-10-76 తేదీన పంపిన ఆర్. సి. నెం ఎ3/98 0/76-3

మేనేజింగ్ ట్రస్టీ శ్రీ అద్దంకి ఛారిటీస్, అద్దంకి గ్రామం. ప్రకాశంజిల్లా వారు యిందులో జతపరచిన షెడ్యూలులో వివరంగా పేర్కొనబడిన య 66 92 సెం. మరియు 41.30 సెంట్లు గల భూమిని విక్రయించేందుకు అనుమతిని కోరుతూ దరఖాస్తు పెట్టుకొన్నందున యిందులో ఆసక్తి గలవారు తమ సలహాలను, అభ్యంతరాలను, వ్రాత పూర్వకంగా ఈ కార్యాలయానికి తేదీ 21-1-1977 నాటికి లేదా అంతకుముందు చేరునట్లు పంపుకోవచ్చునని యిందుమూలంగా తెలియచేయడమయినది.

ఈ విషయంలో కమిషనర్ గారిచే నాంపల్లి హైదరాబాదులోని తమ కార్యాలయంలో 30-1-77 మధ్యాహ్నం 2 గంటలకు విచారణ జరుపబడును

అభ్యంతరాలు పంపుకొన్న వారు గైరుహాజరయిన యెడల ఏకపక్షంగా నిర్ణయించ బడును.

షెడ్యూలు:

ఎ. ప్రతిపాదించబడిన లావాదేవి స్వభావం: బహిరంగవేలంలో భూమి అమ్మకం.

బి. సర్వేనంబరు, విస్తీర్ణం వార్డు నెంబరు డోరు నెంబరు (మునిసిపాలిటీ పరిధులలో ఈ స్థిరాస్తులున్న సందర్భాలలో) వగైరా వివరాలతో ప్రతిపాదించబడిన లావాదేవీకి సంబంధించిన ఆస్తిపై నిర్దిష్ట సమాచారం.

ప్లాట్	సర్వే	విస్తీర్ణం య సెం.	గ్రామం తాలూకా మరియు జిల్లా
I	278	66-92	అద్దంకి గ్రామం, తాలూకా ప్రకాశంజిల్లా
II	117	41-30	

సి. ప్రతిపాదించిన విక్రయానికి సంబంధించిన ఆస్తిపై భూమిశిస్తు సెస్సు, క్విట్ రెంట్, గ్రౌండ్ రెంట్ ఏదైనా వుంటే కట్టవలసి వున్న మదింపు చేయబడిన రెవెన్యూ రు. 40/-

డి. ప్రతిపాదింపబడిన విక్రయానికి సంబంధించిన ఆస్తిపై ఎలాంటి ఎన్‌కంబరెన్సు లేదు.

ఇ. తనఖా పెట్టే ప్రతిపాదన [illegible]

యఫ్. అమ్మదలచిన భూమికి ఆశిస్తున్న ధర సుమారుగా యకరా ఒకటికి రు. 5000/- నుంచి రు 6000/- వరకు

అన్ని తరగతుల వ్యక్తులందరూ వేలంలో పాల్గొనేందుకు వీలుగా అవసరమైనప్పుడు ఆ భూమిని చిన్న చిన్న ఖండాలుగా విభజించవలసి వుంటుంది. మొత్తం భూమిని ఒకేసారి బహిరంగ వేలంలో అమ్మవలెనని ఈ శాఖ మేనేజింగ్ ట్రస్టీని కోరడమైనది.

(సం.) జి. టి. నాయుడు,
పి. ఎ. (జి) టు కమిషనర్

బ్లాక్ మార్కెట్‌దార్లపై కఠిన చర్యలు : ఓంమెహతా ప్రకటన

కొచ్చిన్, డిసెంబర్ 26

అత్యవసర పరిస్థితి సడలించడాన్ని అవకాశంగా తీసుకొని దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని కేంద్ర హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఓం మెహతా నేడు బ్లాక్ మార్కెటీర్లను, అక్రమ వ్యాపారులను హెచ్చరించారు.

అత్యవసర పరిస్థితి సడలించబడ్డాక ఇటీవలి కాలంలో వీరు అక్రమ చర్యలకు పాల్పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.

ఎర్నాకుళం పోలీస్ క్వార్టర్స్‌ను ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

ఆర్థిక నేరస్తులపై చర్యలు తీసుకోవటంలో ఏమాత్రం మెతకదనాన్ని ప్రదర్శించవద్దని పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన ప్రకటించారు.

సవాళ్ళను ఎదుర్కొనేందుకుగాను దేశం పోలీసుదళాలను ఆధునికపరిచేందుకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నది. కేంద్రం అజమాయిషీలో ఢిల్లీ, కలకత్తా, హైదరాబాదులలో ఫోరెన్సిక్ లేబరేటరీలు ఏర్పాటు, పోలీసు అధికారుల శిక్షణా పథకాన్ని ఆధునిక పరచడం వంటి చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

అత్యవసర పరిస్థితి క్రింద పోలీసులు విచక్షణా రహితంగా అధికారాలు వినియోగించటాన్ని అనుమతించటం జరగదని అయన అన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు రాష్ట్ర హోం మంత్రి శ్రీ కరుణాకరన్ అధ్యక్షత వహించారు.

అతి పిన్న వయసులో బాలలకు విద్య

శ్రీ జెట్టి విచారం

కొల్హాపూర్ (మహారాష్ట్ర), డిసెంబరు 26

బాలలకు ఐదు, ఆరు సంవత్సరాల వయస్సులో ప్రాథమిక విద్య ప్రారంభించటానికిబదులుగా 3, 4 సంవత్సరాల వయస్సులోనే వ్యాయమ, చదువు నేర్పించడంపట్ల ఉపరాష్ట్రపతి శ్రీ బి. డి. జెట్టి విచారం వ్యక్తం చేశారు.

ప్రాథమిక ఉచితవిద్యఅసోసియేషన్ 12వ వార్షికోత్సవాన్ని ప్రారంభించవలసివున్న శ్రీ జెట్టి అస్వస్థత కారణంగా రాలేకపోయారు. ఆయన ఉపన్యాసాన్ని మహారాష్ట్ర డిప్యూటీ మంత్రి ఒకరు చదివారు.

అసోసియేషన్ చైర్మన్ పార్లమెంటు మాజీ సభ్యులు శ్రీ గంగాచరణ్‌సిన్హా వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించారు.

మొదటిసారిగా ఎక్కువగా ఆదివాసులున్నటువంటి ఈగిరిజన ప్రాంతంలో జరుగుతున్న వార్షిక సభకు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

గ్రామ బాలల శిక్షణా కేంద్ర కార్యదర్శి శ్రీమతి అనుతాయ్ వాఘ స్వాగతం పలికారు.

పిల్లల యెడల పాశ్చాత్య దేశాలలో తీసుకునే జాగ్రత్తలు, శ్రద్ధ మన దేశంలో తీసుకోలేకపోతున్నామని శ్రీ జెట్టి తెలిపారు

ఇటీవలి కాలంలో భారతదేశంలో కూడా పిల్లలపట్ల శ్రద్ధవహిస్తున్నందుకు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాల వయస్సులో 80 శాతం మెదడువృద్ధి పొందుతుందని బడికి పంపే ముందుగానే వారిపట్ల శ్రద్ధ వహించాలన్నారు.

ఐదు సంవత్సరాల క్రితం అధ్యక్షతన ఏర్పడిన కమిటీ సిఫారసు మేరకు, ప్రధాని అధ్యక్షతన 'జాతీయ బాలల బోర్డు' ఏర్పాటుకు కేంద్రం ఆమోదించడం పట్ల శ్రీ గంగాచరణ్‌సిన్హా హర్షాన్ని వెలిబుచ్చారు

రోటరీ జిల్లా వార్షిక సమావేశం

విజయవాడ డిసెంబరు 26

రోటరీ జిల్లా 315 వార్షిక సమావేశం 1-77 జనవరి 8, 9 తేదీల విజయవాడలో లా కళాశాల ఆవరణలో జరుగనున్నట్లు గవర్నర్ శ్రీ జి. కామరాజు నేడిక్కడ తెలిపారు

పత్రికా విలేకరుల సమావేశంలో సమావేశ వివరాలు తెలిపారు 1500 మంది ప్రతినిధులు వారి కుటుంబాలు పాల్గొనగలరన్నారు. విజయవాడలో రోటరీ వార్షిక సమావేశం జరగడం యిదే ప్రథమం. హాంగ్‌కాంగ్‌కు చెందిన శ్రీ హరి హరిలెల రామకృష్ణ సమితికి చెందిన స్వామి రంగనాథానంద కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య ప్రారంభోత్సవం చేస్తారు. జనవరి సాయంత్రం శ్రీమతి సుశీల, సుబ్రహ్మణ్యం, సంగీత విద్వాంసులు శ్రీ [illegible] సంగీత కార్యక్రమం వుంటుంది

విజయవాడ రెండు రోటరీ క్లబ్బులూ యీ సమావేశాన్ని నిర్వహిస్తాయి శ్రీ ఎ.యస్.రాజా అధ్యక్షతన శ్రీ యస్.వి. సుబ్బారావు కార్యదర్శిగా కాన్ఫరెన్సు కమిటీ ఏర్పడింది

తమ 7 క్లబ్బులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను శ్రీ కామరాజు వివరించారు మూడు లక్షలమందికి రక్షిత నీటి సదుపాయాన్ని కలిగించిందని తెలిపారు. 20 వేల మంది విద్యార్థులకు ఉచిత విద్యను క్లబ్బులు కల్పిస్తున్నాయన్నారు (వి. వి.)

రోజుకు మద్రాసు రోడ్లపై 1300 టన్నుల చెత్త

మద్రాసు డిసెంబరు 26

మద్రాసు నగరంలోని 27 లక్షల మంది ప్రజలు ప్రతిరోజూ 1300 టన్నుల చెత్తను రోడ్లపైన వేస్తున్నారు. నగర మున్సిపల్ కమీషనర్ శ్రీ కె. ఎ. దివాన్ మొహమ్మద్ నేడిక్కడ జరిగిన "నగర పారిశుధ్యమండలి" సమావేశంలో తెలియజేశారు.

నగరాన్ని పరిశుభ్రంగా వుంచవలసిన తీరుతెన్నులపైన రెండు గంటలపాటు జరిగిన చర్చల్లో ఆయన ప్రసంగిస్తూ, చెత్తా చెదారాన్ని వెయ్యడంలో మద్రాస్ మహానగరం మొదటి స్థానాన్ని పొందుతుందని చెప్పారు.

అరటి పండ్లు తిన్న అనంతరం వాటి తొక్కలను రోడ్లపైన వేయడం అలవాటయిందన్నారు. ప్రస్తుతం నగర పారిశుద్ధ్య సిబ్బందిలో కేవలం ఆదిఆంధ్రులుమాత్రమే వున్నారు. వారు పరిమితంగా వుండటం వలన సిబ్బందిని పెంచేందుకు చాలా కష్టంగా వుంది. చాలా తక్కువమంది మాత్రమే అందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

ప్రతి రోజూ ఒక నిర్ణీత సమయానికి చెత్తను తీసుకొని వెళ్లే వాహనం వచ్చేంతవరకు వీధుల్లో వెయ్యకుండా అలాగే వుంచాలని ప్రజలకు సూచించారు.

ఈ విధంగా చేసినట్లయితే నగరం పరిశుభ్రంగా వుంటుంది ప్రజలకు ఈ విషయాలను గురించి చెప్పాలి అలాగే ఎక్కువ చెత్త కుండీలను రోడ్లవెంట వుంచాలని శ్రీ మొహమ్మద్ చెప్పారు.

అభివృద్ధి చెయ్యవలసిన ప్రాంతాల జాబితాలను, అలాగే మరుగు దొడ్ల ఏర్పాటు నూతన కాలనీల్లో డ్రైనేజి సౌకర్యాలను గూర్చి పారిశుద్ధ్యమండలి సభ్యులు శ్రీ ఆర్ దల్వాయ్ తదితరులు సూచించారు. వీధుల్లో చెత్తను వేసే హోటల్ యజమానులపైన, కళ్యాణ మంటపాలపై కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని చెప్పారు

ఎక్కువ జనాభా వచ్చే బ్యాంకులు, హోటళ్ళ వద్ద తగిన టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. నగరం మొత్తానికి ఒక డ్రైనేజి పథకాన్ని రూపొందిస్తున్నట్లు కమీషనర్ తెలిపారు.

డాక్టర్ ఎ. బి మంకార్ ప్రసంగిస్తూ మునిసిపల్ కార్పొరేషన్ వైద్యశాలల్లో ప్రాథమిక యూనిట్లను ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

శ్రమదానరోడ్డుకు సంజయ్ ప్రారంభం

బల్కీ (బీదార్), డిసెంబర్ 26

5 వేల మంది యూత్ కాంగ్రెసు కార్యకర్తలు ఐదురోజుల్లో నిర్మించిన 10 కిలోమీటర్ల మట్టిరోడ్డును శ్రీ సంజయ్‌గాంధీ యీరోజు ప్రారంభోత్సవం చేశారు.

ఈ మట్టిరోడ్డు బల్కీ పట్టణాన్ని మరూర్ గ్రామంతో కలుపుతుంది.

శ్రీ సంజయ్‌గాంధీ యీ సందర్భంగానే చెన్నబసవేశ్వర కాలేజీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు కాలేజి వెనుకవైపున వేసిన మేనక-సంజయ్ తోటలో ఒక సపోటా మొక్కను శ్రీ సంజయ్ నాటారు.

శ్రీమతి మేనకాగాంధీ కూడ భర్తతో కలిసి ఒక కొబ్బరి మొక్కను నాటారు. ఆ తర్వాత కాలేజీలోని 100 మంది బాలికలు ఒక్కొక్క మొక్క నాటారు.

ఇటీవలనే ఒక్కరోజులో 205 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి జాతీయ రికార్డును స్థాపించడం ద్వారా బల్కీ పట్టణం వెలుగులోకి వచ్చింది

సంజయ్‌గాంధీ ఢిల్లీ పయనం

హైదరాబాదు డిసెంబర్ 26

ఆంధ్రప్రదేశ్, కర్నాటకలలో పర్యటించిన శ్రీ సంజయ్‌గాంధీభార్య మేనకా గాంధీతో కలిసి ఢిల్లీ తిరిగి వెళ్ళారు.

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు కర్నాటక ముఖ్యమంత్రి శ్రీ దేవరాజ్ అర్స్ తదితరులు హైదరాబాద్ విమానాశ్రయంలో శ్రీ సంజయ్‌గాంధీకి వీడ్కోలు చెప్పారు.

ప్రముఖ రచయిత యశ్‌పాల్ మృతి

లక్నో డిసెంబర్ 26

ప్రముఖ విప్లవకారుడు నవలా రచయిత శ్రీ యశ్‌పాల్ గుండె నిలిచిపోయి యీ రోజు చనిపోయారు.

ఆయన వయస్సు 73 సంవత్సరాలు కొంతకాలంగా అస్వస్థతతో వున్న శ్రీ యశ్‌పాల్‌కు భార్య కుమారుడు, కుమార్తె వున్నారు

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో జన్మించిన శ్రీ యశ్‌పాల్ హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్‌లో చేరి స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్రను నిర్వహించారు.

1932 లో అరెస్టు అయ్యారు 14 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. అయితే 1938లో విడుదలయ్యారు

అనేక నవలలు, కథానికలు రచించిన శ్రీ యశ్‌పాల్ అనేక దేశాలలో పర్యటించారు ఆయన రచనలు రష్యన్ తోసహా అనేక భాషలలోకి అనువదించబడ్డాయి.

శ్రీనగర్ లోయలో భారీగా మంచు

శ్రీనగర్ డిసెంబర్ 26

కాశ్మీర్ లోయ ప్రాంతంలో యీ రోజు రెండవ రోజు కురిసిన భారీ వర్షాలు, మంచు ఫలితంగా ఢిల్లీ, శ్రీనగర్‌ల మధ్య విమాన రాకపోకలు నిలిచిపోయాయి.

వాతావరణం సరిగా లేకపోవటం సరిగా కనిపించకపోవటం మూలంగా విమాన ప్రయాణాలు నిలుపు చేసినట్లు ఇండియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి అన్నారు.

శ్రీనగర్‌లోను, పరిసర ప్రాంతాలలోను ఉదయం కురిసిన భారీ వర్షాల అనంతరం మధ్యాహ్నంనుండి మంచు పడటం ప్రారంభించింది.

ఎత్తయినకొండప్రాంతాలలోగల గుల్‌మార్గ్ తదితరచోట్ల 36 నుండి 40 సెంటీమీటర్ల మందాన మంచుపడింది. లడక్ ప్రాంతంలో కూడ ఎక్కువగా మంచుపడినట్లు వార్తలు అందాయి.

కులూ లోయలో

సిమ్లాలోని కులూలోయప్రాంతంలో యీ సీజన్‌లో మొదటిసారిగా యీ రోజు మంచు కురిసింది.

మనాలి, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలలో 15 నుండి 20 సెంటీమీటర్ల మందాన మంచు పడింది.

ఇరాన్ రాజుతో భుట్టో చర్చలు

న్యూఢిల్లీ డిసెంబరు 26

పాకిస్తాన్ ప్రధానమంత్రి భుట్టో నేటి రాత్రి ఇరాన్‌రాజు షాతో టెహరాన్‌లో సంప్రదింపులు జరిపినట్లు పాకిస్తాన్ రేడియో తెలిపింది

షా ఆహ్వానంపై ఇరాన్‌లో రెండు రోజులపాటు పర్యటించేందుకు భుట్టో ఈరోజే టెహరాన్ చేరుకున్నారు.

భుట్టో వెంట రక్షణ విదేశ వ్యవహారాల మంత్రి అజీజ్ అహ్మద్, విదేశాంగ శాఖ కార్యదర్శి ఆగాషాహి ఉన్నారు.

ఢిల్లీలో వరకట్న వ్యతిరేక సభ

న్యూఢిల్లీ, డిసెంబరు 26

వరకట్న దురాచారాన్ని నిరోధించేందుకు నేడు రాజధానిలో బహిరంగ సభ జరిగింది. వరకట్నాన్ని అంగీకరించకూడదని అనేక మంది యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిన చేశారు.

వరకట్న వ్యతిరేక కమిటీ వారు ఈ సభను ఏర్పాటు చేశారు.

మహాసభకు ముందుగా వరకట్నాన్ని వ్యతిరేకిస్తూ వ్రాసిన ప్లేకార్డులు ధరించి ప్రదర్శన చేశారు. ప్రదర్శనలో శ్రీ సంజయ్ గాంధీ చిత్రాన్ని ధరించారు.

మచిలీపట్నం సమీపంలోని పోలవరంలో తిలంకారీ యూనిట్‌ను 19 మంది సభ్యుల జపాన్ బృందం ఇటీవల సందర్శించింది.

ఒరిస్సాలో శ్రీ ఆచార్య నాయకత్వాన మంత్రివర్గం

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం

భువనేశ్వర్, డిసెంబరు 26

ఒరిస్సాలో మంత్రి వర్గాన్ని ఏర్పరచవలసిందిగా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా ఎన్నికైన శ్రీ వినాయక్ ఆచార్యను రాష్ట్ర గవర్నర్ శ్రీ శివనారాయణ్ నేటి రాత్రి ఆహ్వానించారు

గవర్నర్ వర్తమానం అందిన వెంటనే శ్రీ ఆచార్య గవర్నర్‌ను కలుసుకొని మంత్రి వర్గ ఏర్పాటుకు తన ఆమోదాన్ని తెలియజేశారు.

నూతన మంత్రివర్గ సభ్యుల జాబితాను మంగళవారంనాడు సమర్పించగలనని గవర్నర్‌కు తెలిపినట్లు శ్రీ ఆచార్య పత్రికల వారికి చెప్పారు.

జీవిత చరిత్ర

శ్రీ ఆచార్యగంజాం జిల్లా బరంపూర్‌లో జన్మించారు. విద్యాభ్యాసం ముగిశాక ఆయన ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని ప్రారంభించారు తరువాత బరంపూర్‌లోని హైస్కూలు హెడ్‌మాస్టర్‌గా నియమించబడ్డారు. దాదాపు 25 సంవత్సరాలపాటు ఆయన హెడ్‌మాస్టర్‌గా పని చేశారు.

23 సంవత్సరాల క్రితం ఆయన రాజకీయాలలో ప్రవేశించారు 1969 లో కాంగ్రెస్ చీలినపుడు ఆయన శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వాన్ని బలపరిచారు.

1970 లో శ్రీ బిజూ పట్నాయక్ ఉత్కళ కాంగ్రెసును ఏర్పరచినపుడు కాంగ్రెసు లెజిస్లేటర్లలో ఎక్కువ భాగం ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ చీలిన తరువాత శ్రీ ఆచార్య ఉత్కళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కన్వీనర్‌గా నియమించబడ్డారు.

1967 లో మొదటిసారిగా బరంపూర్ నియోజకవర్గం నుండి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 31 మంది సభ్యులుగల కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ ఉపనాయకునిగా ఆయన ఎన్నికయ్యారు ఒక సంవత్సరం తరువాత ప్రతిపక్ష నాయకునిగా ఆయన ఎన్నికయ్యారు.

1971 లో ఆయన తిరిగి శాసనసభకు ఎన్నికయ్యారు. 1972 లో శ్రీమతి శతపథి మంత్రివర్గంలో ఆయన వ్యవసాయ, సహకారశాఖలను నిర్వహించారు.

1973 లో శ్రీమతి శతపథి మంత్రివర్గం రాజీనామా చేసిన తరువాత ఆయన బరంపూర్ మున్సిపాలిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

1974 లో రాష్ట్ర శాసనసభకు తిరిగి ఎన్నికై శ్రీమతి శతపథి మంత్రివర్గంలో ఆర్థికశాఖమంత్రిగా పనిచేశారు

ఈ సంవత్సరం విధింప తలపెట్టిన సాగర్‌అభివృద్ధిపన్ను రద్దుచేయాలి

నల్గొండజిల్లా రైతుసంఘ కార్యకర్తల సమావేశం విజ్ఞప్తి

నల్గొండ, డిసెంబరు 26

ఈ సంవత్సరం విధింప తలపెట్టినసాగర్ అభివృద్ధి పన్నును రైతులు భూముల అభివృద్ధి చేసేందుకు తెచ్చినరుణాలన్నీ తీరేవరకు విధించరాదని, అన్నిరకాల అప్పులను రద్దుచెయ్యాలని, ఈ సంవత్సరం ఖరీఫ్ శిస్తును రద్దుచెయ్యాలని కోరుతూ ఇటీవల నల్గొండలో జరిగిన నల్గొండజిల్లా రైతుసంఘ కార్యకర్తల విస్తృత సమావేశంలో తీర్మానించారు

సమావేశానికి జిల్లా రైతు సంఘ అధ్యక్షులు అధ్యక్షత వహించారు. రాష్ట్ర రైతు సంఘ నాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు రైతాంగం నేడు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘ సభ్యత్వాన్ని పెంచాల్సిన అవసరాన్ని గూర్చి వివరించారు.

గత నవంబరు మాసంలో వరుసగా వచ్చిన మూడు తుపాన్‌ల ఫలితంగా దెబ్బతిన్న హుజూరునగరు, మిర్యాలగూడెం తాలూకాల్లో ప్రజలు తగు సహాయ కార్యక్రమాలు చేపట్టి ఆదుకోవాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జిల్లాలో రైతుసంఘ నిర్మాణ కార్యకలాపాలపై కార్యదర్శి శ్రీ పి. రాంకోటేశ్వరరావు నివేదిక సమర్పించారు.

చర్చలలో శ్రీయుతులు కె. రామచంద్రారెడ్డి దొడ్డా నర్సయ్య, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈనెలచివరకు 20వేల సభ్యత్వం చేర్పించేందుకు కోటాలు తీసుకొన్నారు

హుజూరునగర్ తాలూకాలో రైతుసంఘ సమావేశం

డిసెంబరు 16వ తేదీన హుజూరునగరు తాలూకా రైతుసంఘ కార్యకర్తల సమావేశం శ్రీ దొడ్డా నరసయ్య అధ్యక్షతన జరిగింది రాష్ట్ర రైతు సంఘ నాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు రైతు సమస్యలపై ప్రసంగించారు

ఇంకా శ్రీయుతులు పి. రాంకోటేశ్వరరావు, కోటానారయ్య, చింతలపూడిరాములు, తదితరులు ప్రసంగించారు. ఐదుగురి సభ్యులనే తాలూకా కార్యవర్గంలోకి కోఆప్ట్ చేసుకున్నారు 20 గ్రామాల నుండి వందమంది కార్యకర్తలు హాజరయ్యారు.

నర్సీపట్నం తాలూకా వ్య. కా. సంఘ సమావేశం

విశాఖపట్నంజిల్లా నర్సీపట్నం తాలూకా కళ్యాణలోవ పి. డబ్ల్యు. డి భవనంలో వ్యవసాయ కార్మికుల సమావేశం జరిగింది 600 మంది సభ్యులు హాజరయ్యారు. శ్రీ చౌక్కాకుల బాలయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎం దేవుడు రాజకీయ రిపోర్టు ఇచ్చారు. తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ వై. మాకిరెడ్డి యువజన సమాఖ్య నాయకులు శ్రీ ఎం రాజబాబు ప్రసంగించారు. 31 మందితో కమిటీనిఎన్నుకున్నారు. ఆ ఏరియా సంఘ అధ్యక్షులు శ్రీ చీపురు అప్పారావు కార్యదర్శి శ్రీ కేదారి దేవుడు, కోశాధికారి శ్రీ బొండా పోతురాజులు ఎన్నికయ్యారు శ్రీ మాకిరెడ్డి వందన సమర్పణ చేశారు.

నిజామాబాద్ జిల్లా వ్యా॥కా॥ సంఘ సమావేశం

నిజామాబాద్‌జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తల విస్తృత సమావేశం ఇటీవల జి సీతమ్మ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డాక్టర్ సి.హెచ్. వెంకట్రామారావు హాజరయ్యారు.

శ్రీ వేమూరి బాలయ్య నివేదిక సమర్పించారు జిల్లా కాంగ్రెసు సోషలిస్టుఫోరం నాయకులు జి. నరసారెడ్డి జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయకార్యదర్శి శ్రీ వెంకటరెడ్డిలు ప్రసంగించారు.

భారికూరులో బహిరంగసభ

నిజామాబాదుజిల్లా దాన్వాడ తాలూకా బారికూరు గ్రామంలో ఈనెల 16 వ తేదీన కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది.

సభకు జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ పడుచూరి సీతారామయ్య అధ్యక్షత వహించారు.

రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీపూసుబ్బయ్య జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై ప్రసంగించారు

శ్రీ వేమూరి బాలయ్య వక్తలను వేదికపైకి ఆహ్వానించారు

గోదావరిఖని ప్రజానాట్యమండలి వారు పాటలు పాడారు.

సురిజేపల్లిలో బహిరంగసభ

ప్రకాశంజిల్లా అద్దంకి తాలూకా గరిజేపల్లిలో ఈనెల 21 వ తేదీన కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన బహిరంగ సభ జరిగింది. గ్రామ సర్పంచ్ శ్రీ గగ్గెర సుబ్బారావు అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ వాట్ల అంజయ్య వక్తలను ఆహ్వానించారు.

తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ కటారి బలరామరెడ్డి, జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీనాతాని వెంకటస్వామి ప్రసంగించారు. 10 బస్తాల ధాన్యం సంఘానికి విరాళంగా యివ్వడానికి వాగ్దానం చేశారు.

చింతపల్లి ఫిర్కా ప్రజాసంఘాల సమావేశం

దేవరకొండ, డిసెంబరు 26

నల్గొండజిల్లా, దేవరకొండ తాలూకా చింతపల్లి ఫిర్కా కమ్యూనిస్టుపార్టీ యితర ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం ఈనెల 19 వ తేదీన ఎంజమూరుగ్రామంలో తాలూకా యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ టి. శేఖరరెడ్డి అధ్యక్షతన జరిగింది. 20 గ్రామాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శాసనసభ్యులు శ్రీ బి. రామశర్మ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను, ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి నిర్ణయాలను వివరించారు రాష్ట్ర సమితి నిర్ణయాల అమలుకు చేపట్టవలసిన కార్యక్రమాన్ని వివరించారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎ. నారాయణరావు తాలూకాలోని అనావృష్టి పరిస్థితులను, గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న యిబ్బందులను వివరించారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ వి రత్నాకరరావు పార్టీ సభ్యత్వం చేర్పించు కార్యక్రమాన్ని వెంటనే పూర్తిచేయవలసిన ఆవశ్యకతను వివరించారు.

ఫిర్కాలో 1500 రైతుసంఘ సభ్యత్వాన్ని డిసెంబరు 31లోగా చేర్పించాలని, రెండువేల యువజన సంఘ సభ్యత్వం చేర్పించాలని, రు. 25 వేల పార్టీనిధి వసూలుచేయాలని, 1977 జనవరి 25 లోగా పార్టీ సభ్యత్వం చేర్పించు పూర్తిచేయాలని సమావేశం నిర్ణయించింది.

అదేరోజు రాత్రి జరిగిన బహిరంగసభకు రెండు వేలమంది ప్రజలు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ శ్రీ డి. మోహన్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. సభలో శ్రీయుతులు రామశర్మ, వి నారాయణరావు శేఖరరెడ్డి యం. నరసింహులు, వి. రత్నాకరరావులు ప్రసంగించారు.

అంతకుముందు సాయంత్రం 6 గంటలకు అమరజీవి అరికంటి రాములు స్మారక స్థూపం వద్ద తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వి. నారాయణరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ గ్రామాల నుండి వచ్చినవారు స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలను వుంచారు.

ముదిగొండ బుర్రకథ దళం శ్రీ నారాయణ నాయకత్వాన విప్లవ గేయాలు ఆలపించి బుర్రకథ చెప్పింది.

ఒంగోలులో తంతితపాలా వారోత్సవాలు

ఒంగోలు డిసెంబరు 22

తంతితపాలా వారోత్సవాల సందర్భంగా ఒంగోలు హెడ్ పోస్టాఫీసులో ఈనెల 18న జరిగిన సమావేశంలో తపాలాశాఖ సూపరింటెండెంటు శ్రీ యస్ భాస్కరరావుప్రసంగిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలకు ప్రతిరోజూ ఉత్తరాల బట్వాడా సౌకర్యంవుంటుందని అన్నారు

భవిష్యత్‌లో మరో ఒక సబ్‌పోస్టాఫీసును జిల్లాలో ప్రారంభించదలచామని అన్నారు. 11 వేల సేవింగ్స్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించబడ్డాయని అన్నారు. అన్ని కార్యాలయాలలో నిరోధ్‌లను అమ్మటం ద్వారా కుటుంబ నియంత్రణ ఉద్యమానికి తమ శాఖ తోడ్పడుతున్నదని అన్నారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ జి సత్యనారాయణ సభకు అధ్యక్షతవహించారు. రెండవసారి ఉత్తరాల బట్వాడా చేసే సౌకర్యం కల్గించడంతోపాటు తొందరగా ఉత్తరాలు బట్వాడాఅయ్యేవిధంగా చూడాలని కోరారు.

స్థానిక న్యాయవాది శ్రీ ఎన్. వి. సుబ్బారావు ప్రసంగించారు. ఎక్కువ సర్వీసుగల శ్రీ జె నరసయ్యను తంతి తపాలా శాఖ సిబ్బంది సన్మానించింది.

అంతకుముందు హెడ్ పోస్ట్‌మాస్టర్ శ్రీ ఎ. వి. ఎస్ వి. శాస్త్రి స్వాగతం చెప్పారు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ వి. నాయుడు వందన సమర్పణ చేశారు.

మార్కాపురంలో

మార్కాపురం, డిసెంబరు 22

మార్కాపురంలో యిటీవల తంతి తపాలా వారోత్సవాలు జరిగాయి. ఉత్సవాలకు జె ఇ. శ్రీ రాజా పురప్రముఖులను ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ ఎక్స్‌ఛేంజికి సొంత భవనం అవసరమని అన్నారు.

ఉత్సవాలలో మార్కాపురం తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యదర్శి ధావులపల్లి చెంచయ్య పురప్రముఖులుశ్రీ తన్నీరువెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ మార్కాపురంనుండి ఒంగోలుకు నరాసరి టెలిఫోన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తాలూకాలోని దోర్నాల, త్రిపురాంతకం, పుల్లలచెరువులలో పబ్లిక్ కాల్ ఆఫీసులను త్వరలో ఏర్పాటు చేయాలని కోరారు.

(వి. వి.)

విజయనగరంలో ఆడిటోరియం ఏర్పాటుకు కృషి

విజయనగరం, డిసెంబరు 26

సకల కళలకు కాణాచి విజయనగరం. పట్టణంలో సుమారు వెయ్యమంది కళాకారులు వున్నారు ఇటువంటి పట్టణంలో ప్రదర్శనలకు ఆడిటోరియం లేకపోవడం కళాకారులలో నిరుత్సాహం కల్గిస్తోంది.

ఇటీవల పట్టణ కళాకారుల సమాఖ్య ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రారంభోపన్యాసం యిస్తూ సత్వరం ఆడిటోరియం నిర్మాణానికి తన శాయశక్తులా సహాయం చేస్తామని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ యస్. బి. పి. బి. కె. సత్యనారాయణ రావు హామీ యిచ్చారు. స్థానిక శాసన సభ్యులు శ్రీ వి అప్పన్నదొర, మునిసిపల్ ప్రత్యేకాధికారి శ్రీబి. పెదకాపు ప్రభృతులు ఆడిటోరియంనిర్మాణానికికొంతధనంచందా రూపంగా వసూలైందని కొన్ని సాంకేతిక యిబ్బందుల వలన ఆలస్యమైందని, అయినా ఆర్థిక మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డిగారు విజయనగరంలో ఆడిటోరియం నిర్మాణానికి హెచ్చు ప్రాధాన్యత యిస్తున్నారని తెలియచేశారు.

పట్టణంలో ప్రదర్శనలకు అనువైన స్థలం లేకపోవడం వలన "ఏనుగుల దొడ్డి" కళా ప్రదర్శనలకు రూ. 100/- వ్యయమై అవడంవలన ఔత్సాహిక కళాకారులు తమ ప్రదర్శనలిచ్చుటకు వెనుకంజ వేస్తున్నారని సమాఖ్య అధ్యక్షులు శ్రీ డి. వై. సంపత్ కుమార్ వెలిబుచ్చారు ఒకనాడు కళలను కళాకారులను పోషించిన విజయనగరం రాజులు ఈనాడు "ఏనుగులదొడ్డి" కళాకారుల నుండి అద్దె వసూలు చేస్తున్నందుకు ఆవేదన వెలిబుచ్చారు. ఈ యిబ్బందులు లేకుండావుంటే దానికి సత్వరం ఆడిటోరియం నిర్మాణానికి అందరూ పూనుకోవాలని కోరారు.

కరువు పరిస్థితిపై పులివెందుల తాలూకా రైతు సంఘ సదస్సు

పులివెందుల, డిసెంబరు 26

పులివెందుల తాలూకాలోని కరువు పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యల విషయంలో ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలను సూచించే నిమిత్తం తాలూకా రైతు సదస్సు ఇటీవల ఇక్కడ జరిగింది. సదస్సుకు జిల్లా యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ కె. లింగమూర్తి అధ్యక్షత వహించారు.

సమావేశంలో జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ కె.వి నాగిరెడ్డి, కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎన్. శివరామరెడ్డి తాలూకా రైతుసంఘ కార్యదర్శి శ్రీ ఎ మునిరెడ్డి తదితరులు కరువు పరిస్థితులను రైతు లెదుర్కొంటున్న యిబ్బందులను వివరించారు శిస్తురెమిషన్ యివ్వాలని, రుణాలు వసూలు వాయిదా వేయాలని వారు కోరారు. వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, బ్యాంకులద్వారా తక్కువ వడ్డీతో రుణాలు యివ్వాలని కోరారు.

15 రోజులలో కరువు బాధితుల మహాసభ నిర్వహించాలని నిర్ణయించి యిందుకు ఒక సంఘాన్ని ఎన్నుకున్నారు

అనంతరం ఒక ప్రతినిధివర్గం తాసిల్దారును కలుసుకొని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మెమొరాండాన్ని అందజేసింది.

క్రీడారంగం

హర్యానాజట్టు సెమీఫైనల్స్‌కు చేరిక : యు. పి. చేతిలో ఆంధ్రప్రదేశ్ ఓటమి

కలకత్తా డిసెంబరు 26

ఇక్కడి నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 25 వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలో నేడుదయం హర్యానా జట్టు పుదుచ్చేరి జట్టును 15-2, 15-7, 15-2 స్కోరుతో ఓడించి సెమి ఫైనల్స్‌లో ప్రవేశించింది.

గ్రూప్ "ఎ"లో హర్యానా జట్టు 12 పాయింట్లను పొంది ఆధిక్యతను సంపాయించింది. గ్రూప్ "డి"లో రన్నర్స్‌గా వచ్చినవారితో హర్యానా జట్టు సెమిఫైనల్స్ ఆడుతుంది

గ్రూప్ "సి"లో ఇంతవరకు ఆడిన 5 మ్యాచ్‌లలో చెరొక 10 పాయింట్లను సంపాయించి రాజస్తాన్, సర్వీసెస్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి

'డి' గ్రూపులో ఉత్తరప్రదేశ్ జట్టు 15-12, 5-15, 15-5, 9-15, 15-7 స్కోరుతో ఆంధ్రప్రదేశ్ జట్టును ఓడించింది.

తుమ్మపూడిలో బ్యాడ్మింటన్ పోటీలు

తెనాలి తాలూకా తుమ్మపూడి గ్రామంలో యూత్ సెంటర్, ఇస్కఫ్‌ల ఆధ్వర్యాన జనవరి 7 నుండి 10 వ తేదీ వరకు బాల్ బ్యాడ్మింటన్ (షైప్స్) పోటీలు జరుగుతాయి.

పోటీలలో పాల్గొనదలచినవారు డిసెంబరు 30 వ తేదీ లోపుగా టీము పేరు, రు. 12 తోసహా యం. శివలింగప్రసాద్, గేమ్స్ సెక్రటరి, తుమ్మపూడి (పోస్టు) తెనాలి తాలూకాకు వివరాలు అందజేయాలి.

బుచ్చిరెడ్డిపాలెంలో చెడుగుడు పోటీలు

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జనవరి 6 నుండి 9 వ తేదీవరకు అఖిలభారత స్థాయిలో చెడుగుడు పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు డిసెంబర్ 31 వ తేదీలోపుగా టీము పేర్లను టోర్నమెంట్ కమిటి కార్యదర్శికి పంపుకోవాలి

అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

అంతర్‌జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 24 న కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో ప్రారంభమయ్యాయి

పశ్చిమ గోదావరిజిల్లా బాలికల జట్టు గుంటూరు మహిళల జట్టును 29-27, 26-29, 29-26 స్కోరుతో ఓడించింది.

మరో పోటీలో పశ్చిమ గోదావరిజిల్లా జట్టు విశాఖజిల్లా జట్టును ఓడించింది.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల జట్లు వరుసగా విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం జట్లను ఓడించాయి.

మచిలీపట్నంలో సి. కె. నాయుడు మెమోరియల్ క్రికెట్ పోటీ

మచిలీపట్నంలో సి. కె. నాయుడు మెమోరియల్ క్రికెట్ పోటీలను జిల్లా ప్రజాసంబంధాల అధికారి ఈనెల 23 న ప్రారంభించారు.

ప్రారంభోత్సవసభకు శ్రీ టి. కామేశ్వరరావు అధ్యక్షత వహించారు

పోటీల ప్రారంభ మ్యాచ్‌లో ఉయ్యూరు ఎ. జి అండ్ యస్. జి జట్టు దత్ XI జట్టును 7 పరుగుల తేడాతో ఓడించింది,

ఈపోటీలలో మొత్తం 17 టీములు పాల్గొంటున్నాయి.

పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా జట్టు ఆధిక్యత

అడెలైడ్, డిసెంబర్ 26

ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ల మధ్య ఇక్కడ జరుగుతున్న మొదటి క్రికెట్ టెస్టులో నేడు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా జట్టు తన మొదటిఇన్నింగ్స్‌లో 4 వికెట్లు నష్టానికి 310 పరుగులు చేసింది.

పాకిస్తాన్ తన మొదటి యిన్నింగ్స్‌లో 272 పరుగులు చేసింది.

కర్నాటకచే 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు

మద్రాసులో తమిళనాడు, కర్నాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలో నేడు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి కర్నాటక జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది.

"సాహిత్యంలో విశ్వనాథ పాత్ర"

సామర్లకోటలో గోష్ఠి

సామర్లకోట, డిసెంబరు 26

శ్రీ రాంషా అధ్యక్షతన స్థానిక విజ్ఞాన మండలి సమావేశంలో "సాహిత్యంలో విశ్వనాథ పాత్ర" అను అంశంపై గోష్ఠి జరిగింది.

శ్రీ మంద రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణాధిక్యతను యెలుగెత్తి చాటిన ప్రతిభావంతుడేగాని విశ్వనాథ సమసమాజ రూపకల్పనకు దోహదం చేసిన మనిషి కాదన్నారు కనుక తాను ఆయన సాహిత్యంతో ఏకీభవించలేనన్నారు.

శ్రీ దామిశెట్టి పార్థసారథి మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి పూనుకున్న నేటి ప్రభుత్వం చాందస భావాల ప్రతినిధిగా వున్న శ్రీ విశ్వనాథను ఆస్థాన కవిగా స్వీకరించడమే హాస్యాస్పదమన్నారు.

శ్రీ అప్పలరాజు మాట్లాడుతూ శ్రీ విశ్వనాథ మార్మిక కవితా ధోరణుల నవలంబించి ప్రస్తుత సమాజపు అస్తవ్యస్థస్థితి నుంచి తప్పించుకున్నారనీ, కనుక వారి కవిత్వం శిల్పమైనప్పటికీ, జీవిత తత్త్వం వారి రచనల్లో గోచరించదని అన్నారు.

శ్రీ ఎస్ ఎన్ మూర్తిమాట్లాడుతూ విశ్వనాథ సాహిత్యాన్ని శిరసావహిస్తున్న వారంతా ఆయన భావాలను కూడా శిరసావహిస్తున్నట్లుగానే పరిగణించాలన్నారు.

శ్రీ కల్లూరి సుబ్బారావు మాట్లాడుతూ "ఏ రచయితా రాజ్యాంగ నిర్మాతకాదు కనుక విశ్వనాథ వారి సాహిత్యపు విలువల్ని పరిగణించాలి కాని, సాంఘిక వైఖరిని కాదు" అన్నారు.

శ్రీ బులుసు సూర్యప్రకాశం మాట్లాడుతూ ఆయనది కల్పనా సాహిత్యం. ఆయన పాత్రలు కొన్ని వైఖరులకు సంకేతాలు మాత్రమే నన్నారు.

శ్రీ జోగినాథాచార్యులు మాట్లాడుతూ విశ్వనాథను ప్రతిభావంతుడనే కవులందరూ ఆయన అద్వితీయ ప్రతిభకు శిరసావహించినట్లుగానే లెక్క అన్నారు.

శ్రీ రాంషా తన అధ్యక్షోపన్యాసంలో "జాతి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మత వ్యవస్థలన్నీ కలిపి ఆ జాతికి జాతీయతను కలిగిస్తాయనీ, విశ్వనాథ కవిత్వంలో బ్రాహ్మణమతవిశ్వాసాలుండటం సహజమనీ విశ్వనాథ కవితా ప్రాగల్భ్యాన్ని కేవలం మత దృష్టితో విమర్శించటం తగదు" అని అన్నారు.

చలిగాలులకు పది మంది మృతి

పాట్నా, డిసెంబరు 26

బీహార్‌లో వీస్తున్న చలిగాలుల మూలంగా గత వారంలో నవాద్‌లో మృతి చెందిన నలుగురితో మొత్తం ఇంతవరకు పది మంది మృతి చెందినట్లు నేడిక్కడికి నవాద్ నుండి అందినవార్తలవల్ల తెలుస్తోంది

బొగ్గులారీ బోల్తాపడి 11 మందికి గాయాలు

చిలకలూరిపేట, డిసెంబరు 26

గుంటూరు నుండి ఒంగోలువైపు వెళుతున్న బొగ్గులారి ఈనెల 22 వ తేదీరాత్రి 10 గంటలకు ఇక్కడికి సమీపంలో బోల్తాపడిన ఫలితంగా 11 మందికి గాయాలు తగిలాయి.

గాయపడిన వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

పట్టణ సబ్ ఇన్‌స్పెక్టరు శ్రీ యం. రంగప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

పత్తిపాడు తాలూకా గ్రామాల్లో జిల్లా కలెక్టరు పర్యటన

పెద్దాపురం, డిసెంబరు 26

తూ॥ గో॥ జిల్లా పత్తిపాడు తాలూకా గ్రామాలలో జిల్లా కలెక్టరు శ్రీ యం. వి. రామచంద్రరావు యీనెల 18న జిల్లా ముఖ్య అధికారులతో పాదయాత్రగా చాలా గ్రామాలు తిరిగి 20 అంశాల కార్యక్రమం మేరకు అక్కడికక్కడే కొన్ని కార్యక్రమాలు చేపట్టినారు.

వెలంగిఫిర్కా, చింతలూరు, కరకవరం, గజ్జనపూడి, పోతులూరు, వాకపల్లి, డొప్పర్తి గోకంపేట, కొడవలి, పిఠాపురం తాలూకా గ్రామాలలో సుమారు 12 మైళ్ళు కాలి నడకతో తిరిగి బలహీన వర్గాల హరిజనులు, గిరిజనులు తదితరవర్గాలవారికి గేదెలు ఇళ్ళస్థలాలు అప్పులు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.

తుపానువల్ల దెబ్బతిన్న రోడ్లు, చెరువులు వెంటనే బాగుచేయుటకు అక్కడికక్కడే ఉత్తర్వులు జారీచేశారు

కలెక్టరుతోపాటు జిల్లా పరిషత్ కార్యదర్శి శ్రీ డి పాపారావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ సీతారామస్వామి, పత్తిపాడు తహశీల్దారు శ్రీ యన్ మధుసూదనరావు, పెద్దాపురం ఆర్. డి వో శ్రీ యం శ్రీరామమూర్తి తదితర అధికార్లు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

నౌకలో అగ్నిప్రమాదం; 305 మంది మృతి

కైరో, డిసెంబరు 26

జెద్దాకు 30 కిలోమీటర్ల దూరంలో ఉత్తరాన ఎర్రసముద్రంలో ఒకనౌకకు నిప్పంటుకోవటంలో కనీసం 305 మంది ప్రయాణీకులు మరణించారని భావించబడుతున్నట్లు జెద్దా రేవు వర్గాలను వుటంకిస్తూ అల్అహ్రాం పత్రిక తెలిపింది.

సూయజ్‌కు వెళుతున్న ఈ నౌకలో ప్రయాణం చేస్తున్న వారి సంఖ్యకు సంబంధించి పరస్పర విరుద్ధమైన వార్తలు అందుతున్నాయి. ఖచ్చితంగా ఎంత మంది మరణించింది వివరాలు లభ్యంకాలేదు.

ఈ నౌకలో 305 మంది ప్రయాణీకులున్నట్లు అల్అహ్రామ్‌ను ఉటంకిస్తూ రాయిటర్ తెలిపింది. అయితే ఈ నౌక యజమానులైన అరబ్ నౌక కంపెనీ ప్రతినిధి నౌకలో 471 మంది ప్రయాణీకులున్నట్లు తెలిపారు. మరణించిన వారంతా ముస్లిమ్ భక్తులని, సౌదీ అరేబియాలోని పుణ్యక్షేత్రాల సందర్శన అనంతరం తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని భావించబడుతున్నది.

ప్రదేశ్ గంగపుత్ర సంఘం విజ్ఞప్తి

హైదరాబాదు, డిసెంబరు 2

ప్రదేశ్ గంగపుత్ర-సంఘం అధ్యక్షులు శ్రీ ఎ.ఎల్. మల్లయ్య నాయకత్వాన ఒక ప్రతినిధివర్గం రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి శ్రీ డి. మునుస్వామిని ఇటీవల కలుసుకొని మెమోరాండం అందజేసింది.

1972–73 సంవత్సరంలో వర్షాలు లేక చెరువులు ఎండిపోయాయని, అలా చెరువులు ఎండిపోయినట్లు తాసిల్దార్ల వద్ద నుండి సర్టిఫికెట్లు తెచ్చి యిచ్చినప్పటికి, గతంలో చెల్లించవలసిన బకాయిలను చెల్లిస్తేనే ఈ సంవత్సరం చెరువులను సొసైటీలకు కౌలుకు యిస్తామని అధికారులు తెలియచేస్తున్నారని, అందుచేత బకాయిలను రద్దుచేసి వెంటనే చెరువులను సొసైటీలకు కౌలుకు యిప్పించాలని ఆ మెమోరాండంలో ప్రతినిధివర్గం కోరింది

మెమొరాండంలోని అంశాలను పరిశీలించి అవసరమైన ఉత్తర్వులు అధికార్లకు జారీ చేస్తానని మంత్రి ప్రతినిధివర్గానికి హామీ యిచ్చారు.

ప్రతినిధివర్గంలో శ్రీయుతులు కె. లక్ష్మణరావు, ఎం. సత్యనారాయణ, పి. వై. గిరి, డి. సత్యనారాయణ, పి. రాయిలు, ఎన్. ఈశ్వర్‌లు వున్నారు.

ఫిర్యూబిన్ బంగ్లాదేశ్ పర్యటన పూర్తి

ఢాకా డిసెంబర్ 26

బంగ్లాదేశ్‌లో నాలుగు రోజులపాటు పర్యటించిన సోవియట్ ఉప విదేశాంగ మంత్రి నికొలాయ్ ఫిర్యూబిన్ యీ రోజు కలకత్తా బయలుదేరి వెళ్ళారు.

కలకత్తానుండి ఫిర్యూబిన్ సింగపూర్ వెళతారు.

ఢాకా విమానాశ్రయంలో బంగ్లా దేశ్ విదేశాంగ శాఖ కార్యదర్శి తబరక్ హుస్సేన్ వీడ్కోలు చెప్పారు.

జగ్గయ్యపేట రిక్షా కార్మికుల సంఘ సమావేశం

జగ్గయ్యపేట, డిసెంబరు 26

ఈనెల 19 వ తేదీన జగ్గయ్యపేట రిక్షా వర్కర్సు యూనియన్ సర్వసభ్య సమావేశం శ్రీ కాసరి వీరభద్రాచారి అధ్యక్షతన జరిగింది.

ఈ మధ్య యూనియన్ నిర్మాణంలో ఏర్పడ్డ నిస్తబ్దతను తొలగించుకొని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం అభిప్రాయపడ్డది. సమావేశం ఈ క్రింది కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నది. అధ్యక్షులుగా శ్రీ టి. వి. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీ చెన్నుపల్లి గురునాథం, కార్యదర్శిగా సిమ్మిశెట్టి శరాబంధి, సహాయ కార్యదర్శులుగా బండిలక్ష్మయ్య, అచ్చి చినఎల్లమంద, కోశాధికారిగా ప్రసాదంపాటి సత్యం, మరో ఐదుగురుతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నది.

సమావేశంలో పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు శ్రీ చిలకా పెద వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శ్రీ మళ్ళ కృష్ణ ప్రసంగించారు.

అమలాపురం ఆర్.టి.సి. ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

అమలాపురం, డిసెంబరు 26

అమలాపురం ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం ఈనెల 20 వ తేదీన జరిగింది. సమావేశంలో ఎ. పి. టి. యు. సి, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. వి ఎస్, శర్మ ప్రసంగిస్తూ సిబ్బంది వేతనాల పెంపును సాధించటానికి యూనియన్ చేస్తున్న కృషిని వివరించారు

ఆర్. టి. సి. లో పని చేస్తున్న వారంతా ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరి కోర్కెల సాధనకు తోడ్పడాలని అన్నారు. త్వరలో జరుగనున్న సభ్యత్వ పరిశీలన కార్యక్రమం సందర్భంగా కార్మికులు చేయవలసిన కృషిని వివరించారు.

భారత్‌కు ప్రపంచ ఆహార కార్యక్రమం సహాయం

న్యూఢిల్లీ డిసెంబరు 26

గత 14 సంవత్సరాలలో భారత్, ఐరాస ప్రపంచఆహారకార్యక్రమం భాగస్వామ్యం వల్ల దేశంలోని వివిధ ప్రాంతాలలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాయి.

14 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన ప్రపంచ ఆహార కార్యక్రమం ఇంతవరకు భారత్‌లో 47 ప్రాజెక్టుల అమలుకు రు. 300 కోట్లకుపైగా ఆహార సహాయాన్ని చేసింది ప్రపంచ ఆహార కార్యక్రమం సమీక్షలో ఈ విషయం వెల్లడైంది.

ప్రపంచంలో ప్రపంచ ఆహార కార్యక్రమం సహాయాన్ని ఎక్కువ తీసుకున్న దేశం భారత్

నాగాయలంక పంచాయతీ సిబ్బంది విరాళం

నాగాయలంక డిసెంబరు 26.

కృష్ణాజిల్లా నాగాయలంక పంచాయతీ సిబ్బంది ముఖ్యమంత్రి వరద బాధితసహాయనిధికి ఒక్క రోజు వేతనం మొత్తం రు. 66 92 లను విరాళంగా యిచ్చారు.

5 వేల వ్యవసాయ కార్మిక, 5 వేల రైతు సంఘ సభ్యత్వం

హుజూర్‌నగర్ తాలూకా కమ్యూనిస్టుకార్యవర్గనిర్ణయం

హుజూర్‌నగర్, నవంబరు 27

5 వేల వ్యవసాయ కార్మికసంఘ సభ్యత్వాన్ని 5 వేల రైతుసంఘ సభ్యత్వాన్ని యీ మాసాంతానికి పూర్తి చేయాలని హుజూర్‌నగర్ తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యవర్గం నేడిక్కడ నిర్ణయించింది.

శ్రీ దొడ్డా నర్సయ్య, శ్రీ మేదరమెట్ల మట్టయ్య, శ్రీ దొడ్డానారాయణరావు, శ్రీ కమతం రాఘవయ్య ప్రభృతులు మాతృసంస్థలో చేరిన అనంతరం కమిటీ మొట్టమొదటిసారిగా సమావేశమయింది.

తాలూకాపార్టీ కార్యదర్శి శ్రీ నారాయణరెడి రాష్ట్ర కమ్యూనిస్టుసమితి యిచ్చిన కార్యక్రమాని కనుగుణంగా తీసుకోవలసిన చర్యలు వివరించారు. సమావేశానికి శ్రీ కమతం రాఘవయ్య అధ్యక్షత వహించారు.

విశాలాంధ్ర ఏజెన్సీ

పది కాపీలతో విశాలాంధ్ర ఏజెన్సీని చిలకూరులో ప్రారంభించాలని సమావేశం నిర్ణయించింది. కమ్యూనిజం, కొత్తబాట యువజన పత్రికలకు చందాలు చేర్పించాలని సమావేశం నిర్ణయించింది.

ఆర్. టి. సి. సిబ్బందికి హెచ్చింపు డి.ఎ. వర్తింపుకై వినతి

ఎంప్లాయీస్ యూనియన్ మెమొరాండం

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, డిసెంబరు 27

ఎ. పి. ఎస్. ఆర్. టి. స. యూనియన్ ప్రతినిధివర్గం ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. పి. రంగారావు నాయకత్వాన ఆర్. టి. సి. ఛైర్మన్‌కు, జనరల్ మేనేజర్‌కు, కార్పొరేషన్ సభ్యులకు నేడు మెమొరాండం అందజేసింది.

తమ ఉద్యోగులకు డి. ఎ. పెంచుతూ ఈ సంవత్సరం అక్టోబరు 1 న రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తమకునూ అమలుపరచే విషయమై జరగబోయే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవలసిందిగా మెమొరాండంలో కోరారు.

ఆర్. టి. సి. సిబ్బందికి గతం నుంచి పెంచిన డి. ఎ. రేట్లు చెల్లించాలి. ఇంకా ఇతర సమస్యలను పరిష్కరిస్తూ వెంటనే వేతన ఒప్పందం చేసుకోవాలని మెమొరాండంలో కోరారు.

ఇటీవల ఎ. పి. ఎస్. ఆర్. టి.సి. యూనియన్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు, కార్పొరేషన్ పాలనా కార్యాలయం ముందు నేటిఉదయం పెద్ద ప్రదర్శన జరిపారు ఈకార్యాలయంలో నేటిబోర్డుసమావేశం జరుగనున్నది.

అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీ రంగారావు ఆర్. టి. సి. ఉద్యోగుల నుద్దేశించి ప్రసంగించారు.

'77 లో చైనా

హాంగ్‌కాంగ్, డిసెంబరు 27

1977 లో చైనాకు మూడుసూత్రాలను చైనా కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ హువా కొ ఫెంగ్ నిన్న పెకింగ్‌సభలో చెప్పారు.

— మావో రాజకీయ అనుయాయులు "నలుగురి ముఠాను" విమర్శించడం, బహిష్కృతం చేయడం కొనసాగించండి.

— చైనా కమ్యూనిస్టుపార్టీనాయకత్వాన్ని పటిష్ఠం చేయండి

— జాతీయార్థిక వ్యవస్థను వృద్ధిచేసి మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, మావో రచనల అధ్యయనానికి కొత్త ఉద్యమం ప్రారంభించండి.

ఒక్క తుపాకిగుండు కాల్చకుండా, ఒక్క రక్తంచుక్క చిందకుండా నలుగురి ముఠాసమస్య పరిష్కారమయిందని హువా అన్నారు.



విశాఖపట్నం ఔటర్‌హార్బరు ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి శ్రీ థిల్లాన్, ప్రాజెక్టు నిర్మాణంలో అసువులు బాసిన 39 మంది స్మృతి చిహ్నంగా ఆవిష్కరించిన స్మారకస్థూపం.

15 వేల టన్నుల అధునాతన పరికరాలకు సోవియట్ ఆర్డర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 27

సుమారు 15 వేల టన్నుల అధునాతన పరికరాల సరఫరాకై సోవియట్‌యూనియన్ భారత భారీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌కు ఆర్డర్లు పెట్టింది

ఈ పరికరాల మొత్తం విలువ రు. 38 కోట్లకు పైగా వుంటుంది. ఢిల్లీ దూరదర్శన్‌కిచ్చిన యింటర్వ్యూలో భారీ పరిశ్రమల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సోంధీ చెప్పారు.

సోవియట్ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం శ్రీ సోంధీ యిటీవలనే ఢిల్లీ తిరిగివచ్చారు.

మూడు సంవత్సరాలలో ఈ పరికరాలను భారీ యింజనీరింగ్ కార్పొరేషన్ సరఫరా చేస్తుందని, మూడవ దేశంలోని ప్రాజెక్టులకు యీ పరికరాలను సోవియట్ ఉపయోగించు కుందని ఆయన చెప్పారు,

భారత సోవియట్ యూనియన్‌ల మధ్య పారిశ్రామిక సహకారానికి గత సంవత్సరం భారత, సోవియట్ సంయుక్త కమిషన్ సమావేశంలో నిర్దిష్టరూపం ఏర్పడిందని, యుగోస్లావియాలో సోవియట్‌యూనియన్ నిర్మించే అల్యూమినియం కర్మాగారానికి పరికరాలను సరఫరాచేసే పెద్ద కాంట్రాక్టు గత సంవత్సరం భారత భారీ యింజనీరింగ్ కార్పొరేషన్‌కు లభించింది.

ప్రస్తుతం సోవియట్ ఆర్డర్ చేసిన పరికరాలు వివిధ దేశాలలో కోక్ ఓవెన్, బ్లాస్ట్ ఫర్నేస్, క్రేన్స్, శుద్ధి చేసే యంత్రాలలో ఉపయోగిస్తారు.

నూనె ఉత్పత్తి దేశాలు, కొన్ని వర్ధమాన దేశాలనుండి కూడా యిలాంటి ఆర్డర్లు వస్తాయన్న ఆశాభావంతో వున్నట్లు శ్రీ సోంధీ చెప్పారు.

గురుగోవిందసింగ్ 310 జయంత్యుత్సవం

పాట్నా, డిసెంబరు 26

గురుగోవిందసింగ్ 310 జయంత్యుత్సవం సందర్భంగా సిక్కుల పవిత్ర గ్రంథమైన గురుగ్రంథ సాహెబ్‌ను ఒక రథంలో వుంచి ప్రత్యేకమైన ఊరేగింపు జరిపారు.

దేశంలో వివిధ ప్రాంతాలనుండి వేలాది యాత్రికులు ఊరేగింపులో కలిసి, రథాన్ని లాగారు పెద్ద సంఖ్యలో హిందువులు, ముస్లింలుకూడా ఊరేగింపులో నడిచారు.

168 అడుగులు ఎత్తుగల 7 అంతస్తుల సిక్కు దేవాలయం 'గురుద్వార్'ను అందంగా అలంకరించారు,

ఊరేగింపు 'గురుద్వార్'కు చేరుకుంటుంది.

రేపు బీహార్ గవర్నర్ శ్రీ జగన్నాథ కౌశల్ ప్రధాన ఉత్సవానికి ప్రారంభోత్సవం చేస్తారు.

శిశిర్‌కుమార్ మిత్రా మృతి

పుదుచ్చేరి, డిసెంబరు 26

అరవింద అంతర్జాతీయ విద్యా కేంద్రం జాయింట్ డైరెక్టర్ డా॥ శిశిర్‌కుమార్ మిత్రా నేడిక్కడ మృతిచెందారు.

ఆయన వయస్సు 75 సంవత్సరాలు. బ్రహ్మచారి. ఆశ్రమంలో చేరకముందు శాంతి నికేతన్‌లో ప్రొఫెసర్‌గా వున్నారు.

ఆయన రచించిన గ్రంథాల్లో ముఖ్యమయినవి "శాశ్వత ఉపోద్ఘాతం", "భారత స్వాతంత్ర్యోద్యమం - శ్రీ అరవింద", "అఖండ జ్యోతి పథంలో [illegible]" అనేవి.

ముఠా నాయకుడు కాని ఆచార్య

శ్రీ అంతూలే ప్రకటన

భువనేశ్వర్, డిసెంబరు 27

ఒరిస్సా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నూతన నాయకుడిగా ఎన్నికైన శ్రీ బినాయక్ ఆచార్య స్వతఃసిద్ధంగా ఒక ముఠా నాయకుడుకాదని ఎ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. ఆర్. అంతూలే నిన్న యిక్కడ చెప్పారు

అందువల్లనే ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఆయనను ఎన్నుకున్నారని కూడ అంతూలే అన్నారు.

ఒరిస్సా కాంగ్రెస్ వాదులు ప్రధాన మంత్రిపట్ల విశ్వాసం కలిగివుండడం వలననే శ్రీ ఆచార్య ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని శ్రీ అంతూలే అన్నారు.

కాంగ్రెస్ వాదులు ఐక్యంగా పనిచేయాలని, అలా అయితే బయటివారు ఏలాంటి దాడులు చేయలేరని శ్రీ అంతూలే అన్నారు.

నాగార్జున కొండకు రోప్ వే

గవర్నర్ సూచన

నల్లగొండ, డిసెంబరు 27

నాగార్జున కొండకు రిజర్వాయర్ మీదుగా రోప్‌వే ఏర్పాటు చేయడం వలన యాత్రికులను విశేషంగా ఆకర్షించి, నాగార్జునసాగర్ ఒక యాత్రల కేంద్రంగా మారుతుందని రాష్ట్రగవర్నర్ శ్రీ ఆర్.డి. భండారే నిన్న నాగార్జునసాగర్‌లో తెలిపారు.

నాగార్జునసాగర్ నీటిని నల్లగొండ పౌరులకు నీటి సరఫరాకై వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ నియంత్రణను పాటించే దంపతులకు యింకా ఎక్కువ ప్రోత్సాహకాలను ఇవ్వడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు.

అంబికాపూర్‌లో ఆకాశవాణి కేంద్రం

శ్రీ ఎస్.సి. శుక్లాచే ప్రారంభం

రాయపూర్, డిసెంబర్ 27

బిలాస్‌పూర్ డివిజన్‌లో ఆదివాసిజిల్లా సుర్గుజా జిల్లా కేంద్ర కార్యాలయం అంబికాపూర్‌లో ఆకాశవాణి కేంద్రానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ శ్యామ్‌చరణ్ శుక్లా నిన్న ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు కేంద్ర సమాచార ప్రచార శాఖ మంత్రి శ్రీ విద్యాచరణ్ శుక్లా అధ్యక్షత వహించారు.

అంబికాపూర్ కేంద్రం దేశంలో 79 వ ఆకాశవాణి కేంద్రం అవుతుంది. వెనుకబడిన ఈప్రాంత అభివృద్ధికి ఈ రేడియో కేంద్రం ప్రముఖ పాత్ర వహించగలదన్న ఆశాభావాన్ని శ్రీ శ్యామ్‌చరణ్ శుక్లా వ్యక్తం చేశారు. దేశంలో అభివృద్ధి కార్యక్రమాలను పెంపొందించడంలో ఆకాశవాణి ఎంతో కృషి చేస్తోందని కూడా ఆయన అన్నారు.

పోర్చుగల్ మునిసిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ విజయాలు

లిస్బన్, డిసెంబర్ 27

పోర్చుగల్ మునిసిపల్ ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ ఓటింగ్‌ను 17.7 శాతానికి పెంచుకుని దేశంలో మూడవరాజకీయ పార్టీగా ఆవిర్భవించగా అధికారపార్టీ పలుకుబడి తగ్గింది. తీవ్రమితవాద, ఉగ్రవాద పక్షాలు ఓటమి పాలయ్యాయి.

డిసెంబర్ 12 ఎన్నికలలో ప్రధాని మారియోసోర్స్‌కు చెందిన సోషలిస్టుపార్టీకి గత వసంతంలో వచ్చిన 35 శాతం ఓట్లు 33.34 కు తగ్గాయి. నిరుద్యోగం ద్రవ్యోల్బణం తగ్గించడంలో సోర్స్ వైఫల్యం దీనికి కారణమని భావిస్తున్నారు.

కమ్యూనిస్టుపార్టీ ఈ ఎన్నికలలో ఏర్పరచిన ఐక్యసంఘటన (ఫ్రంటేయునిడో) కు పోల్ ఓట్లతో సహా మొత్తం 18.42 శాతం ఓటు వచ్చాయి.

కమ్యూనిస్టు, సోషలిస్టు ఓట్లు కలిపితే 51.7% శాతం. అంటే గతంలో కార్మికులు సాధించిన విజయాల రక్షణకేగాక వాటిని విస్తరించడానికి కూడా కావలసినంత పార్లమెంటరీ మెజారిటీ ఉంటుంది. కానీ సంయుక్త కార్యాచరణకు కమ్యూనిస్టుపార్టీ అనేకసార్లు ఇస్తున్న పిలుపులను సోషలిస్టు పార్టీ నిరాకరించింది.

ఏమైనా అనేక స్థానిక స్థాయిల్లో కమ్యూనిస్టు, సోషలిస్టు సహకారం సాగింది. ఫలితంగా కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదానికి స్వస్తిచెప్పి సహకారానికి సిద్ధపడాల్సిందిగా సోర్స్‌పై సోషలిస్టుపార్టీలో నుండే ఒత్తిడి రాగలదని భావిస్తున్నారు.

బలాబలాలు

ఆదివారం ఎన్నికల అనంతరం పరిస్థితి ఇలా ఉంది:

నష్టాలు ఎదురై ప్రతిష్ట తగ్గినప్పటికి సోషలిస్టుపార్టీ ఏకైక పెద్ద పార్టీగా కొనసాగుతోంది. 24.3 శాతం ఓట్లతో మధ్యేవాద సోషల్ డెమొక్రాటిక్‌పార్టీ రెండవ స్థానంలో ఉంది.

ఈ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ తృతీయ స్థానానికి చేరింది. సాంప్రదాయకంగా బలీయమైన లిస్బన్ - సేటుబాల్ పారిశ్రామిక ప్రాంతాలలోనేగాక ఉత్తరాన ముఖ్యమైన విజయాలు సాధించడం దీనికి కారణం.

ఇంతకాలం ఉన్న తృతీయ స్థానాన్ని కోల్పోయినది సోషల్ డెమొక్రాటిక్ సెంటర్ పార్టీ. ఇది భూసంస్కరణలను, 1974 ట్రేడ్‌యూనియన్ చట్టాలను వ్యతిరేకించిన మితవాద పార్టీ.

నయా ఫాసిస్టు ముఠాలతో చేతులు కలిపి కమ్యూనిస్టుపార్టీపై దాడులు సాగించినఅనేక ఉగ్రవాద గ్రూపులు ఈ ఎన్నికల్లో చావు దెబ్బతిన్నాయి. గత సంవత్సరంలో వీరంతా నిలబెట్టిన అధ్యక్ష అభ్యర్థి మేజర్ ఒటిలో సరైవా కార్వాలో (అత్యంత ప్రాముఖ్యం గల వైనిక భద్రతాదళం మాజీ అధిపతి) కు అనాడు 16.1 శాతం ఓట్లురాగా ఇప్పుడా ఓట్లు కేవలం 2.42 శాతానికి పడిపోయాయి.

డి. ఎం. కె. కు మాజీ ఎం. పి. రాజీనామా

మద్రాసు, డిసెంబరు 27

డి. ఎం. కె. మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ ఎస్. ఎస్. మరిస్వామి తన పార్టీకి రాజీనామా ఇచ్చారు.

డి. ఎం. కె. అవలంబిస్తున్న భాషోన్మాద, ప్రాంతీయ దురభిమానాలపట్ల నాయకత్వం అత్యాశపట్ల తనకు కనువిప్పు కలిగించిందని ఆయన పత్రికా సమావేశంలో వెల్లడించారు.

శ్రీ మరిస్వామి 1964 లో స్వతంత్ర టికెట్‌పై రాజ్యసభకు ఎన్నికయ్యారు. తిరిగి 1970 లో అదే టికెట్‌పై డి. ఎం. కె. తోడ్పాటుతో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1972 లో ఆయన డి. ఎం. కె లో చేరారు. గత ఏప్రిల్ నాటికి ఆయన రాజ్యసభసభ్యత్వ గడువు ముగిసింది.

ఏ పార్టీలో చేరకుండా ఇండిపెండెంట్‌గానే వుంటూ డి.ఎం.కె.అనుసరిస్తున్న భాషోన్మాద ప్రాంతీయ దురభిమాన పంతత్వాలకు వ్యతిరేకంగా పోరాడడానికి నిర్ణయించుకున్నానని ఆయన చెప్పారు.

తాను 1972లో రాజాజీ నాయకత్వాన్ని త్రోసిరాజని డి. యం. కె లో చేరడమే మూర్ఖత్వమని, డి. యం. కె పేదలకోసం కృషి చేస్తున్నదని నమ్మి అందులోచేరానని ఆయనన్నారు.

రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలన్న డి. యం. కె. డిమాండ్ కూడా పేదలకు మరింత మేలుచేస్తుందనుకున్నానని డి. యం. కె. నాయకుల నిజ స్వరూపం గ్రహించకముందే ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం జరిగిందని ఈ గత పదిమాసాలుగా డి. యం. కె. నాయకత్వం బోలుతనాన్ని, ప్రాంతీయ దురభిమానాన్ని గుర్తించానని ఆయనన్నారు

పచ్చి అవినీతి, అక్రమ పద్ధతులద్వారా ఆర్జించిన సొమ్మును ఎలాగైనానసరే కాపాడుకోవాలనే "కాసీక మన సత్యం తవ్వ" డి. యం. కె. నాయకత్వానికి మరొక విధానమేదీ ఉన్నట్లు కనిపించదని ఆయన అన్నారు.

అక్రమ పద్ధతుల్లో సంపాయించినదానిలో ఎక్కువ భాగం పార్టీ అగ్రనాయకత్వానికే దక్కిందని కార్యకర్తలకేమీ రాలేదని తెలిపారు.

రాజాజీ, కామరాజ్ హయాంలో తమిళనాడు పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అగ్రస్థానం సంపాయించగా కరుణానిధి పాలనలో అది కాస్త కిందికి దిగజారిందని విమర్శించారు.

దేశంలోని అన్ని పార్టీలకు చెందిన జాతీయ వాదులు డి.ఎం.కె విధానాలను వ్యతిరేకించాలని కోరారు.

ఒక విలేకరి ప్రశ్నకు సమాధానమిస్తూ కొందరు ఆరోపించినట్లు తాను కరుణానిధికి మార్గదర్శకత్వం వహించలేదని పైపెచ్చు కొన్ని సందర్భాల్లో పార్టీ నాయకత్వం తననే బలిపశువుగా వాడుకున్నదని శ్రీ మరిస్వామి చెప్పారు.

విష పదార్థాల చట్టం సవరణకు విజ్ఞప్తి

అహ్మదాబాద్, డిసెంబర్ 27

విషం అమ్మడాన్ని నిషేధించడం మాత్రమేగాకుండా, నాటు సారాయిలో సారాంశంగా వాడే మిథైల్ఆల్కహాల్‌లాంటి విషపదార్థాలను కలియుండటం, వాడటాన్ని కూడా నిషేధిస్తూ చట్టాన్ని సవరించాలని కేంద్రాన్ని కోరడం జరిగింది.

మిథైల్ ఆల్కహాల్‌తో కూడిన నాటు సారాయి త్రాగడంఅనేది అనేకమంది మరణాలకు దారితీసిందని, దీనిని మద్యపాన నిషేధ చట్టం క్రింద అదుపు చేయాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు దృష్ట్యా కేంద్రానికి రాష్ట్రాలు సంయుక్తంగా విజ్ఞప్తి చేశాయి.

బ్రెజ్నెవ్‌తో భేటీకి కార్టర్ యోచన

న్యూయార్క్, డిసెంబర్ 27

అణ్వాయుధ పరిమితిపై చర్చలు సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నెవ్‌తో వచ్చే సెప్టెంబరులో చర్చలు జరపాలని అమెరికా అధ్యక్షులు కానున్న జిమ్మీ కార్టర్ భావిస్తున్నారని "టైమ్" పత్రిక వెల్లడించింది.

ఇరువురి ఉన్న అణ్వాయుధ పాటవాలను మరింత తగ్గించేందుకు పునాదులు వేస్తాం. ప్రస్తుతమున్న అణ్వాయుధాలను ధ్వంసం చేయడం మా లక్ష్యం అని "టైమ్" విలేకరులకు కార్టర్ చెప్పారు.

మిసైలు, శిలిముఖాల సంఖ్యను ఇప్పటి స్థాయిలోనే ఆపడంతో సహా అణ్వాయుధ సమస్యపై తాను, బ్రెజ్నెవ్ పరస్పరం అభిప్రాయాలను దౌత్య మార్గాల ద్వారా తెలుసుకున్నామన్నారు.

నేర పరిశోధక శాఖ ఎఫ్. బి. ఐ. అటార్ని జనరల్‌కు మరింత ప్రత్యక్షంగా బాధ్యులుగా ఉండేట్లు చేస్తానన్నారు. తన భార్య రోజలిన్ అమెరికా ప్రభుత్వానికి సంచారరాయబారిగా ఉండగలదని తెలిపారు.

యూరప్ కమ్యూనిస్టుల పట్ల కార్టర్ వైఖరి

తన విదేశాంగ విధానం గురించి కార్టర్ కింది అంశాలు చెప్పారు:

—ఫ్రాన్స్, ఇటలీ ప్రభుత్వాలలో కమ్యూనిస్టులు పాల్గొనడం అమెరికాకు "అత్యంత" ఆందోళన కలిగిస్తున్నది. ఆ ప్రభుత్వాలలో కమ్యూనిస్టులు ఎంత స్థాయిలో పాల్గొంటారు? ఆ దేశాలలో ప్రజాస్వామ్యంపై ప్రజలకు గౌరవం, విశ్వాసం ఎంతవరకూ సడలిపోయాయి? అన్న, అంశాలపై అమెరికా ధోరణి ఆధారపడి వుంటుంది

—పసిఫిక్‌లో అమెరికా "న్యాయమైన పాత్ర"ను కొనసాగిస్తుంది. జపాన్ దక్షిణ కొరియాలకు ఆందోళన కలిగించే అర్థాంతర చర్యలేమీ తీసుకోబోము.

—పశ్చిమాసియాపై తిరిగి జెనీవాసభ ఏర్పరచేముందు ఆ సభలో అమెరికా పాత్రపై నిర్ణయించేందుకు ముందుగా అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయిల్, ఈజిప్టు సిరియా నాయకుల సమావేశం జరగాలి.

—ఆఫ్రికా దక్షిణాన మెజారిటీ మైనారిటీల మధ్య పరస్పర గౌరవం, "ఒక వ్యక్తి - ఒక ఓటు" సాధించడం మా అంతిమలక్ష్యం.

సామాజిక మార్పులపై ప్రజలకు వివరణ

శ్రీ బారువా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 26

~~[illegible]~~

ప్రస్తుతం దేశంలో వస్తున్న సామాజిక మార్పులను గురించి గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేయవలసిందిగా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ డి. కె. బారువా నేడు తమ పార్టీ కార్యకర్తలను కోరారు.

ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రెండవ రాజకీయశిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

ఈ దిశలో మహాత్మా గాంధీ జరిపిన కృషిని గుర్తు చేస్తూ, ప్రధాని శ్రీమతిగాంధీ నాయకత్వాన యిప్పుడు కూడా ఆ కృషి కొనసాగించబడుతున్న దన్నారు.

ఎ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీమతి పూరబీముఖర్జీ ప్రసంగిస్తూ కాంగ్రెసు సిద్ధాంతం అనుభవం, వాస్తవాలను ప్రాతిపదికగా కలిగి వున్నదని, అందువల్లనే పెద్ద సంఖ్యలో అనుచరులను కలిగివున్నదని అన్నారు.

రూ. 1000 కోట్ల డిపాజిట్ల సేకరణ

కెనరా బ్యాంక్ సంకల్పం

మంగుళూరు, డిసెంబరు 26

జాతీయం చేసిన కెనరా బ్యాంకు 1977 సంవత్సరంలో వెయ్యికోట్ల రూపాయల డిపాజిట్లను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించింది. 1976 వ సంవత్సరంలో 800 కోట్ల రూపాయల డిపాజిట్లను మాత్రమే సేకరించినట్లు ఆ బ్యాంకు ఛైర్మన్ శ్రీ సి. ఇ. కామత్ నేడిక్కడ తెలియజేశారు.

రేపు యిక్కడ కెనరా బ్యాంకు 1001 వ బ్రాంచిని ప్రారంభించనున్న సందర్భంగా పత్రికా విలేకరులతో మాట్లాడుతూ జాతీయం చేయబడిన బ్యాంకుల్లో ఈ బ్యాంకు డిపాజిట్ల సేకరణలో 5 వ స్థానంకల్గి వుందని చెప్పారు.

1977సంవత్సరం-లోమరో వంద బ్రాంచీలు ప్రారంభించాలనే లక్ష్యాన్ని నిర్ణయించినట్లు తెలిపారు.

రంగస్థల నటుడు చిరుమామిళ్ళ మృతి

పెనుకూరుపాడు డిసెంబరు 26

గుంటూరుజిల్లా కంఠంపాడు వాస్తవ్యులు, ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటు వలన మరణించారు. వేమవరం గ్రామానికి భజన నేర్పడానికి వెళ్ళి, అక్కడ మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకొని వచ్చి అంత్యక్రియలు జరిపారు.

కురుక్షేత్రం నాటకంలో ఆయన కృష్ణ పాత్రను ధరించి పలువురి ప్రశంస లందుకున్నారు.

ముఖ్యమంత్రికి వడ్రంగి కార్మికుల మెమోరాండం

తక్షణ సహాయానికై

రేపల్లె, డిసెంబరు 26

ఇటీవల వరుసగా సంభవించిన మూడు తుపానుల ఫలితంగా నష్టపోయిన వడ్రంగి కార్మికులకు వెంటనే సహాయం చేయాలని రేపల్లె తాలూకా కార్పెంటర్ల యూనియన్ ఇటీవల ముఖ్యమంత్రికి పంపిన మెమోరాండంలో విజ్ఞప్తి చేసింది.

తాలూకాలో మొత్తం 850 మంది ఈ ~~[illegible]~~ అనేక [illegible] చేరిందారు. పోషణ [illegible] ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకొని సహాయం చేయాలని మెమోరాండంలో కోరారు.

బాపట్లలో సాంప్రదాయ చిత్ర కళా ప్రదర్శన

బాపట్ల, డిసెంబర్ 27

స్థానిక చిత్రకళా సంస్థ లలితకళాకేంద్ర 4 వ వార్షిక చిత్రకళా ప్రదర్శన 1977 మార్చిలో మొదటి వారంలో జరుగనుంది.

ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలోని చిత్రకారులు తమ చిత్రాలను పోటీనిమిత్తం ప్రదర్శన నిమిత్తం ఫిబ్రవరి 7 వ తేదీలోగా "కార్యదర్శి లలిత కళాకేంద్రం, బాపట్లకు పంపాలని కోరుతున్నారు.



తాబీ వరినాట్లు-జాగ్రత్తలు

(1)కొన్ని ప్రాంతాలలో తాబీ వరి నారు ఇప్పుడు నాటటానికి తయారుగా వుంది. ఇటువంటి చోట్ల నారును సరైన పద్ధతిలో పొలంలో నాటుకోవాలి. గుత్తులు గుత్తులుగా, దూరదూరంగా ఎక్కువ లోతుగా నాటకుండా కుదురుకు ఒకటి, రెండు మొక్కల చొప్పున దగ్గరగా-దగ్గరగాతక్కువలోతుగానాటుకోవాలి. వరుసల మధ్య ఆరు అంగుళాలు, వరుసల్లో మొక్కల మధ్య నాలుగు అంగుళాల దూరం వుండేటట్లు, మూడు సెంటీమీటర్ల లోతుకు మించకుండా నాటాలి. ముఖ్యంగా అధిక దిగుబడి వరికాడులతో నాట్లు జరిపించేటప్పుడు నారును మూడు సెంటీమీటర్ల లోతుకు మించి నాటకూడదు. ఎక్కువ లోతుగా నాటినట్లయితే పైరు పిలకలు తొడగటం తగ్గిపోయి దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం వుంది. అందుకని నాటేటప్పుడు ఇటువంటి మెళకువలను పాటించటం లాభదాయకంగా వుంటుంది.

కొబ్బరికి ఎరువు

(2)కొబ్బరితోటలకు ఈనెలలోఇంకా ఎరువులను వేయని చోట్ల ఇప్పుడు వెంటనే వేయాలి. ఒక్కొక్క చెట్టుకు బాగా మాగిన పశువుల ఎరువు నలభై ఐదు కిలోలు, బూడిద తొమ్మిది నుండి పద్దెనిమిది కిలోలు చొప్పున వేయవచ్చు. లేదా వేప పిండి ఏడు కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఒకటి నుండి ఒకటిన్నర కిలోల చొప్పున వేయవచ్చు లేదా వేరుశనగ పిండి ఏడు నుండి పదమూడు కిలోలు, కట్టెల బూడిద తొమ్మిది నుండి పద్దెనిమిది కిలోలు, సూపర్‌ఫాస్ఫేట్ ఒకటి, ఒకటిన్నర కిలోల చొప్పున వేయవచ్చు. ఇవి కాకుండా ఒక్కొక్క చెట్టుకు అరవై ఐదు కిలోల పచ్చి ఆకు ఎరువును కూడ వేసి మట్టిలో కలిసేటట్లు చేయాలి.

3. ఆంధ్రప్రదేశ్ జాగరి మాన్యుఫాక్చరర్స్ ఆర్డరు ప్రకారం క్రషర్లను గాని పవర్ క్రషర్లను గాని ఉపయోగించి రోజుకు ఐదు క్వింటాళ్ళకు మించి బెల్లం, పటిక బెల్లం వగైరా తయారు చేసే వారు ముందుగా లైసెన్సు పొంది వుండాలి. ఈ లైసెన్సు పొందటానికిగాను నిర్ణీతమైన దరఖాస్తుతో ముప్పై రూపాయల ఫీజును ప్రభుత్వ ట్రెజరీలో కట్టి ఆ ట్రెజరీ రసీదును వారి దరఖాస్తుతో జతపరచాలి.

ధాతువుల లోపాల తొలగింపుకు సూచన

1. తాబీ లేక రబీవరిని సాగుచేసే చోట్ల పోషక ధాతువుల లోపాలు వల్ల పైరు పెరుగుదల దెబ్బ తినకుండా చూచుకోవాలి. అవసరమైన మోతాదులలో పైరుకు వీటిని సకాలంలో వేయాలి. మన రాష్ట్రంలోచాలా ప్రాంతాలలో భాస్వరం జింక్‌వంటి పోషక పదార్థాలు భూములలో లోపించి వున్నాయి. కనుక యిటువంటి చోట్ల వీటిని అవసరమైనంత మేరకు పైరుకు అందచేయవలసి వుంటుంది. భాస్వరము లోపించిన భూములలో రెండు, మూడు పంటకాలాల వరకు హెక్టారుకు డెబ్బది ఐదునుండి వంద కేజీల చొప్పున భాస్వరాన్ని దమ్ములో వేయాలి. తరువాత పంట కాలంలో హెక్టారుకు ఇరవై ఐదు నుండి ముప్పయి కేజీల చొప్పున భాస్వరాన్ని వేస్తే సరిపోతుంది. ఈ విధంగా వేయటం వలన భాస్వరము లోపం ఎక్కువగావున్న భూములలో క్రమేపీ ఈ లోపం సవరించబడి తరువాత నుండి భాస్వరము మోతాదు తగినంతగా వుంటుంది. అదే విధంగా జింక్ లోపించిన భూముల్లో కూడా ఈ లోపాన్ని ముందుగానే సరిదిద్దుకోవాలి. ఎకరానికి ఇరవై కేజీల చొప్పున జింక్ సల్ఫేట్‌ను దమ్ములో వేసినట్లయితే పైరులో జింక్ లోప లక్షణాలు ఏర్పడకుండా వుంటాయి ఒకసారి జింక్ సల్ఫేటును వేసినట్లయితే మళ్ళీ రెండు, మూడు పంట కాలాల వరకు వీనిని వేయనవసరం వుండదు.

2. శనగ పైరుకు ఇప్పుడు పచ్చపురుగు వచ్చే అవకాశం వుంది. ఈ పురుగులు లేత ఆకులను, కాయల్లో పెరుగుతున్న గింజలను తినివేసి నష్టం కలుగజేస్తాయి. ఆ విధంగా తినేటప్పుడు పురుగు వెనుక సగభాగం వెలుపల వుంటుంది. ఈ పచ్చ పురుగుల నివారణకు శనగ పైరు మీద యాభై శాతం డి. డి. టి. పొడిని ఎకరానికి రెండు కిలోలచొప్పున లేదా ముప్పైఐదు శాతం ఎండోసల్ఫాన్‌ను ఎకరానికి నాలుగువందల యాభై మిల్లీలీటర్ల చొప్పున నీటిలో కలిపి పైరు మీద చల్లాలి.

(డి. ఐ. సి. ఆర్)

డాక్టర్ రాజేంద్రప్రసాద్ బహుమతులు

న్యూఢిల్లీ, డిసెంబరు 26

భారత వ్యవసాయ పరిశోధనా పరిషత్తు వారు 1975 లో వ్యవసాయ, పశుపాలనా రంగములలో ఉత్కృష్ట గ్రంథ రచనకు డాక్టర్ రాజేంద్రప్రసాద్ జ్ఞాపకార్థము ఈ క్రింది బహుమతులను ప్రకటించారు.

మొదటిబహుమతి "బీజ్ ఉత్పాదన్ ఏవం ప్రమాణీకరణ్" అను మౌలిక గ్రంథమునకు ప్రథమబహుమతి లభించింది. దీనిని గోవింద వల్లభ్‌పంత్ విశ్వవిద్యాలయమునకు (పంత్ నగర్) చెందినడాక్టర్‌రత్తన్ లాల్‌అగర్‌వాల్‌కి ఇచ్చారు. వీరు ప్లాంట్ బ్రీడింగ్ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు

రెండవ బహుమతి రు 2,000 ఢిల్లీ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగమునకు చెందిన డాక్టర్ గణేష్ శంకర్ పాండేకి ఇవ్వబడింది. వీరి "ఆర్థిక వనస్పతి శాస్త్ర" అనే గ్రంథానికి ఈ బహుమతి ఇవ్వబడింది

"ఖేతీ" బహుమతులు

భారత వ్యవసాయ పరిశోధనా పరిషత్ హిందీ విభాగం ప్రచురిస్తున్న మాసపత్రిక 'ఖేతీ'లో 1975-76 సంవత్సరాలలో ప్రచురింపబడిన వ్యాసాలలో శ్రేష్ఠమయినవిగా నిర్ణయింపబడిన రెండు వ్యాసాలకు బహుమతులు లభించాయి.

'ఖేతీ' "మత్ కాటో జంగిల్ మత్ కాటో" అనే శ్రీమతి విమలా బహుగుణ రచించిన వ్యాసానికి రు.500, శ్రీ వక్రమోహన్‌సింగ్ రచించిన "పశు ఓంయేకు పోషణ్ కీ బీమారియా" అనే వ్యాసానికి రు. 500 లు బహుమతిగా లభించాయి.

ఇటీవల యిక్కడ జరిగిన భారత వ్యవసాయ పరిశోధనా పరిషత్తు వార్షిక సర్వసభ్య సమావేశంలో బహుమతులను విజేతలకు కేంద్ర మంత్రి శ్రీ షానవాజ్ ఖాన్ అందచేశారు.

బకాయిలతో భూఅభివృద్ధి బ్యాంకుల రుణకార్యక్రమాన్ని ముడిపెట్టే విధానం

సడలించాలని జాతీయ సహకార యూనియన్ సూచన

న్యూఢిల్లీ, డిసెంబరు 27

భూమి అభివృద్ధి బ్యాంకుల రుణ కార్యక్రమాన్ని బకాయిలతో ముడిపెట్టే ప్రస్తుత విధానాన్ని సడలించాలని భారత జాతీయ సహకార యూనియన్ రిజర్వుబ్యాంకుకు ప్రతిపాదించినట్లు తెలుస్తున్నది.

రుణాలలో 50 శాతాన్ని బలహీనవర్గాల వారికి కేటాయించాలని కేంద్ర భూమి అభివృద్ధి బ్యాంకుల సమాఖ్య దేశంలోని అన్ని భూమి అభివృద్ధిబ్యాంకులకు సలహా ఇచ్చిందని సహకార యూనియన్ వర్గాలు తెలియజేశాయి. రుణాల మంజూరు కార్యక్రమాన్ని బకాయిల వసూలుతో ముడిపెట్టే రిజర్వుబ్యాంకు పథకం కారణంగా రుణ విస్తరణ కార్యక్రమం అమలు విషయంలో భూమి అభివృద్ధి బ్యాంకులు ఆచరణాత్మకమయిన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

భూమి అభివృద్ధి బ్యాంకులు తమ నూతన సభ్యులకు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తున్నందున, రిజర్వుబ్యాంకు ఆంక్షల ఫలితంగా నూతన సభ్యులకు, బలహీన వర్గాలవారికి పెట్టుబడులకు అవసరమగు ఆర్థిక సహాయాన్ని అందజేయలేక పోతున్నాయి. అంతేకాకుండా స్వల్పకాలిక వ్యవసాయకరుణాలను అందచేసే కార్యక్రమం కూడా. భూమి అభివృద్ధి బ్యాంకులు చేపట్టటం లేదు ఫలితంగా ప్రకృతివైపరీత్యాలకుగురైన ప్రాంతాలలో బకాయిలు పెరిగిపోవడం. దానివల్ల రుణాల మంజూరు కార్యక్రమాన్ని సడలించడం లేదా నిలిపివేయడం జరుగుతుంది.

ఈ పరిణామం గ్రామీణ ప్రాంతాలలోని బలహీన వర్గాలవారి ప్రయోజనాను దెబ్బతీస్తుందని సహకార యూనియన్ ఆందోళనను వ్యక్తంచేస్తున్నది. అందుచేత ప్రస్తుత విధానాన్ని సవరించి, రుణాల మంజూరు కార్యక్రమానికి దెబ్బతగలకుండా బకాయిలను వసూలుచేయటానికి వీలువడే విధానాన్ని రూపొందించాలనిరిజర్వుబ్యాంకుకు సహకార యూనియనే సూచించింది.

బలహీనవర్గాలవారికి అధికంగా రుణాలను మంజూరు చేయుటానికిగాను భూమి అభివృద్ధి బ్యాంకులు తమ రుణ కార్యక్రమాలను బహుముఖంచేయాలని, తద్వారా ఉపాధి ప్రాతిపదికగల రుణాలను బలహీన వర్గాలవారికి మంజూరు చేయాలని సూచించింది.

కేంద్ర సహకార బ్యాంకులకు సంబంధించి, డిపాజిట్ల సమీకరణలో కేంద్ర సహకార బ్యాంకులు రుణాలను తీసుకొనే కార్యక్రమాన్ని ముడిపెట్టే ప్రభుత్వ విధానాన్నిసవరించాలని రిజర్వుబ్యాంకుకు సూచించింది. (వి. పి. ఎ)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మేజరు ప్రాజెక్టు డిపార్టుమెంటు
శ్రీశైలం ప్రాజెక్టు, సివిల్ సర్కిల్

టెండరు నోటీసు నెం. 7 SE/76-77

పై సూచించిన టెండరు నోటీసులో గల తారీకులు మరలా యీ దిగువ ఉదహరించిన విధముగా సవరించబడినది.

వ. నెం.	అయిటములు	తారీకులు
1.	టెండరు తీసుకొనుటకు చివరి తేదీ	28-1-1977
2.	టెండరు పారములకు దరఖాస్తులు తీసుకొనుటకు చివరి తేదీ	12-1-1977
3.	టెండరు పారములు యిచ్చు కాలము	17-1-1977 నుండి 25-1-1977 వరకు

మిగిలిన యితర షరతులలో ఎట్టిమార్పు లేదు.

శ్రీశైలంప్రాజెక్టు
24-12-1976

ఎల్. ఆర్. కపూర్
సూపరింటెండింగ్ ఇంజనీరు,
సివిల్ సర్కిల్, శ్రీశైలం ప్రాజెక్టు

ఛీఫ్ ఇంజనీర్ వారి కార్యాలయము
పంచాయతీరాజ్ - హైదరాబాదు.

చిట్ టెండరు నోటీసు

నెం. 1/76-77 తేది. 13-12-1976.

1976-77 మరియు 1977-78 సంవత్సరాలకు రేటు కాంట్రాక్టు లోనికి చేరుటకు గాను ప్రసిద్ధి చెందిన మరియు గుర్తింపబడిన స్టాండింగ్ సప్లయిదారుల నుండి ఈ క్రింది వస్తువులు తయారుచేసి, సప్లయి చేసి, డెలివరీ చేయుటకు సీలువేసిన టెండర్లు ఈ క్రింది సంతకందారునిచే కోరబడుచున్నది.

టెండరు షెడ్యూలు, నమూనాల కొరకు అయిటంకు ఎదురుగా చూపబడిన మొత్తమును చెల్లించి చీఫ్ ఇంజనీరు, పంచాయతీరాజ్, హెచ్. నెం. 3-4-849, బరకత్‌పుర, హైదరాబాదు 500027 వారి నుండి తీసుకొనవచ్చును. టెండరుషెడ్యూళ్ళ ఖరీదు ఎట్టి పరిస్థితులలోనూ తిరిగి ఇవ్వబడదు. టెండరు షెడ్యూళ్ళు 3-1-77 నుండి 8-1-77 వరకు పొందవచ్చును.

పై పేరా (2) తెలిపిన విధంగా నిర్ణీత పారములలోనే పెట్టుకున్న టెండర్లు 11-1-1977 సాయంత్రం 3.00 గంటల లోపల చీఫ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ వారి కార్యాలయం నుండి పొందవచ్చును. టెండర్లు స్వీకరించు తేదీ ప్రత్యేకంగా సెలవు రోజు అయినట్లయితే టెండరు తరువాత పనిరోజున స్వీకరించబడును.

టెండర్లు అదే రోజు సాయంత్రం 3-30 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్లు లేక వారి ఏజెంట్ల సమక్షంలో చీఫ్ ఇంజనీర్ లేక వారిచే నియమింపబడినవారిచే తెరువబడును.

ఇతర వివరాలు ఏమైనా కావలసినవారు ఆఫీసు పనిచేయు వేళలలో పొందవచ్చును.

టెండరు షెడ్యూళ్ళ ఖరీదు చలాను ద్వారా ఈ క్రింది అకౌంట్ హెడ్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, పత్తర్‌ఘట్టి బ్రాంచి, హైదరాబాదుకు చెల్లింపాలి. టెండరు షెడ్యూళ్ళ ఖరీదునకు చెక్కులు, డ్రాఫ్టులు, మనియార్డర్లు అంగీకరించబడవు.

"847. డిపాజిట్ ఆఫ్ లోకల్ ఫండ్స్-నాట్ బేరింగ్ ఇంటరెస్ట్
(ఎ) డిస్ట్రిక్ట్ ఫండ్స్
(బి) పంచాయత్ బాడీ ఫండ్స్
iii) జిల్లా పరిషత్ ఫండ్స్
i, జనరల్ ఫండ్స్ ఆఫ్ (హైదరాబాదు)

వరుస నెం.	మెటీరియల్ వివరం	టెండరు షెడ్యూలు ఖరీదు	చెల్లించవలసిన ఇ.యం.డి.
		రూ. పై.	రూ.
1.	డిపార్ట్‌మెంటల్ నమూనా ప్రకారం డబుల్ గైర్ హాండ్ పంప్సుకు స్పేర్ పార్టులు తయారుచేసి, సప్లయి చేసి డేలివరీ ఇచ్చుట.	15 60	2000/-

DIPR 2117/76. పర్ చీఫ్ ఇంజనీర్ (ఏ. ఆర్.)

కొత్తగూడెంలో రిక్షాల పంపిణీ చేసిన శ్రీ సంజయగాంధీ

వాస్తవ జీవిత చిత్రణ ప్రాతిపదికగా రచనలు

హైదరాబాద్ అరసం మహాసభలో వక్తల ఉద్ఘాటన

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాదు, డిసెంబరు 27

సమకాలీన సామాజిక వ్యవస్థ విసాకల్యంగా పరిశీలించి వాస్తవ జీవిత చిత్రణ ప్రాతిపదికగా అభ్యుదయ రచనలు చేయవలసిందిగా ప్రఖ్యాత రచయిత శ్రీ దాశరధి రంగాచార్య, శ్రీ కుందుర్తి, శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీమతి పరిమళా సోమేశ్వర్ ప్రభృతులు నేడు పిలుపునిచ్చారు.

హైదరాబాదు అ. ర. సం. నాల్గవ మహాసభల ప్రారంభోత్సవసభ వేదికనుండి ప్రసంగిస్తూ వారు పై విధంగా విజ్ఞప్తి చేశారు. ప్రఖ్యాత నవలా రచయిత రాష్ట్ర అరసం కార్యదర్శివర్గ సభ్యులు శ్రీ దాశరధి రంగాచార్య మహాసభలను ప్రారంభిస్తూ సమకాలీన సమాజాన్ని అర్థంచేసుకొని బలహీనవర్గాలు తదితర పీడిత ప్రజల పక్షాన నిల్చి ప్రజలచే ఆలోచింప చేయాలని రచనలు చేయాల్సిందని తమ ఉత్తేజకర ప్రసంగంలో ఉద్ఘాటించారు.

ఈ కాలంలో అభ్యుదయ శక్తులు మాత్రమే నిలబడగలవు సమాజాన్ని వెనక్కు నడిపించాలని కోరే శక్తులకుతావులేదని శ్రీ రంగాచార్య హర్షధ్వానాల మధ్య ఉద్ఘాటించారు.

మహాసభ నేడు ఉదయం 10-30 గంటలకు ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయింది. నగరంలోని పలువురు కవులు, రచయితలు వర్ధమానుల నుంచి సుప్రసిద్ధులవరకూ హాల్లో నిండిపోయారు.

1971 లో హైదరాబాద్ అరసం తొలి మహాసభలో కూడా తాను ప్రారంభోత్సవం ప్రసంగం గావించానని ఈ అయిదు సంవత్సర కాలంలో రాష్ట్రంలో రచయితల అందరికి ప్రాతినిధ్యంవహించే సంస్థగా అరసం అభివృద్ధికావడం హర్షదాయకమని ఆయన అన్నారు.

మహాసభకు అధ్యక్షవర్గంగా శ్రీ మతి పరిమళ సోమేశ్వర్ శ్రీమతి యలమంచిలి తాయారు వ్యవహరిస్తున్నారు.

రచయితలు, కవులు వాల్మీకికాలంనుండి కూడా సమాజ శ్రేయస్సు సమాజ కల్యాణం ఆదర్శంగా రచనలు చేశారు. తమ కాలం నాటి సమాజాన్ని రచనల్లో భద్రపరచడానికి కృషి చేశారు.

అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడడానికి చాలాకాలంముందుమండే అభ్యుదయ సాహిత్యం ఆవిర్భవించి వుండవచ్చు. అరసంలో లేకపోయినా పలువురు రచయితలు అభ్యుదయ సాహిత్యాన్ని రాస్తూండవచ్చుని అయితే సమాజ వాస్తవిక చిత్రీకరణంతో బలహీన వర్గంపట్ల పక్షపాతం వహించే ఏ రచనయైనా అభ్యుదయ సాహిత్యంగా అరసం భావించి గౌరవిస్తోందని శ్రీ రంగాచార్య స్పష్టీకరించారు.

అయితే రచయితకు కావల్సిందినిజాయితీ అత్యంత జటిలమైన వార్త మన సమాజాన్ని అవగతము చేసుకోగలశక్తి వుండాలి సమాజంలో నిరుద్యోగాలు, దురంతాలకుకారణం స్పష్టంగా తెలుసుకొని ఆ కారణాలను నిర్మూలించేందుకు చిత్తశుద్ధితో రచనల ద్వారా ప్రయత్నించాలని ఆయన అన్నారు.

విద్యుత్ నుబట్టి నాగరికతను లెక్కగడతారు. ఒకదేశ సంస్కృతి సాంప్రదాయాలు లెక్కగట్టేందుకు యితర కళలతోబాటు దేశ రచనలే గీటురాయి. మిగతా కళల కన్న ఎంతదూరమైనాసరే వెళ్ళ స్పష్టంగా అభిప్రాయాలను చెప్పగలిగే రచయితల రచనలే అని శ్రీ రంగాచార్య తెలిపారు.

"రచయితలు ఎన్నుకోబడని ప్రజాప్రతినిధులు ఎవరు పంపని రాయబారులు" అని ఆయన అన్నారు.

రచనలు ఎంతదూర తీరాలకు ఎక్కువ మందికి చేరతాయి అన్నది రేడియో కేంద్రాలాగా ఆరచయిత ప్రసారశక్తిపై ఆధారపడి వుంటుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ అరసం అధ్యక్షవర్గ సభ్యులు వచన కవితా పితామహులు శ్రీ కుందుర్తి ఆంజనేయులు రాష్ట్ర అరసం తరపున సందేశమిస్తూ మార్క్సిస్టు దృక్పథం వున్నా లేకపోయినా జాతీయ దృక్పథం వున్నవారెవరయినా విశ్వజీవితసత్యాలకు దగ్గరిగా వాస్తవ జీవిత చిత్రణ ప్రాతిపదికగా చేసిన రచనలను అభ్యుదయంగా పరిగణిస్తామని తెలిపారు.

ఈనాటి సమస్య అధిక వ్యాఖ్యానాల తొలగింపడం అన్నారాయన.

వర్తమాన కాలంలోని రచయిత ఎవరయినా సరే ఈయన "11 వ శతాబ్దంలో పుట్టి వుంటే రాణించేవాడు" అనిపించ కూడదన్నారు. ఏ యుగంలో కవి ఆ యుగానికి ప్రతినిధిగా వుండాలి. మార్పులు రావడం కాలస్వభావం అని ఉద్ఘాటించారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు సందేశమిస్తూ తాను వ్యక్తిగా అభ్యుదయ సాహిత్య వుద్యమానికి సన్నిహితుడనని ప్రకటించారు. "దిగిరాను దివినుండి భువికి" అని రాయటంగాని "నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు" అని రాయడంగాని ఈ రోజుల్లో ఎవరైనాచేస్తే అది సాహిత్యంగా తాను పరిగణించబోనని ఆయన పేర్కొన్నారు.

కవిత్వం జీవితాన్ని గురించిన ఒక విమర్శగా వుండాలని ఉద్బోధించారు.

ప్రపంచంలో ఎంతదూరంలో ఏ సంఘటన జరిగినా అది యితర ప్రాంతాల వారిని ప్రభావితం చేస్తున్న రోజులివి. మారుతున్న కాలానికి అనుగుణమైన రచనలు కావాలి అని ఆయన ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు కార్మిక నాయకులు శ్రీ ఎస్. బి. గిరి సందేశమిస్తూ కార్మికులు, రైతులు యితర వృత్తికారులకు సమాజంలో కల్పించాల్సిన స్థానాన్ని గురించి తమ రచనల్లో ప్రబోధించాలని అభ్యుదయ రచయితలకు విజ్ఞప్తి చేశారు. గత అయిదు ఏండ్లుగా హైదరాబాద్ అరసం తో తన సన్నిహితత్వాన్ని వివరించారు.

ఆంధ్రప్రదేశ్ ఆఫ్రో-ఆసియా రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి, జాతీయ సంఘకార్యవర్గసభ్యులు శ్రీ నిడమర్తి ఉమారాజేశ్వరరావు సందేశమిస్తూ వివిధ దేశాల్లో ప్రజా పోరాటాలలో నించి వుద్భవించిన సాహిత్యాన్ని తెలుగులోకి, తెలుగులో నుండి యితరభాషల్లోకి తర్జుమా చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

నగర యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ వెంకటేష్ సందేశమిస్తూ సమాజంలో అవినీతికి, దుర్మార్గానికి వ్యతిరేకంగా యువజనులు జరిపే పోరాటాలకు అభ్యుదయ రచయితల రచనలు ఎంతో ఉత్తేజం కల్గిస్తున్నాయని, అభ్యుదయ రచయితల వుద్యమానికి తమ సంస్థ సంఘీభావాన్ని ప్రకటించారు.

అభ్యుదయ యువ రచయితలను ప్రోత్సహించాలి

అభ్యుదయ దృక్పథంతో సమాజంలో మార్పును ఆహ్వానిస్తూ రచనలు చేసే యువ రచయితలను ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుందని ప్రముఖ చిత్రకారుడు, కవి శ్రీ శీలా వీర్రాజు నేడు విజ్ఞప్తిచేశారు.

అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు చురుకైన కార్యకర్త శ్రీ చిగుళ్ళ వ్రాసిన విప్లవ నవ్వులు గేయ సంకలనాన్ని హైదరాబాద్ అ. ర. సం. మహాసభలో ఆవిష్కరిస్తూ ఆయన పైవిధంగా కోరారు.

తిరోగమన దారులనుండి సాహిత్యానికి రక్షించాలన్నారు. చేసే పనులకు చెప్పేవాటికి సంబంధంలేని, చిత్తశుద్ధిలేని' రచయితలను శ్రీ శీల వీర్రాజు విమర్శించారు.

హైదరాబాద్ అ. ర. సం. నాలుగవ మహాసభ ప్రారంభంలో ప్రజానాట్యమండలి కళాకారులు ప్రముఖ కవి కీర్తిశేషులు తెన్నేటి సూరి రచించిన "ఏ కవిని బతికించుకోవాలిరా" అన్న గీతాన్ని వుత్తేజకరంగా ఆలపించారు. (వి. వి.)

చిత్తూరుజిల్లా కమ్యూనిస్టు సమితి ఆఫీసు మార్పు

తిరుపతి, డిసెంబరు 27

చిత్తూరుజిల్లా కమ్యూనిస్టు సమితి ఆఫీసు యిక్కడి వేశాలమ్మ గుడివీధి (కొత్తకోట్లు) లోని ఇంటి నెం. 17-1-196 ఎ (మేడ పైన)కు మార్చబడింది.

సభలు - సమావేశాలు

నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతి పరుల సమావేశం 1977 జనవరి 1 వ తేదీన ఉదయం 10 గంటలకు ఆత్మకూరులో జరుగుతుంది.

* * *

కావలి తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతి పరుల జనరల్‌బాడీ 1977 జనవరి 1 వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు కావలిలో జరుగుతుంది.

* * *

వరంగల్‌జిల్లా మానుకోట తాలూకా కమ్యూనిస్టుపార్టీ సభ్యుల, సానుభూతిపరుల సమావేశం 1977 జనవరి 4వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు శ్రీరామగిరిలో జరుగుతుంది.

* * *

నెల్లూరుజిల్లా గూడూరు తాలూకా యువజనసమాఖ్య సదస్సు గూడూరులోని జి.ఎస్. రాయుల సత్రంలో 1977 జనవరి 1 వ తేదీన మధ్యాహ్నం 1 గంటకు జరుగుతుంది.

* * *

పాలకొండ తాలూకా విద్యార్థి సమాఖ్య 3 గంటలకు పాలకొండలో జరుగుతుంది.

* * *

ఈ నెల 29 న రాజోలు, 30 న రామచంద్రపురం, 31 న రాజమండ్రిలో జరిగే విద్యార్థి సమాఖ్య జనరల్‌బాడీ సమావేశాలలో రాష్ట్ర విద్యార్థి సమాఖ్య కార్యదర్శి శ్రీరాం నరసింహారావు పాల్గొంటారు.

వరకట్నం నిర్మూలనకు ప్రతిన

హైదరాబాద్ సదస్సులో ముగ్గురు మహిళల ఉద్బోధ

హైదరాబాద్, డిసెంబరు 25

వరకట్నం ఆచారం ఎలా వచ్చింది? దాన్ని నిర్మూలించడమెలా అన్నసమస్యపై ముగ్గురు ప్రముఖ మహిళలు వివిధ విశ్లేషణలు, సూచనలిచ్చారు.

"వరకట్నంపై ప్రజాతంత్ర పోరాటం" అనే నినాదంతో అఖిలభారత విద్యార్థిసమాఖ్య హైదరాబాద్ యువమహిళా విభాగం సభ జరిపింది. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన తెలుగు లెక్చరర్ డాక్టర్ రావి భారతి ఎకనామిక్స్ లెక్చరర్ శ్రీమతి మణిశాస్త్రి, తెలుగు రీడర్ ప్రముఖ రచయిత్రి శ్రీమతి నాయని కృష్ణకుమారి ప్రసంగించారు.

డబ్బుకాదు - సంస్కారం

శ్రీమతి భారతి ఇలా అన్నారు:

జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో విద్యార్హతలు, డబ్బు హోదాకాక సంస్కారానికి విలువ నివ్వాలి. అనాదిగా ఆడది దోపిడీకి గురయింది. వేదకాలంనుండి నేటి సాహిత్యంవరకూ ఈ దోపిడీకి ఉదాహరణలు కోకొల్లలు.

కర్మతత్వం కూడా 'ఇలాంటి ఆలోచన' అనే పెంచిపోషించింది. ఆడవాళ్ళలో యుగాలుగాఉన్న నిస్సహాయత ఆధారపడే ధోరణిని తొలగించడానికి యువమహిళలు ముందుకు రావాలి యువతులు కరాటే పోరాటం నేర్చుకోవటం మంచిది.

ఒకే వర్గంలో ఉండే మూసనుండి ఆడవాళ్ళు బయట పడాలి. అప్పుడే జీవిత భాగస్వామిని స్వతంత్రంగా ఎంచుకోగలరు. కేవలం చట్టాలద్వారా సంస్కరణ రాదు. సంపూర్ణ సామాజిక పరివర్తన అవసరం. అది వర్గపోరాటంపై ఆధారపడి ఉంటుంది.

శ్రీమతి మణిశాస్త్రి ఇలా అన్నారు:

"ప్రైవేటు ఆస్తి హక్కున్న పెట్టుబడిదారీ వ్యవస్థ విషపుత్రిక ఈ వరకట్నం. దీనికి రెండే పరిష్కారాలు: సంపూర్ణ సామాజిక పరివర్తన - అంటే ప్రైవేటు ఆస్తి హక్కు రద్దు. స్వతంత్రంగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం.

శ్రీమతి నాయని కృష్ణకుమారి ఇలా అన్నారు. వరకట్నం వ్యక్తిగత సమస్య. దీన్ని వ్యక్తిగత చొరవతో పరిష్కరించాలి. సాంప్రదాయిక వివాహం చేసుకోబోమని యువతులు ప్రతిన బూనాలి. మంచి వ్యక్తిత్వం రూపొందించుకోవాలి.

మొదట శ్రీమతి ప్రేమపావని స్వాగతం పలికారు. నగర యువ మహిళా కమిటీ కన్వీనర్ కుమారి అరుణ అధ్యక్షత వహించారు.

సామాజిక పరివర్తనకై సాగే పోరాటంలో అందరూ కలిసి రావాలని అఖిల భారత యువ మహిళా విభాగం కన్వీనర్ శ్రీమతి విజయలక్ష్మి పిలుపిచ్చారు. కుమారి అరుణ వందన సమర్పణచేస్తూ ముఖ్యమంత్రికి సమర్పించనున్న యువ మహిళ డిమాండ్ల పత్రంపై సంతకాల కార్యక్రమానికి సహకరించాలన్నారు.

మార్కెట్ ధరలు

విజయవాడ, డిసెంబరు 27

విజయవాడ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ నేడు అందజేసిన 24-12-76 నాటి టోకు ధరలు (క్వింటాల్‌నకు సంచి ఖర్చులు, పన్నులు మినహా)

ధాన్యం

	మసూరి	అక్కుళ్ళు
విజయవాడ	120.00	110.67

బియ్యం

విజయవాడ	210.00	190.00

అపరాలు

	కందులు	మినుములు
విజయవాడ	160.00	258.00
రాజమండ్రి	165.00	260.00
గుంటూరు	180.00	255.00
	పెసలు	శనగలు
విజయవాడ	160.00	150.00
రాజమండ్రి	165.00	—
గుంటూరు	155.00	150.00

వేరుశనగ

	తవ్వా	నూనె
విజయవాడ	—	800.00
నంద్యాల	—	740.00

బెల్లం

	1వ రకం	2వ రకం
తాడేపల్లిగూడెం	168.00	153.00

ధనియాలు

	పాతవి
విజయవాడ	875.00

పసుపు

	కొమ్ములు	దుంపలు
దుగ్గిరాల	457.00	288.00
కడప	—	—

చింతపండు

	1వ రకం	2వ రకం
విజయవాడ	480.00	420.00

కొబ్బరికాయలు

	(1000) కొత్తవి	పాతవి
[illegible]	925.00	1025.00

మిర్చి

	1వ రకం	2వ రకం
గుంటూరు	575.00	435.00

బంగారం-వెండి

బంగారం స్టాండర్డు10 గ్రాములు	557.00
వెండి ప్యూర్ (కిలో)	1192.00

రేడియో

బుధవారం - డిసెంబరు 29
శక 1898 ,, పుష్య 8

హైదరాబాద్-ఎ

ప్రసారము I

6.00 వందేమాతరం, మంగళధ్వని: కార్యక్రమ వివరణ: 6-10 భక్తిరంజని: 6.40 సుభాషితాలు: 6.45 పొలం పనులు: 6.55 ఆదిలాబాద్ జిల్లా సమాచారలేఖ: 7.00 వ్యాఖ్య: 7-15 జానపద గేయాలు: 7.30 చిత్రసీమ - మర్మయోగి, అర్థాంగి, మహాకవి క్షేత్రయ్య వేములవాడ భీమకవి, మొనగాడు, తులసి, రాముడే దేవుడు. ముగ్గురు మూర్తులు: 8.30 వి. ఎస్. అనంతరావు - వీణ: 9.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

ప్రసారము II

12.0 ప్రాథమిక పాఠశాలలకు-ఎద్దుల సింహం కథ: 12.20 హిందీ పాఠం: 12-40 కార్మికుల కార్యక్రమం: 1.00 చిత్రసీమ - మంచి మనుషులు, పొరుగింటి పుల్లకూర, అమ్మా - నాన్న, అభిమానం, మనుషులు మారాలి, నిర్దోషి: 1-20 పాడి - పంట: 1.40 మహిళాసమాజం: 2.10 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5.15 కర్ణాటక సంగీతం 5.35 సంగీత శిక్షణ (విజయవాడ నుండి): 5.40 పాట: 6.05 స్థానిక ప్రకటనలు, 6.10 పద్యసౌరభం: 6.25 గ్రామసీమలు - పద్య పఠనం బి. టి. వి. రమణయ్య: 6.40 మాటా - మంతీ: 7-15 పంటసీమలు: 7.45 వార్తావాహిని: 8.00 మీరు కోరిన పాటలు: 8.30 ప్రసంగం: 8.45 లలిత సంగీతం - వి. విశ్వం: 9.30 సంగీతోత్సవం: 11.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

ప్రసారము I

5-55 వందేమాతరం భక్తి రంజని: 6-00 ప్రసార విశేషాలు 6.05 దేశభక్తి గేయం. 6.10 భక్తిరంజని: 6.40 సూక్తావళి: 6.45 పొలం పనులు 6.55 జిల్లా సమాచారలేఖ: 7-15 జానపదగేయాలు: 7-30 నూతన సోపానాలు: 7.40 ఈమాసపు పాట: 7.45 చిత్రతరంగిణి: 8.30 ఇంద్యాల సత్యనారాయణమూర్తి - గానం: 9.00 ప్రసార సమాప్తి.

ప్రసారము II

11-45 చిత్రతరంగిణి: 12.05 ఇంద్యాల సత్యనారాయణమూర్తి - గానం: 12.40 కార్మికుల కార్యక్రమం: 1.00 పాన్నా - పొగాకు: 1.0 చిత్రతరంగిణి: 1.20 వనిడి వంటలు: 1.30 మహిళా సమాజం స్త్రీల కార్యక్రమం: 2.10 చిత్రతరంగిణి: 2.30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5-15 యువవాణి, 5-30 సంగీత శిక్షణ ([illegible]): 5-45 లలిత సంగీతం 6-05 కబుర్లు; 6.25 ప్రసార విశేషాలు: 6-30 యువవాణి: 7-00 మార్కెట్ ధరలు: 7-15 పంటసీమలు: 7-45 వార్తావాహిని: 8-00 సాహితీ ప్రవంతి విహారి స్వీయకవిత - పి రాధాకృష్ణమూర్తి ప్రసంగం: 8-15 పదండి ముందుకు- పరిచయాలతో కూర్చిన కార్యక్రమం: 8.30 వాద్యబృందం: 9.15 ఆంగ్లమున: 9.30 సంగీతోత్సవం: 11-00 ప్రసార సమాప్తి.

5 వ తరగతి కామన్ పరీక్షలు !
"శ్రీ గిరిజా టెస్టు పేపర్సు"
తెలుగు, సోషల్, సైన్సు, లెక్కలు, ఇంగ్లీషు
వీనిపై 24 ప్రశ్న పత్రములు - జవాబులు కలవు
అన్ని సబ్జక్టు ఒకే పుస్తకంలో - వెల: రు. 3-00
"శ్రీ గిరిజాగైడ్స్" - 3, 4, 5 తరగతులకు
మిక్కిలి ఉపయుక్తములు !
రచన: శ్రీ బి. శోభనాచలం
ప్రచురణ: శ్రీ గిరిజా పబ్లికేషన్సు, విజయవాడ-1.


కలతల్ని, కష్టాల్ని, ఆత్మీయులంతా ఎదుర్కొని భిన్నాభిన్నమైన సంసారాన్ని చక్కదిద్దిన ఆదర్శప్రాయమైన ఒక అన్నయ్యకథ!
డిసెంబర్ 30 విడుదల!
ఉదయం ఆటతో
పెద్దన్నయ్య
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పి.డి.ప్రసాద్
నిర్మాత: టి.అప్పదాస్
లక్ష్మీ పిక్చర్స్



విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్, అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు. ఎడిటరు : [illegible], ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ-520004. R. No. 1138/57